ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం  fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-1-2025 మంగళవారం సంపుటి: 30 సంచిక: 347 పేజీలు: 8+16 వెల: 6.50



భారత్ సరిహద్దులో చైనా సైనిక విన్యాసాలు 5

నలుగురు పిల్లల్ని కంటే రూ.లక్ష నజరానా


## శుభాకాంక్షలు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్



సెలవు

పండుగ సందర్భంగా మంగళవారం 'వార్త' కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 16వ తేదీ గురువారం

# పెట్టుబడుల హబ్ తెలంగాణ

## గత యేడాది దావోస్‌లో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్లు రాక



దావోస్ పర్యటన, పరిశ్రమల శాఖపై సోమవారం సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో శ్రీధర్‌బాబు

**హైదరాబాద్‌లో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేస్తాం..**

**16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు సిఎం దావోస్ పర్యటన**

**పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** పెట్టుబడులకు గమ్యస్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు.గత ఏడాది ప్రభుత్వం తో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి. అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.గత ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో >>2

## కాశ్మీర్‌కు కొత్త నగ

**సోనామార్గ్ టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ**



సోమవారం కాశ్మీర్‌లో సోనామార్గ్ టన్నెల్‌ను ప్రారంభించిన అనంతరం కాలినడకన పరిశీలిస్తున్న ప్రధాని మోడీ

**శ్రీనగర్, జనవరి 13:** రాష్ట్రంలోని గాందర్‌బల్ జిల్లాలో నిర్మించిన జడ్‌మోడ్ సొరంగాన్ని ప్రధాని నరేంద్రమోడీ సోమవారం ప్రారంభించారు. తర్వాత టన్నెల్‌లోపలికి వెళ్లి పరిశీలించారు. జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా, ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ లేహ్ జాతీయ రహదారిపై సోన్‌మార్గ్ ప్రాంతంలో రూ.2700 కోట్లతో దీన్ని నిర్మించారు. కొండచరియలు, >>2



ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేస్తున్న లక్షలాది మంది భక్తులు

# మహాకుంభ్ ఆరంభం

**45 రోజులపాటు జరుగనున్న ఆధ్యాత్మిక వేడుకలు**

**మెరుగైన సౌకర్యాలు, అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు**

**ప్రయాగరాజ్, జనవరి 13:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక పండుగ మహాకుంభమేళా సోమవారం ఘనంగా ప్రారంభం అయింది. గంగా యమున సరస్వతి నదుల సంగమ ప్రదేశం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు భక్తులు పోటెత్తారు. పుష్యపౌర్ణమి అయిన సోమవారం తెల్లవారుజామునుంచే లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమానికి చేరుకుని పవిత్రస్నానాలు చేస్తున్నారు. భక్తుల పూజలతో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఉదయం 7.30 గంటలవరకే దాదాపు 35 లక్షలమంది ఇక్కడ పవిత్రస్నానాలు ఆచరించారని ప్రయాగరాజ్‌మహాకుంభ్ కమిటీ ప్రకటించింది. 45రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాలనుంచి కోట్లాదిమంది భక్తులు పర్యాటకులు రానున్నారు. మొత్తం 40 కోట్లమంది వస్తారని యుపి ప్రభుత్వం అంచనావేస్తోంది. భక్తులకు మెరుగైన >>2

యుపి సర్కార్‌కు రూ.2 లక్షలకోట్ల ఆదాయం 2

# 4 పథకాలకు 45 వేల కోట్లు

**పారదర్శకంగా పథకాల అమలు: డి.సిఎం భట్టి**

**ప్రతి వ్యక్తికి ఆరు కేజీల సన్న బియ్యం: మంత్రి ఉత్తమ్**

**పథకాల అమలు నిరంతర ప్రక్రియ: మంత్రి పొంగులేటి**

**26 నుంచి పథకాలు ప్రారంభం: మంత్రి కోమటిరెడ్డి**

**సాగు భూమికే రైతు భరోసా: మంత్రి తుమ్మల**

**ఖమ్మంలో మంత్రుల సమీక్షలు**




ఖమ్మంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 13, ప్రభాత వార్త:** పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల లబ్ది చేకూర్చాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.సోమవారం రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాల అమలుపై ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌లతో కలిసి సమీక్షనిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం.భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల నిర్మాణం, మెస్ చార్జీలు 40శాతం, కాస్మొటిక్ చార్జీల పెంపు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, రైతులకు ఇచ్చిన మాట మేరకు 21 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని, సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ అందించామని అన్నారు.ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 కొత్త పథకాలను గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయాలని నిర్ణయించి ఈ పథకాలకు ప్రభుత్వం దాదాపు 45 వేల కోట్లకు పైగా ఖర్చు చేయబోతుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు 22 వేల 500 కోట్లు, రైతు భరోసా 18 వేల కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం అదనంగా ఖర్చు చేయాల్సి ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేర కట్టుబడి అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి పథకంపై సంపూర్ణంగా చర్చించి మార్గదర్శకాలు జారీచేశామని అన్నారు.రైతుభరోసాకు సంబంధించి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉండి భూమిలేని వ్యవసాయ కుటుంబాలు 20రోజులు ఉపాధి హామీ పని చేసినట్లయితే >>2

జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి 3



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టు

**హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న కరీంనగర్ పోలీసులు**

**కరీంనగర్ ప్రతినిధి,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డినీ సోమవారం హైదారాబాద్‌లో కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదారాబాద్ జూబ్లిహిల్స్‌లో ఓ ప్రైవేట్ ఛానల్‌లో ఇంటర్వ్యూ ముగించుకొని >>2

## ఇందిరమ్మ 'అత్మీయ భరోసా'కు 10 లక్షల మంది అర్హులు



**ఆర్థిక సాయం కోసం యేటా రూ.1200 కోట్ల అవసరం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి13:** తెలంగాణ రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కూలీల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సుమారుగా 10 లక్షల మంది అర్హులు ఉంటారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రాథమికంగా అంచనా వేశాయి. భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. దీనికి అనుగుణంగా కసరత్తు చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ... రాష్ట్రంలో 29 లక్షల మంది కూలీలకు వ్యవసాయ భూమి లేదని తేల్చింది. ఏడాదిలో కనీసంగా 20 రోజులైన ఉపాధి హామీ పనులు చేసిన వారినే లబ్ధి దారులుగా ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. దాని ప్రకారం ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరం ఏడాదిలో దాదాపుగా 10 లక్షల మంది కూలీలు 20 రోజుల పాటు పనిచేసినట్లు వెల్లడైంది. ఆలెక్కన లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ చేయడానికి ఏటా రూ.1200 కోట్ల మేరకు అవసరమవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అంచనా వేస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయం పథకం అర్హుల నిబంధనలు.. ధరణి పోర్టల్‌లో తమ పేరుపై భూమి లేని వారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాం క్ అకౌంట్ ఉండాలి. బ్యాంకు పాస్‌బుక్‌లకు ఆధార్ కార్డు లింక్ తప్పనిసరిగా ఉండాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు >>2




# కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు



ఢిల్లీలో సోమవారం కిషన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ. మెగాస్టార్ చిరంజీవి తదితరులు

**హాజరైన ప్రధాని మోడీ, స్పీకర్ ఓం బిర్లా, చిరంజీవి తదితర ప్రముఖులు**

**సంక్రాంతి పండగ భారతీయ వ్యవసాయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది: మోడీ**

**హైదరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలుఅంబరాన్ని అంటుతున్నాయి.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కేంద్ర మంత్రి నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, మెగాస్టార్ చిరంజీవి, ఎంపిలుడా.లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, డి.కె.అరుణ సహ పలువురు తెలంగాణ బిజెపి నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారుదత్తాత్రేయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి, >>2




సోమవారం కాశ్మీర్‌లో సోనామార్గ్ టన్నెల్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, కేంద్రమంత్రి గడ్కరీ, సిఎం ఒమర్ అబ్దుల్లా తదితరులు

# మహాకుంభ్ ఆరంభం

>> సౌకర్యాలతోపాటు భద్రత కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసింది. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటుచేసారు. అటు చిన్నచిన్న పడవలపై భద్రతా సిబ్బంది పెట్రోలింగ్‌కూడాచేస్తున్నారు. భారతీయ విలువలు సంస్కృతిని గౌరవించే కోట్లాదిమందికి ఈరోజు చాలాప్రత్యేకమైన రోజని ప్రయాగరాజ్‌లో మహాకుంభ్‌మేళా ప్రారంభం అయిందని,విశ్వాసం భక్తి,సాంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోటచేర్చిందని అన్నారు. మనదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుకప్రతిబింబిస్తుందని పవిత్రస్నానాలు అంచరించి భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉందని మోడీ రాసారు. పదివేల ఎకరాల్లో కుంభ్‌మేళాకు ఏర్పాట్లుజరిగాయని ఏసమయంలో అయినా 50 లక్షలమందినుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే వెల్లడించారు. భద్రతకోసం 55 పోలీస్ స్టేషన్లనుప్రభుత్వం ఏర్పాటుచేసింది. 45వేల మంది పోలీసులను మొహరించింది. సాధువులకు సంబంధించిన 13 అఖాడాలు కుంభమేళాలో భాగం కానున్నాయి.

# పెట్టుబడుల హాబ్ తెలంగాణ

>> రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబుతో సీఎం చర్చించారు.ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన లో ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యానివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు పలు సంస్థలతో సంప్రదింపులు జరుపుతారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. సిఎం వద్ద జరిగిన సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యుపి సర్కార్‌కు రూ.2 లక్షలకోట్ల ఆదాయం

**ప్రయాగరాజ్, జనవరి 13:** ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమంలో అట్టహాసంగా ప్రారంభం అయిన ప్రపంచ ఆధ్యాత్మిక పండుగలో తొలిరోజే 35 లక్షలమందికిపైగాభక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఈసారి 40 కోట్ల మందికిపైగాభక్తులు వస్తారన్న అంచనాలు వేసిన ఉత్తరప్రదేశ్ యోగి ప్రభుత్వానికి ఈ పవిత్ర వేడుకలద్వారా సుమారు రెండు లక్షలకోట్ల రూపాయలకుపైబడి ఆదాయం వస్తుందని అంచనావేస్తున్నారు. నాలుగువేల హెక్టార్లలో భారీ ఏర్పాట్లుచేసిన యుపి ప్రభుత్వం ఫిబ్రవరి 26వరకూ అనుక్షణం భక్తులకు భద్రతకల్పిస్తోంది. ఏడువేల కోట్ల బడ్జెట్ తో రూపొందించిన ఈసౌకర్యాల కల్పన ఎంతో ఆసక్తిగా మారింది. యాత్రీకులు సగటునన ఒక్కొక్కరు ఐదువేలు ఖర్చుచేసినా 40 కోట్లమందినుంచి రెండులక్షలకోట్లవరకూ యుపిరాష్ట్రం ఆదాయం రాబడుతుందని అంచనావేస్తున్నారు. ఒక వ్యక్తి సగటు వ్యయం రూ.10వేలవరకూ ఉంటుందని న్యూస్ ఏజెన్సీలు అంచనావేస్తున్నాయి. ఈ పుష్కర రాబడులు జిడిపిలో ఒకటిశాతంకుపైగా పెరుగుదలను నమోదుచేస్తుందని సర్వేలు చెపుతున్నాయి. 2019లో జరిగిన అర్ధకకుంభమేళాకు 1.2 లక్షలకోట్లరూపాయలు ఆదాయం వచ్చిందని అధికారులు చెపుతున్నారు. ఆరకోజు 24కోట్లమంది భక్తులు సందర్శించారు. ఈ ఏడాది మహాకుంభమేళాకు 40 కోట్ల మంది వసానతరని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి వచ్చిన ఈ మహాకుంభ్‌లో పుణ్యస్నానాలకోసం దేశవిదేశాలనుంచి భక్తులు వస్తారు.

# కాశ్మీర్‌కు కొత్త నగ

>> మంచుకారణంగా రాకపోకలకు సమస్యగా మారడంతో ఇక్కడ టన్నెల్‌ప్రాజెక్టుచేపట్టారు. ఇది సముద్ర మట్టానికి 8650 అడుగుల ఎత్తులో ఉంది. 6.5 కిలోమీటర్ల పొడవుంటే ఈ సొరంగంతో ఏడాదిలో ఏసీజన్‌లో అయినా లడక్ రహదారి మార్గం గుండా చేరుకోడానికివీలవుతుంది. 2015లో ప్రారంభించిన నిర్మాణపనులు గత ఏడాదే పూర్తయ్యాయి. దీనివల్ల సోన్‌మార్గ్‌కు పర్యాటకుల రాకకూడా పెరగనుంది.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టు

>> వస్తున్న క్రమంలో కరీంనగర్ టౌన్ ఎసిపి వెంకటస్వామి ఆద్వర్యంలో కౌశిక్ రెడ్డినీ అరెస్ట్ చేసి కరీంనగర్ కోర్టుకు తరలించారు.ఆదివారం ఉమ్మడి కరీంనగర్ అధికారిక సమావేశంలో జరిగిన ఘటన విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు మేరకు కౌశిక్ రెడ్డినీ అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.. అధికారిక సమావేశంలో ఉమ్మడి జిల్లా అధికారులతో పాటు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.సమావేశంలో ప్రతి ఒక్కరూ మాట్లాడుతూ వారి నియోజక వర్గాల్లో ఉన్న సమస్యలు,అభివృద్ధి చర్చిస్తున్నారు.అదే క్రమంలో జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతున్న సమయంలో కౌశిక్ రెడ్డి అడ్డుపడి నీది ఏ పార్టీ, ఎవరు నువ్వు అంటూ విమర్శించారు..ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్ రెడ్డి తోసేశారు.కౌశిక్ రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు,ఉమ్మడి జిల్లా అధికారులు సైతం నిర్ఘాంతపోయారు.అక్కడే పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్,విజయ రమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్ రెడ్డి వినలేదు.ఎవరు సర్దిచెప్పిన వినకుండా, కౌశిక్ రెడ్డి వినకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు.దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆ రోజు పోలీసులు అతన్ని బయటకు తీసుకెళ్ళారు..కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**కౌశిక్ రెడ్డి పై మల్టిపుల్ కంప్లైంట్స్**

ఈ ఘటనపై మొదట ఆదివారం తన పట్ల కూడా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దురుసుగా ప్రవర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లేశం కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చాడు. ఆ తర్వాత అధికారిక సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ ఫిర్యాదు చేశారు.మరి కొంతమంది కూడా ఈ విషయంపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా సోమవారం స్పీకర్ నీ కలిసి పిర్యాదు చేసిన అనంతరం కరీంనగర్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు,అరెస్ట్ చేశారు.. ఈ కేసుల నేపథ్యంలోనే పాడి కౌశిక్ రెడ్డిని ఇ వాళ జూబ్లీహిల్స్ అరెస్టు చేశారు.కౌశిక్ రెడ్డి పై వచ్చిన అన్ని ఫిర్యాదులో వేర్వేరుగా పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం లేకపోలేదు.. భారీ భద్రతతో కరీంనగర్ తరలింపు: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నీ హైదారాబాద్ లో అదుపులోకి తీసుకున్న భారీ భద్రత నడుమ కరీంనగర్ కోర్టుకు తరలించారు..ఏక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

# 10 లక్షల మంది అర్హులు

>> పనిచేసి ఉండాలి. గ్రామ పంచాయతీ తీర్మానంలో అభ్యంతరాలు ఉండకూడదు.ఈ షరతులన్నింటికి అర్హులైతే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రెండు దశలలో రూ.12 వేల ఆర్థిక సాయం పొందుతారు. తెలంగాణలోని ప్రతి గ్రామ పంచాయతీలో జనవరి 21 నుండి 24వ తేదీ వరకు గ్రామసభ నిర్వహిస్తారు. అందులో లబ్ధిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపిస్తారు. అనంతరం అర్హుల తుది జాబితాను ఆమోదించడం జరుగుతుంది. ఒకవేళ గ్రామ సభలో ఎవరైనా, ఏవైనా అభ్యంతరాలు ఎదుర్కొంటే, సంబంధిత ఎంపీడీఓ వాటిని పరిశీలన చేసి, నిర్ణీత గడువు లోపు సమస్యను పూర్తిగా తెలుసుకుని పరిష్కరిస్తారు.

కాగా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయం పథకం కింద నగదు పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆధార్, జాబ్ కార్డులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు అనుసంధానం కాని, వాటిలో తప్పులు దొర్లిన ఉపాధి కూలీలు కొంత ఆందోళన చెందుతున్నారు. ఈ తప్పులను ఈ నెల 25వ తేదీలోపు సవరించాలని పంచాయతీరాజ్ శాఖ, ఆయా జిల్లాల్లోని అధికారులను ఆదేశించింది. మొత్తం 6,92,921 మంది ఆధార్‌కార్డులలో తప్పులు ఉండగా, ఆదివారం (జనవరి 12) వరకు 4,99,495 మంది సంబంధించిన కార్డులను సవరించారు. జాబ్ కార్డులు, బ్యాంకు పాస్‌పుస్తకాల్లో నమోదైన తప్పులను కూడా సవరిస్తున్నారు. అధికారులు నిర్ణీత గడువులోగా తప్పులను సవరిస్తారా? ఆధార్ లింక్ పూర్తవుతుందా? అని నిరుపేద కూలీలు ఆందోళన చెందుతున్నారు.



సోమవారం సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కైట్ ఫెస్టివల్ దృశ్యం

# కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు

>> లోకసభ స్పీకర్ ఓం బిర్లా, మెగాస్టార్ చిరంజీవి, పివి సింధు, డా.నాగేశ్వర్‌రావులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో కంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జ్యోతిరాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, సతీశ్ చంద్రదూబే, శ్రీనివాస్‌వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపిలు, పారిశ్రామికవేత్తలు, బిజెపి సీనియర్ నేతలు కిషన్‌రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్రమంత్రి నివాసానికి చేరుకున్న ప్రధానిమోడీ కిషన్‌రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడికి శ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందించారు. అదేవిధంగా సంస్కృతిక కార్యక్రమాలను మోడి వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు.

**ఫోటోలను పంచుకున్న ప్రధాని మోడీ**

ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి వద్ద సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఫోటోలను ప్రధాని మోడి ట్విట్టర్‌లో పంచుకున్నారు. దేశ వ్యాప్తంగా సంక్రాంతి, పొంగల్‌ను ప్రజలు సంతోషంగా జరుపుకుంటున్నారని అన్నారు. ఈ పండగ భారతీయ వ్యవసాయ సంస్కృతిని ప్రతిభింబిస్తుందని పేర్కొన్నారు. ఈ శుభ సందర్భంగా ప్రజలు ఆనందంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు.

# 4 పథకాలకు 45 వేల కోట్లు

>> ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు అవుతుందని అన్నారు.ప్రతి పథకానికి లబ్దిదారులను గ్రామ సభ పెట్టి పారదర్శకంగా ఎంపిక చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులను భాగస్వామ్యం చేయాలని,ప్రతి గ్రామ సభలో కార్యక్రమం పెట్టి ప్రభుత్వ లక్ష్యాలు తెలియజేయాలని అన్నారు. జిల్లా మంత్రిచే జాబితా ఆమోదింప చేసుకొని మంజూరు ప్రొసిడింగ్స్ అందజేయాలని అన్నారు. ఎంత మంది రైతులకు ఎంత రుణమాఫీ జరిగింది, ఎంత మంది రైతు భరోసా వస్తుంది, బోనస్ వచ్చిన రైతుల వివరాలు తెలియజేస్తు గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా ఇంఛార్జి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పలు గ్యారెంటీ పథకాలను అమలు చేశామని అన్నారు. పేద ప్రజలకు అత్యంత చేరువయ్యే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను జనవరి 26 నుంచి అమలు చేయబోతున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు చేరడం ఎంత ముఖ్యమో, అనర్హులకు అందకుండా వృధా కాకుండా చూడడం కూడా చాలా కీలకమని మంత్రి తెలిపారు. భూసేకరణ జరిగిన భూములు, రాళ్ళు, రప్పలు ఉన్న భూములు కాకుండా వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా అందుతుందని అన్నారు. గత పాలకుల హాయాంలో రేషన్ కార్డులు అందలేదని, అర్హులందరికీ ప్రస్తుతం రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. రాబోయే 10 రోజులు అధికారులు కష్టపడి గ్రామాలలో తిరిగి అర్హులను ఎంపిక చేయాలని, ఎక్కడ ఎటువంటి పొరపాటు జరగకుండా పకడ్బందీగా కార్యక్రమాలు అమలు కావాలని అన్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రాంతంలో భారీగా నిధులు ఖర్చు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి అధికారులు ప్రజాప్రతినిధులు తీసుకుని వెళ్లాలని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి 12 వేలు అందిస్తామని, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఆహారభద్రత చట్టాన్ని దేశంలో ప్రవేశ పెట్టామని, నూతన రేషన్ కార్డుల జారీ, కార్డులలో నూతన సభ్యుల నమోదు వివరాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. నూతన రేషన్ కార్డుల జారీ అంశంలో అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని, ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తామని అన్నారు. ప్రతి సంవత్సరం సన్న బియ్యం మీద 11 నుంచి 12 వేల కోట్ల ఖర్చు చేయబోతున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3500 ఇండ్లు చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇండ్లు మొదటి విడతలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఎక్కడా పెట్టుబడి సహాయం చేరవద్దని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడికి సహాయం అందేలా చూడాలని అన్నారు. లేఔట్, నాలా, భూ సేకరణ, పరిశ్రమల, మైనింగ్ భూముల సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, గ్రామ శాటిలైట్ మ్యాప్ వాడుతూ పారదర్శకంగా అర్హుల ఎంపిక ఉండాలని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు పంట వేసినా, వేయక పోయినా రైతు భరోసా అందుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలని అన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి సంవత్సరానికి 12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని అన్నారు. 20 రోజులు ఉపాధి హామీ పని చేసి, గుంట భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలను గుర్తించి ఈ పథకం అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా 4 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనికి సంబంధించిన విధి విధానాలను క్యాబినెట్ ఆమోదించిందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేదలకు కులమతాలకు అతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతం 4 లక్షల 50 వేల ఇండ్లు ఇస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు డేటా చాలా కీలకమని, అధికారులు వివరాలు సరిగ్గా నమోదు చేస్తేనే ఈ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని, అధికారులు జాగ్రత్తగా పని చేయాలని అన్నారు. మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న గిరిజన, ఇతరులకు బ్యాంకులలో రుణాలు కూడా అందడం లేదని దీనిని పరిష్కరించాలన్నారు. గతంలో దళిత బంధు వంటి పథకాలు పొందిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో కాకుండా రెండో విడతలో జారీ చేయాలని అన్నారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభిస్తుందని అన్నారు. ఈ పథకాల అమలు సంబంధించి ప్రజలకు ఉన్న సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు వ్యవస్థను కూడా జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.జనవరి 24 నాటికి రైతు భరోసా లబ్దిదారుల సంబంధించి తుది జాబితా సిద్ధం చేయాలని, ప్రతి గ్రామంలో వ్యవసాయ యోగ్యమైన భూముల గుర్తించి గ్రామసభ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేయాలని అన్నారు.2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి సంవత్సరానికి రెండు విడతలలో 6వేల చొప్పున మొత్తం 12 వేలు సహాయం అందించనున్నట్లు, గ్రామ సభ ద్వారా లబ్దిదారుల తుది జాబితా రూపొందించి, జనవరి24 నాటికి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు.సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా వచ్చిన వివరాల ప్రకారం రేషన్ కార్డు లేని కుటుంబాల సర్వే చేసి అర్హులను గుర్తించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, పట్టణాలలో మున్సిపల్ కమీషనర్ నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని, గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే సూపర్ చెక్ కార్యక్రమం జనవరి 16 నుంచి జనవరి 19 లోపు పూర్తి చేసి జాబితా గ్రామంలో ప్రదర్శించాలని, జనవరి 20లోపు అభ్యంతరాల స్వీకరించి, తుది జాబితా ప్రచురించాలని అన్నారు. గ్రామ/వార్డు సభలను జనవరి 24 లోపు నిర్వహించి ప్రాథమిక క్రమంలో వ్యక్తిగత మంజూరు ఉత్తర్వులు జనవరి 26 నుంచి జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ రైతులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో అధికారులు పని చేయాలని అన్నారు.వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరానికి 12 వేల ఆర్థిక సహాయం అందాలని అన్నారు. వ్యవసాయ యోగ్యంకాని భూములు, రియల్ ఎస్టేట్, లే ఔట్‌గా మారిన భూములు, మైనింగ్, పరిశ్రమల క్రింద భూములు, వివిధ ప్రాజెక్టుల క్రింద భూ సేకరణ చేసిన భూములను మినహాయించా లని అన్నారు. అనర్హులకు ప్రభుత్వ సహాయం చేరకుండా సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని అన్నారు.ేంషన్ కార్డులు అర్హులకు మాత్రమే జారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోకొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, ఐ.టి.డి.ఏ. పి.ఓ.బి. రాహుల్, ఖమ్మం సీపీ సునీల్ దత్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** భోగి పండగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ తెలుగు ప్రజలందరికీ ఎక్స్ వేదికగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ భోగి మంట లు కొత్త కాంతులు పంచే భోగి మంటలు.. ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇక, గాలిపటాలు ఎగురవేసేప్పుడు జాగ్రత్తగా ఉండాలని సిఎం సూచించారు.

## మాజీ సిఎం మర్రి చెన్నారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** దివంగత మాజీ ముఖ్యమంత్రి,మాజీ గవర్నర్ డా.మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

# పదేళ్లలో రూ.నాలుగున్న లక్షల కోట్లను వ్యవసాయ రంగాభివృద్ధి కోసం ఖర్చు చేశాం

## సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి13:** రైతు పండుగ సంక్రాంతి పర్వదినాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. భోగీతో ప్రారంభమై మకర సంక్రాంతి, కనుమతో మూడు రోజుల పాటు సాగే సంక్రాంతి పండుగ, వ్యవసాయాధారిత పల్లె సంస్కృతిలో ప్రత్యేకతను చాటుకుంటుందని తెలిపారు. పండిన పంటల రాశులతో ఇండ్లు కళ కళలాడుతుండగా, రైతు జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుందని కేసీఆర్ తెలిపారు.రంగవల్లులతో, భోగి మంటలతో, గొబ్బెమ్మలతో, గంగిరెద్దుల ఆటలతో, పిల్లలు పెద్దలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే ప్రకృతి పండుగ మకర సంక్రాంతి అని కేసీఆర్ తెలిపారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని, పాడి పంటలతో రైతు కుటుంబాలు సంతోషాలతో నిండాలని, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించిందని అన్నారు.వ్యవసాయం దాని అనుబంధ రంగాల అభివృద్ధి, రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యతాంశంగా నాడు అమలు చేసిన కార్యాచరణ, పదేండ్ల అనతికాలంలో సత్ఫలితాలనిచ్చిందని కేసీఆర్ వివరించారు. అందులో భాగంగా.. 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్తు, ప్రాజెక్టులు, కాల్వల ద్వారా సాగునీరు, పంటకు పెట్టుబడిగా రైతుబంధు, రైతు కుటుంబానికి భరోసాగా రైతుబీమా వంటి పలు పథకాలను పటిష్టంగా అమలు చేశామన్నారు. తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రశంసలందుకుందని, దేశానికే ఆధర్శంగా తెలంగాణను నిలిపిందని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. వ్యవసాయానికి దన్నుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నముకగా నిలిచిన కులవృత్తులకు, గతంలో లేని విధంగా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం, సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభను నింపిందని కేసీఆర్ తెలిపారు.పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలను వ్యవసాయ రంగాభివృద్ధికోసం ఖర్చు చేసిందన్నారు. రైతు జీవితాల్లో వెలుగులు నింపాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగామన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో దండుగన్న తెలంగాణ వ్యవసాయం, బిఆర్ఎస్ హయాంలో పండుగలా మారిందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.రాజకీయాలకు అతీతంగా, రైతన్న సంక్షేమమే ధ్యేయంగా, రాజీపడకుండా పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ సూచించారు. తద్వారా రైతు పండుగ సంక్రాంతి వేడుకలకు వన్నె చేకూర్చినవారమౌతామని తెలిపారు.రైతన్న జీవితాల్లో వెలుగులు కొనసాగాలే దీవించాలని ప్రకృతిమాతను ఈ సందర్భంగా కేసీఆర్ ప్రార్థించారు.

## వారం - వర్జ్యం

తేది : 14-01-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
కృ.పాడ్యమి రా.3.22
పునర్వసు ఉ.10.16
వర్జ్యం : సా.6.20-7.56
దు.ఉ.9.03-9.48, 2) రా.10.27-11.12
శుభసమయం: ఉ.7.55-9.00,
సా.5.30-6.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** రాజకీయ, సాంకేతిక రంగాల లోని వారికి అనుకూలంగా ఉంటుంది. సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఇంటా బయటా ప్రోత్సాహకరమైన పరిస్థితి ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** జీవిత భాగస్వామి సహాయ సహకారాలను అందుకుంటారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**కర్కాటకం :** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వృత్తిలో అభివృద్ధి సాధిస్తారు.

**సింహం:** మీకు ఇష్టం లేని పనిని ఇతరుల వత్తిడి మేరకు గత్యంతరం లేకచేయవలసి వస్తుంది.

**కన్య :** గ్రంథాలను అధ్యయనం చేస్తారు. రచనా వ్యాసంగాలను సాగిస్తారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**తుల :** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. నూతన పరిచయాలు.

**వృశ్చికం:** రచనా ప్రాధాన్యంగా కలిగినటువంటి రంగంలోని వారికి నూతన అవకాశాలు లభిస్తాయి.

**ధనుస్సు:** మంచి చెడులను విడమరచి చెప్పే సన్నిహిత వర్గం అందుబాటులో ఉంటారు.

**మకరం:**వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులేవీ ఏర్పడవు.

**కుంభం:** తినకపోతే నీరసం, తింటే ఆయాసం అన్న విధంగా ఆరోగ్యం ఇబ్బంది పెడుతుంది.

**మీనం :** మంచి ఫలితాలను సాధించాలంటే, మంచి పరిచయాలు కూడా అవసరమేనని భావిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

తేది : 15-01-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
విదియ రా.3.24
పుష్యమి ఉ.10.27
వర్జ్యం : రా.11.41-1.20
దు.మ.12.02-12.47
శుభసమయం: ఉ.7.00-7.40,
మ.2.30-3.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మంచి చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. శుభవార్తలు.

**వృషభం :** మీ పరోక్షంలో జరుగుతున్న అన్యాయాలు వెలుగు చూస్తాయి. బ్యాంక్ ఋణాలు మంజూరవుతాయి.

**మిథునం:** ముఖ్యపత్రములను పోగొట్టుకొనుట లేక తాత్కాలికముగా కనబడక పోవుట వంటి సమస్యలు ఎదురు అవుతాయి.

**కర్కాటకం :** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండు కలిసి రావు. అదృష్టాన్ని పెద్దగా నమ్మరు.

**సింహం:** మిత్రుల ద్వారా అందిన విలువైన సమాచారం ఆధారంగా నూతన ప్రణాళికలు ఏర్పరచుకుంటారు.

**కన్య :** కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**తుల :** వృత్తి వ్యాపారాలు అనుకూలంగా వుంటాయి. ఉద్యోగాలకు పదోన్నతులు లభిస్తాయి.

**వృశ్చికం:** కళలు, రాజకీయ, రంగాలలోని వారికి సన్మాన యోగం. ఆర్థిక ప్రయోజనాలు పొందుతారు.

**ధనుస్సు:** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** వస్త్ర, వజ్రంగి, ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** అర్థం లేని రాజకీయాలతో కాలాన్ని వ్యర్థంగా గడుపుతున్న వారిని హెచ్చరిస్తారు.

**మీనం:** బహిరంగ సమావేశాలలో పాల్గొంటారు. బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం

## సంక్రాంతి పండుగ వేళ బోర్డు ప్రారంభం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** సంక్రాంతి పండుగ వేళ పసుపు రైతులకు కేంద్రం శుభవార్త తెలిపింది. మంగళవారం నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్రం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో జాతీయ పసుపు బోర్డుకు పల్లె గంగారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నిజామాబాద్ జిల్లా అంకాపూర్ వాసి. ప్రస్తుతం బిజెపిలో సీనియర్ నేతగా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా ఆయన మూడేళ్ల పాటు ఆ పదవిలో ఉంటారని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వస్తే నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని గతంలో బిజెపి హామీ ఇచ్చింది. ఈ మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ వెలువరించింది. దీంతో దశాబ్దాల పసుపు రైతుల కల నెరవేరింది. పసుపు బోర్డుతో ఉపయోగాలివే... కొత్త వంగడాల అభివృద్ధి నుంచి హార్వెస్ మేనేజ్‌మెంట్, మార్కెట్ వరకు రైతులకు లబ్ది కలుగుతుంది. పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడానికి అవసరమైన యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. పంట నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం ఉంటుంది. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి సీజన్‌లో దాదాపు 9లక్షల క్వింటాళ్ల పసుపు దిగుబడి వస్తుంది. నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో కూడా విరివిగా పసుపు శుద్ధి కర్మాగారాలు, ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. పసుపు బోర్డుతో స్థానిక ఇతర వ్యవసాయ ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. కాగా, మంగళవారం నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరగనుంది. పసుపు బోర్డును కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

# ఆర్థిక, సామాజిక, కుల గణన సర్వే ఆధారంగానే రేషన్‌కార్డులు

## కొత్త రేషన్‌కార్డుల జారీకి మార్గదర్శకాలు జారీ చేసిన సర్కార్

## 26 నుంచే రేషన్ కార్డులు మంజూరుకు ఏర్పాట్లు

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** రాష్ట్రంలో రేషన్ కార్డుల కోసం ఎంతో మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరుకు మార్గదర్శకాల విడుదల చేసింది. కాగా, ప్రభుత్వం ఈనెల 26 నుంచి రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసింది. రేషన్‌కార్డుల అర్హత ప్రమాణాలు, మార్గదర్శకాలను పరిశీలించేందుకు ఇప్పటికే ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. మంత్రివర్గ ఉపసంఘం పలుసార్లు సమావేశమై మార్గదర్శకాలను ఆమోదించింది. ఈ మేరకు ఇటీవల చేపట్టిన కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. అర్హుల ఎంపిక కోసం జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యత అప్పగించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్‌లకు ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారని ప్రభుత్వం తెలిపింది. ముసాయిదా జాబితాను గ్రామ సభ, వార్డులో ప్రదర్శించి, చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదం లభించనున్నది. ఆహారభద్రత కార్డుల్లో సభ్యుల పేర్లు చేర్చడంతో, తొలగింపునకు కూడా అవకాశం కల్పించనున్నారు. అర్హులైన కుటుంబాలకు పౌరసరఫరాల శాఖ ఈ నెల 26 నుంచి కొత్త ఆహారభద్రత కార్డులు జారీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్రంలో మరో 30 లక్షల మందికి రేషన్ లబ్ధి కలిగే అవకాశముంది. వారికి సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతకం చేసిన లేఖతో కొత్త రేషన్‌కార్డులను జారీ చేయనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం రేవంత్ రెడ్డి నిర్వహించినటువంటి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అన్ని జిల్లాల కలెక్టర్ల సమావేశంలో ముందుగా పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కాగా, కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తుల స్వీకరణ ఉండదని పౌరసరఫరాల శాఖ కీలకవర్గాలు వివరించాయి. కొద్ది రోజుల క్రితం జరిగినటువంటి సామాజిక, ఆర్థిక సర్వేలో రాష్ట్రంలోని పేదల వివరాలున్నాయి. అర్హులైన పేదల్లో రేషన్‌కార్డులు ఉన్నవారి, లేనివారికి సంబంధించిన సమాచారం ఉంది. ప్రతిపాదిత అర్హుల వివరాల జాబితాను గ్రామసభలు, బస్తీ సభల్లో ప్రదర్శించనున్నారు. అక్కడే కొత్త రేషన్ కార్డులకు అర్హులైన వారి పేర్లు ఖరారవుతాయి. ఇదిలా ఉండగా కొత్త రేషన్ కార్డుకు సంబంధించిన డిజైన్ ఇంకా ఖరారు కాలేదు. ఆ ప్రక్రియ సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాతే పూర్తి కానుంది.



# రామకృష్ణ మఠానికి ఎల్ఐసి వైద్య పరికరాలు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రామకృష్ణ మఠం హైదరాబాద్ శాఖ తమ స్వర్ణోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆసుపత్రికి ఎల్ఐసీ వైద్య పరికరాలను అందజేసింది. ఈ మేరకు ఒక ప్రకటనలో వీటి వివరాలను వెల్లడించింది. మఠం ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జోనల్ మేనేజర్ శ్రీ పునీత్‌కుమార్ బయో కెమికల్ అనలైజర్‌ను అందజేశారు. మఠం అధ్యక్ష స్వామి బోధ్మయానంద మరియు వివేకానంద హెల్త్ సెంటర్ ఇన్‌ఛార్జ్ శ్రీ పూర్ణచైతన్య ట్రస్ట్ తరపున పరికరాలను అందుకున్నారు. ప్రతిరోజూ దాదాపు 500 నుండి 600 మంది రోగులు ఆసుపత్రిని సందర్శిస్తున్నారు, వీరిలో దాదాపు 150 మందికి రక్త పరీక్షలు అవసరం. లాభాపేక్షలేని ప్రాతిపదికన వారి ఫార్మసీలో రోగులకు వైద్యం అందించబడుతుంది. మరియు అవసరమైన వారికి ఉచితంగా అందించబడుతుంది. ఇప్పటివరకు, రోగులకు అవసరమైన పరీక్షలు మాన్యువల్‌గా నిర్వహించబడ్డాయి. ఇప్పుడు ఎల్ఐసీ అందించిన పరికరాలతో తక్కువ సమయంలోనే ఫలితాలను అందచేస్తాయి. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ, రామకృష్ణ మఠం గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ద్వారా జరిగే సామాజిక ప్రయోజనం కోసం మద్దతు ఇస్తోందని అన్నారు. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటివరకు 23 సంస్థలకు రూ. 8.50 కోట్లకు పైగా నిధులతో సహాయం అందించబడింది.

# గణతంత్ర దినోత్సవాన ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ ర్యాలీ

## పిలుపు ఇచ్చిన సంయుక్త కిసాన్ మోర్చా

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** ఈ నెల 26న జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ ర్యాలీ లను నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నిర్ణయించింది. ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, రైతులతో ప్రధానమంత్రి చర్చించాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీని నిర్వహించాలని ఎస్‌కేఎం నిర్ణయించినట్టు రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, వి ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, నాగిరెడ్డి, పి రమేష్, కొండల్, ప్రసాదన్న తెలిపారు. జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను రక్షించాలని, రైతు వ్యతిరేక కొత్త జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీ2+ 50 శాతంతో పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రైతులకు వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ వర్తింప చేస్తూ చట్టం చేయాలన్నారు. విద్యుత్తును ప్రైవేటీకరించవద్దని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దని, గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నారు.

అలాగే 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 76వ గణతంత్ర దినోత్సవమైన జనవరి 26న ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ ర్యాలీలను జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు తెలిపారు.

రైతు వ్యతిరేక కొత్త జాతీయ మార్కెట్ విధాన ముసాయిదా ప్రతులను జనవరి 13 నుంచి 21 వరకు దగ్ధం చేయాలనే కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతులతో చర్చించడానికి, జగ్జీత్ సింగ్ ప్రాణాలను కాపాడటానికి కేంద్ర పాలకులు సిద్ధంగా లేకపోవటాన్ని ఎస్‌కేఎం తీవ్రంగా ఖండించింది. 49 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు ప్రాణాలను కాపాడటానికి, న్యాయబద్ధమైన రైతాంగ డిమాండ్ల పరిష్కారంలో చొరవ చూపటంలో, జాప్యం చేసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,కేంద్ర పాలకులు రైతుల ప్రయోజనాల కంటే కూడా కార్పొరేట్ కంపెనీలకు గులాములుగా మారి వారి ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. వ్యవసాయ రంగంపై పూర్తి ఆధిపత్యం చెలాయించటానికీ కార్పొరేట్ కంపెనీలు చేస్తున్న ప్రయత్నాలకి కేంద్ర పాలకులు పూర్తి మద్దతును ఇస్తున్నారని విమర్శించారు.

రైతులకు మద్దతు ధరలను, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనంను నిరాకరిస్తున్నారని.. దేశ యువతకు ఉపాధి, ఉద్యోగాలను కల్పించే అవకాశాలను సర్వనాశనం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు.

# అదుపుతప్పిన లారీ.. కూలిన ఇళ్ల గోడలు



ఎన్ఎఫ్‌సినగర్‌లో ఇళ్లపై దూసుకువచ్చిన లారీ

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తప్పిన ముప్పు

## ఫిర్యాదు రాలేదని పట్టించుకోని పోలీసులు

**ఘట్‌కేసర్, జనవరి 13, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో సోమవారం సాయంత్రం బండరాళ్ల లారీ అదుపు తప్పి ఇళ్ల మీదికి దూసుకువచ్చింది. మధ్యాహ్నం గుట్టపై నుంచి జేసీబీతో తొలగించిన పెద్ద బండరాళ్లను తరలిస్తున్న టిప్పర్‌లారీ (టిఎస్12 యుడి-1063) బ్రేకులు ఫెయిలై ఎదురుగా ఉన్న ఇళ్లపై దూసుకువెళ్లింది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పెనుప్రమాదం తప్పగా రెండు ఇళ్ల గోడలను ఢీకొట్టడంతో కూలిపోయాయి. ఇదే సమయంలో రోడ్డుపై ఏలాంటి వాహనాలు, పాదచారులు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు లారీ ఢీకొట్టి ఉంటే కరెంట్ షాక్‌తో భారీ ప్రమాదం జరిగే ఆస్కారముండేదని అంటున్నారు. బరువైన పెద్ద బండరాళ్లను తరలిస్తూ లారీ కండిషన్ పరిశీలించుకోకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదం చేశాడు. ఈప్రమాదంపై స్థానిక ఇళ్లలో నివాసం ఉంటున్న వారు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు మాత్రం తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదని లారీ యాజమాని, డ్రైవర్‌పై చర్యలు తీసుకోలేమని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాంను వివరణ కోరగా ఈప్రమాదంపై తమకు ఏలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# జెఎల్స్ నుంచి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు మరింత ఆలస్యం!

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్‌మోస్ట్ జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు పొందడానికి మరింత ఆలస్యం కానుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపల్ పోస్టు మల్టీజోనల్ పోస్టుగా కొనసాగుతోంది. అయితే ప్రకటించాలని పేర్కొంటూ ఇంటర్ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్-1, మల్టీజోన్-2లో జేఎల్స్ సీనియారిటీ లిస్టు ఇవ్వాలంటూ డీఐఈవోలను ఆర్‌జేడీలు ఆదేశించారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం ఇంటర్ బోర్డు, ఇంటర్ కమిషనరేట్ కూడా వార్షిక పరీక్షల బిజీలో

## ప్రిన్సిపల్ పోస్టును స్టేట్ పోస్టుగా మార్చుతూ సర్కార్‌కు ప్రతిపాదనలు

## ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్న ఇంటర్ కమిషనరేట్

## 18 నుంచి కొత్తగా ఎంపికైన జెఎల్స్‌కు సర్టిఫికెట్ పరిశీలన

ఇప్పుడు ప్రిన్సిపల్ పోస్టును స్టేట్ పోస్టుగా మార్చుతూ ప్రభుత్వానికి ఇంటర్ కమిషనరేట్ ప్రతిపాదనలు పంపించింది. ఇంటర్ కమిషనరేట్ పంపించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో సీనియర్ జేఎల్స్‌కి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు రావడానికి ఆలస్యం కానుంది. అయితే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 63 ప్రిన్సిపల్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లలో సీనియారిటీ లిస్టును ఉన్నాయి. ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానుండగా.. మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జేఎల్స్ సీనియారిటీ లిస్టుపై కాకుండా ఇంటర్ పరీక్షలపై మొత్తం అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. పరీక్షల పనులు ముగిసిన తరువాత ఫలితాల ప్రకటన.. అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో సీనియర్ జేఎల్స్ కాస్త ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు పొందడానికి ఈ ఏడాది ఏప్రిల్, మే నెల వరకు ఆగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 18 నుంచి కొత్తగా ఎంపికైన జేఎల్స్‌కి సర్టిఫికెట్ పరిశీలన..

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1392 జేఎల్ పోస్టులకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) నోటిఫికేషన్‌ను జారీ చేసి పరీక్షలను నిర్వహించి ఫలితాలను ప్రకటించింది. వారిలో 1139 పోస్టులకి అభ్యర్థులను ఎంపిక చేసి ఇంటర్ కమిషనరేట్‌కి పంపించారు. ఈ నెల 6న ఎంపికైన అభ్యర్థులకి సర్టిఫికెట్ పరిశీలన ఉన్నప్పటికీ దానిని వాయిదా వేశారు. దీంతో అభ్యర్థులు ఇంటర్ కమిషనరేట్ ముందు ధర్నా చేశారు. ధర్నా సందర్భంగా ఇంటర్ కమిషనర్ వారితో ఈ నెల 9న తిరిగి ఎప్పుడు సర్టిఫికెట్స్ పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తామనేది చెబుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ నెల 9న తిరిగి అభ్యర్థులు ఇంటర్ కమిషనర్‌ను కలువగా.. ఈ నెల 18 నుంచి సర్టిఫికెట్ పరిశీలన చేస్తూ.. కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అభ్యర్థులకు చెప్పినట్టు ఎంపికైన అభ్యర్థులు తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే వారికి నియామక పత్రాలను అందజేస్తారా? లేకపోతే ఆలస్యం అవుతుందా? అనే సందేహాలను ఎంపికైన అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు.



సోమవారం పెరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు

# స్పీకర్ వద్దకు చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పంచాయితీ

## నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటా: స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన అధికారిక సమావేశంలో దుర్భాషలాడారని లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతుంటే అడ్డుకున్నారని.. ఇందుకుగాను అతనిపై చర్యలు తీసుకోవాలని సంజయ్ కోరారు. స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్.. నివేదిక తెప్పించాక చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో అభివృద్ధి కార్యక్రమాల సన్నద్ధతపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం రసాభాసగా మారింది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ని ఉద్దేశించి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో వాగ్వాదం జరిగింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఇప్పటికే కౌశిక్ రెడ్డిపై మూడు కేసులు నమోదు చేశారు.




# అధికారిక సమావేశంలో ఇదేం పద్ధతి

## కౌశిక్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి

## జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

## ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**కరీంనగర్, ప్రభాతవార్త:** అధికారిక సమావేశంలో ఇదేం పద్ధతి అని, ప్రజస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉంటుందని జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో అధికారిక సమావేశంలో జరిగిన ఘటనపై ఆయన సోమవారం కరీంనగర్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు.

ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గ ప్రజలు తనని ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ఎన్నికల సమయంలో వేరే పార్టీ టికెట్ తో పోటీ చేశానని, అనంతరం నియోజక వర్గం అభివృద్ధిలో భాగంగా మాత్రమే పార్టీ మారినట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు తనను ఎన్నికల్లో గెలిపించి రెండవసారి అవకాశం కల్పించారన్నారు. ప్రజల రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని స్పష్టం చేశారు.. నియోజకవర్గం అభివృద్ధి పరచాలనే ఉద్దేశ్యంతో మాత్రమే ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అదే క్రమంలో ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారిక సమావేశం జరిగిందన్నారు.. అందులో భాగంగా తాను జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతున్న క్రమంలో బిఆర్ యస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ దుర్భాషలడినట్లు వివరించారు.

తనను సమావేశంలో మాట్లాడనివ్వకుండా అడ్డుకొని దురుసుగా మాట్లాడుతూ చేతులతో త్రోసివేస్తూ కౌశిక్ రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్పీకర్ కి కూడా పిర్యాదు చేసినట్లు చెప్పారు. తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీసు స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చినట్లు వెల్లడించారు. తోటి ఎమ్మెల్యేను అని కూడా చూడకుండా కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి తన ప్రవర్తన మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సూడ ఛైర్మెన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# మహా కుంభమేళాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** యుపిలోని ప్రయోగరాజ్‌లో మొదలైన మహా కుంభమేళకు కోట్లాది మంది భక్తులు రానున్నందున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆ రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర హోం శాఖ తనవంతుగా భద్రతా చర్యలు చేబట్టింది. అయితే ఇందులో ప్రత్యేకమైనది కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగం. వాస్తవానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం అనేది దేశ వ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నా దీనిని పక్కాగా అమలుచేసి మెరుగైన ఫలితాలు అందుకున్న ఘనత మాత్రం తెలంగాణ పోలీసు విభాగానిదేనని చెప్పాలి. కుంభమేళలో నేడు అమలు చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అధునాతన హంగులు అందించింది కూడా తెలంగాణ పోలీసు విభాగం కావడం గమనార్హం. కుంభమేళ తరువాత దేశంలో జరిగే అతిపెద్ద గిరిజన జాతరగా పిలిచే మేడారం జాతరలో ఇప్పటికే పలుమార్లు దీనిని వాడి ఫలితాలు అందుకున్న టి.పోలీసు, జంట నగరాలలో జరిగే సామూహిక గణేష్ నిమజ్జనం సందర్భంగా కూడా దీనిని వాడి భేష్ అనిపించుకుంది.

కృత్రిమ మేధస్సు. (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఈ పదం చాలా కాలంగా వినిపిస్తున్నా ఆరేళ్ల క్రితం రాష్ట్ర పోలీసు శాఖలో తొలిసారిగా వినపడింది. ఆ మాటకు వస్తే దేశంలో కూడా దీనిని ఒకటి రెండు చోట్ల మినహా మిగతా ఎక్కడా వాడిన దాఖలాలు లేవనే చెప్పాలి. ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నిక గల అతికొద్ది ఉత్సవాలలో ఒకటైన ప్రయోగరాజ్ కుంభమేళలో కొంత కాలంగా దీనిని వాడుతున్నారు. ఈ భారీ ఉత్సవాలకు కోట్లాది మంది రావడం తెలిసిందే. ప్రతి పన్నెండేళ్లకు ఓసారి జరిగే పూర్ణ కుంభమేళ, ఆరేళ్లకోసారి జరిగే అర్ధ కుంభమేళ, నాలుగేళ్లకోసారి జరిగే సాధారణ కుంభమేళ ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరు గుతుండడం తెలిసిందే. ఏ కుంభమేళ జరిగినా కోట్లాది మంది భక్తులు గంగానది, యుమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతమైన త్రివేణి సంగమంలో స్నానాలు ఆ చరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కుంభమేళకు వచ్చే కోట్లాది మంది భక్తులను అదుపు చేయడం పోలీసులకు

## మేడారం జాతర, గణేశ ఉత్సవాల్లో ఎఐ వినియోగంతో మెరుగైన ఫలితాలు సాధించిన టి.పోలీస్

శక్తికి మించిన పనిగా చెప్పాలి. ఒకేచోట లక్షలాది మంది రావడం, నదిలో స్నానమాచరించే సమయంలో తొక్కిసలాటకు వీలుండడంతో అక్కడ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడం కూడా ఇబ్బందికరం గానే వుంటుంది. ఏ కుంభమేళా జరిగినా 45 రోజుల పాటు కొనసాగుతుండడంతో దేశ విదేశాల నుంచి హిందువులు తరలివస్తుంటారు. కుంభమేళ సందర్భంగా పలు మార్లు తొక్కిసలాట జరిగి అనేక మంది మరణించిన ఉదంతాలు, గాయపడిన ఘటనలు వున్నాయి. అయితే గడచిన కొంతకాలంగా ఈ విషయంలో ఉత్తరప్రదేశ్ సహా కుంభమేళా జరిగే ఉత్తరాది రాష్ట్రాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై దృష్టి సారించి దీనిని విజయవంతంగా అమలు చేయసాగాయి. ఇంతకు కృత్రిమ మేధస్సు అంటే ఏమిటనే విషయం ఎవరికైనా అనుమానం రావచ్చు. పెద్ద సంఖ్యలో జనం ఒకేచోట వుంటే ఎలాంటి అవాంఛనీయ ఘటన అయినా జరిగే వీలుంటుంది.

ఇప్పటి వరకు ఈ విషయంలో పోలీసులు క్షేత్రస్థాయిలో వుండి పరిస్థితులను చక్కదిద్దాల్సి వుండేది. కానీ దీని బదులు ఆయా ప్రాంతాలలో అధునాతన హంగులున్న సిసి కెమెరాల ను అమర్చడం ద్వారా పరిస్థితులను పోలీసులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఇది ఎలా అమలవుతుందంటే తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన మేడారం జాతర ఇం దుకు ఉదాహరణగా చెప్పాలి. మేడారం జాతర ప్రతి రెండేళ్లకు ఓసారి జరుగుతుంది. ఈ జాతర ఉమ్మడి వరంగల్‌లోని ములుగు ప్రాంతంలో జరుగుతుంటుంది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్రల నుంచి లక్షలాది మంది తరలివస్తుంటారు. ఈ వేడుకల్లో ఎక్కువగా గిరిజనులే వస్తుం డడం ఆనవాయితీ. గత మేడారం జాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు వచ్చినట్లు అంచనా. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారని పోలీసు శాఖ ముందుగానే అంచనా వేసి, అందుకుతగినట్లుగా ఏర్పాట్లు చేసింది. మామూలుగా అయితే ఇంతపెద్ద జాతరకు పోలీసు బలగాలను తరలించి వారిచేత బందోబస్తు ఏర్పాటు చేయడం ఇప్పటి వరకు జరిగేది.

ఈసారి దీనికి భిన్నంగా కుంభమేళలో అమలయిన కృత్రిమ మేధస్సును ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసు శాఖ దీనిని మేడారం జా తరలో ఆరేళ్ల క్రితం మొదటిసారిగా అమలు చేసి భేషయిన ఫలితాలను సాధించింది. ఇందుకోసం మేడారం జాతరలో గద్దెల మీద కొలువుతీరే సమ్మక్క, సారాలమ్మ, ప గిడిద్దరాజుల వద్దకు జనం ఎక్కువగా వచ్చే ప్రాంతాలను ముందుగానే గుర్తించిన పోలీసులు అక్కడ అధునాతన కెమెరాలను అమర్చారు. ఈ కెమెరాలకు కొన్ని హంగులు సమకూర్చారు. ఇందులో భాగంగా ప్రతి 3.6 చదరపు మీటర్ల దూరంలో నిర్దేశించిన దానికన్నా జనం ఎక్కువగా వున్నారని అనిపిస్తే ఈ కెమెరాలు అలారం మోగిస్తా యి. దీంతో పోలీసులు అప్రమత్తమై గద్దెల వద్ద అదనంగా వుండే ప్రజలను దూరంగా వుంచుతారు. ఒక రకంగా చెప్పాలంటే క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో ఈ కృత్రిమ మేధస్సు విజయవంతంగా ఉపయోగపడిందని చెప్పాలి. దీంతో మేడారం జాతరలో ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగలేదు. ఒకరకంగా ఇది పోలీసులకు భారీ ఊరటనిచ్చింది. మేడారం జాతరలో కృత్రిమ మేధస్సు విజయవంతంగా అమలు చేయడంతో జంట నగరాలలో జరిగే గణేష్ ఉత్సవాలు, బోనాల జాతర, ఇతర పండగలు, వేడుకల్లో దీనిని వాడసాగింది. బోనాల జాతర, గణేష్ ఉత్సవాల కోసం పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేయడం తెలిసిందే.

ఈ రెండు వేడుకల్లో లక్షల సంఖ్యలో ప్రజలు తరలివస్తుంటారు. ఈ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడడంలో పోలీసులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడుతున్నారు.

కాగా రాబోయే రోజుల్లో దీనిని మరింతగా వాడేందుకు పోలీసు శాఖ సన్నాహాలు చేయసాగింది. ఇందుకోసం మరిన్ని అధునాతన కెమెరాలను కొనుగోలు చేసేం దుకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేయసాగింది. ఇదే సమయంలో పోలీసు విభాగంలోని ఐటి సిబ్బందిని సుశిక్షితులను చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మీద పోలీ సు శాఖకు కృత్రిమ మేధస్సు ఒక వరంగా చెప్పాలి. దీనివల్ల రాబోయే రోజుల్లో పోలీసులకు క్రౌడ్ మేనేజ్‌మెంట్ మరింత సులభతరమయ్యే వీలుంది.

నొప్పించే మాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయ సంగతమైన మార్గం అవుతుంది.

-తిరుక్కురళ్

# కార్చిచ్చు సెగ!

సిటీ ఆఫ్ ఏంజెల్స్' గా పిలువబడే లాస్ ఏంజెల్స్ ను ఉన్నట్లుండి కార్చిచ్చు మేఘాలు కమ్మేసాయి. జనానికి ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి 16 మందిని పొట్టనపెట్టుకుంది. ఈటన్, పాలిసేడ్స్ వైల్డ్ ఫైర్ సృష్టించిన విధ్వంసం ఇంతా అంతా కాదు. ఇప్పట్లో కొలిక్కివచ్చేది లేదు. పాలిసేడ్స్ దావాగ్నికి 23,707 ఎకరాలు, ఈటన్ కార్చిచ్చుకు 14,117 ఎకరాలో అటవీ ప్రాంతం భస్మీ పటలమైపోయింది. 'శాంటా ఆనా' గాలులే ఈ దావానలానికి కారణం. విచిత్రమేమిటంటే అమెరికా చరిత్రలోనే అత్యంత ఘోర ప్రకృతి ఉత్పాతంగా, ప్రకృతి బీభత్సాల వల్ల ఆ ఆ ప్రాంతం ఏ మేరకు విధ్వంసమౌతుందో ఓ నిదర్శనంగా భావించబడుతోంది. అయితే ఈ విధ్వంసం ఇంకా మరికొన్ని రోజులు రావణ కాష్టంలా కాలుతూనే ఉంటుందని, మరోసారి జడ విషపు గాలులు వీస్తాయన్న భయాందోళనలు ప్రజల్లో లేకపోలేదు. అమెరికా సంయుక్త రాష్ట్రాల కార్చిచ్చులు కొత్తేమీ కాదు. అయినా నిన్న మొన్నటి లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు అమెరికాలోనే అత్యంత ఖరీదైన ప్రకృతి వైపరీత్యాలలో ఒకటిగా మారింది. ఇదే శాంటి మోనికా, మాలిబు ప్రాంతాలను చుట్టుముట్టి అత్యంత సంపన్న ప్రాంతాలను తనలో ఇముడ్చుకున్న దావాగ్ని వలన 2 మిలియన్ డాలర్లకు పై విలువైన గృహాలను దగ్ధం చేసింది. అక్యూ వెదర్ సంస్థ అంచనాల మేరకు సుమారు 52 బిలియన్ డాలర్ల నుండి 57 బిలియన్ డాలర్ల మధ్య ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేసింది. తుఫాను, మంటలు వెరసి ఈ నష్టాన్ని మరింతగా పెంచేసాయి. నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధారంగా 2005లో కత్రినా తుఫాను అత్యంత ఖరీదైన ప్రకృతి బీభత్సంగా భావిస్తే (200 మిలియన్ డాలర్ల నష్టం) 2018లో కాలిఫోర్నియాలో క్యాంప్‌ఫైర్ 30 బిలియన్ డాలర్ల మేరకు నష్టం కలిగించిందని అంచనా. లాస్ ఏంజెల్స్ కార్చిచ్చులో విషపూరిత పొగ మంటలు ఎగయగా అక్కడ నివాసితులు దీర్ఘవ్యాధులకు, ఆరోగ్య సమస్యలకు గురి చేసే అవకాశం కొద్ది ప్రాంతీయ పర్యాటక పరిశ్రమకు దెబ్బ కొడుతూ లెక్కలు నష్టం వేసుకోగలదు. రానున్న కాలంలో అసలు సినిమా లెక్కలు పెరిగితే ఆర్థికనష్టం మరింత చేకూరే అవకాశం లేకపోలేదు. 10 వేలకి పైగా గృహ, గృహేతర నిర్మాణాలు ధ్వంసమయ్యాయని ప్రాథమిక అంచనా. కొందరు నివాసాలు వదలి వెళ్లిపోగా, ఎగసిన మంటలకు వ్యాపార సంస్థలు, నివాసాలు బుగ్గిపాలయ్యాయి. గంటకు 70 మైళ్ల వేగంతో గాలులు వీచాయి. వేలాది ఎకరాల్లో అడవులు బూడిదయ్యాయి. 27 వేల ఎకరాల్లో విస్తరించిన అగ్నికీలలు కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. 4లక్షల మంది తరలింపు, 4 లక్షల కోట్ల ఆస్తి నష్టం. ఈ సారి కార్చిచ్చు వలన ఎంతో విలువైన ఆస్తినష్టమైంది. మొత్తం ఏడుచోట్ల కార్చిచ్చులు వ్యాపించాయి. తొలుత రునియన్ కానియన్ వద్ద మంటలు దావానంలా వ్యాపించాయి. దాంతో హాలీవుడ్ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసి పోయింది. జనం పరుగులు తీసారు. ఎన్నడూ లేని విషాదభరితంగా ఈ కార్చిచ్చును చూపరులు అభివర్ణిస్తు న్నారు. ఒక్కపక్క మంటలనార్పేందుకు ప్రయత్నిస్తున్న హెలికాప్టర్లు, మరోపక్క బాధితుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హోరెత్తి పోయింది. పాలిసేడ్స్, ఈటాన్ వద్ద భారీ మంటలు ఎగసి పడ్డాయి. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ సమీపంలో కూడా అదే పరిస్థితి. ఐతే అగ్ని కీలల్ని అదుపు చేయలేపోయామని ఫైర్‌చీఫ్ క్రిస్టన్ క్రౌలీ నిజాయితీగా ఒప్పేసుకున్నారు. ఈ కార్చిచ్చు ఎంతో మంది హాలీవుడ్ ప్రముఖులను నిలువ నీడలేకుండాచేయడం విశేషం. రియాల్టీసార్ పారిస్ హిల్టన్ ఇల్లు నామ రూపాల్లేకుండా దగ్ధమైంది. మరి కొంతమంది నటులు తమ ఆస్తులు కోల్పోయామని వాపోయారు. పాలిసాడ్స్ లో దివంగత విల్ రోజరెస్ ఇల్లు, హాలీవుడ్ హిల్స్‌లో రన్‌యాన్ కెనాన్‌లో కార్చిచ్చు వలన వందలాది ఎకరాల్లో గృహాలు కాలిపోయాయి. హావిచ్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ విలాసవంతమైన ఇల్లుకూడా దగ్ధమైంది. ఎన్నో చారిత్రక నిర్మాణాలు శిథిలమైపోయాయి. ఈసారి హాలీవుడ్ ప్రాంతాలు, ప్రముఖుల గృహాలు కూడా కార్చిచ్చులో తగలబడిపోయాయి. 1976 ప్రాంతాలలో విడుదలైన క్యారీ తదితర సినిమాల్లో కనిపించిన పాలిసాడ్స్ చార్టర్ హైస్కూలు వంటి ఎన్నో కళాత్మక, చారిత్రక భవనాలు భస్మీపటలమయ్యాయి. ఇంకా కార్చిచ్చు ఇప్పట్లో ఉపశమించేటట్లు లేదు. ఈ లోగా ఇంకెన్ని హాలీవుడ్ ఐకానిక్ కట్టడాలకు ముప్పుఏర్పడుతుందని చెప్పలేం. ఈ నేపథ్యంలోనే ఏటా జరిగే ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరిగే డాల్బిదియేటర్‌కు కూడా ముప్పు తప్పదనే ఉద్దేశ్యంతో ఆ అవార్డులను వాయిదా వేశారు. సంపన్నులు సెలబ్రిటీలు అధికంగా నివసించే లారెల్ కాన్యన్ బైలే వార్డ్, ముల్హోలాండ్ పై కలోని నివాసాలను కూడా ఖాళీ చేయించారు. వాతావరణాన్ని కలుషితం చేసిన కార్చిచ్చు పర్యవసానంగా ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని దాని వలన ఈ ప్రాంత వాసులను వైద్యులు హెచ్చరించారు. ఈ కార్చిచ్చులు దావానలంలా వ్యాపించి లాస్ ఏంజిల్స్ లోని పలు ప్రాంతాల రూపు రేఖల్ని మార్చేస్తాయన్న అనుమానంతో ఎన్నో భీమా సంస్థలు ఆ ప్రాంత ఆస్తులపై భీమా ఇవ్వడం కొన్ని మాసాలుగా ఆపేసాయి. అంటే కార్చిచ్చుల రాకపోకల విషయమై అంచనా వేసి, తెలిపే వాతావరణ హెచ్చరికలు తెలిపే వ్యవస్థలున్న అమెరికా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటే దావాగ్ని జ్వాలల్ని నిరోధించలేకపోయినా ప్రమాద తీవ్రత నుండి జననష్టం లేకుండా కాపాడగలిగేదేమో!

చదువు డబ్బు లాంటిది. ఎంత సంపాదించినా అంతకంటే ఎక్కువ సంపాదించడానికి మనస్సు ఉబలాటపడాలి.



జోసెఫ్ బిల్లింగ్స్

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరకపడితే, మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

# రైతు శ్రేయస్సుతో జాతి ప్రగతి

**ప్రభుత్వపరంగా సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. ఆర్థిక సహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అంది పుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి.**

డి జె మోహన రావు

ఈ మధ్యలో టమాటా రేటును చూస్తూ ఉన్నాం. కిలో నాలుగు రూపాయలు పలుకుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ పంటను సాగుచేసిన రైతన్నకు ఏంటి లాభం? కనీసం పెట్టుబడి కూడా రాని స్థితి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే ! దీనికి కారణం ఏమిటి ? కర్షకుడు చావుకు కోటి కారణాలు ఉన్నట్లు వ్యవసాయం లాభసాటి కాకపోడానికి అనేక కారణాలు ఉన్నాయి. రైతే దేశానికి వెన్నెముక అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. వాస్తవానికి ఎక్కువ పెట్టుబడి తక్కువ లాభాలుఆర్జిస్తున్న రంగం ఏదయినా ఉందంటే అది వ్యవసాయ రంగం మాత్రమే ! రైతు శ్రేయస్సే జాతి శ్రేయస్సు. కారణం మనకు ఎంత సంపదున్నా మన కడుపు నింపేది రైతు మాత్రమే! వ్యవసాయం ఒక ప్రొఫెషన్ అవ్వాలి. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయయోగ్యమైన భూమిని కలిగి ఉన్న మన దేశం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తూ ప్రజల ఆహార వసరాలు తీర్చే వ్యవసాయం గ్రామీణ ప్రజానీకానికి వెన్నెముక. దేశ మొత్తం భూభాగంలో వ్యవసాయ అవసరాల కోసం దాదాపు 60శాతం భూభాగం వినియోగించ బడుతున్నది. ఉపాధి, ఉత్పత్తి పరంగా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైనది. యాభై యెనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. గ్రామాలలోనే నివసిస్తున్న 72.8శాతం మంది జనాభాలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ యాభై శాతానికి పైగా ప్రజలకు జీవనోపాధిని అందిస్తుంది. మొత్తం శ్రామిక శక్తిలో యాభైయెనిమిది శాతం ఈ రంగంలోనే ఉన్నారు. దేశ జిడిపిలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. ఆహార పరిశ్రమల ముడిపదార్థాలు వ్యవసాయం నుండే లభిస్తున్నాయి. అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు సేవారంగాల వృద్ధికి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుంది. గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని రక్షించడానికి వ్యవసాయం సహాయపడుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయరంగానికి రైతన్నే కీలకం. వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగాఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నది. రైతులు వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయక జీవననాణ్యతకు ఆటంకం కలిగించే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. విత్తు నుండి కోత వరకూ రోజూ రైతుకు ఒత్తిడే. తరతరాలుగా కుటుంబ సభ్యుల మధ్య జరిగిన భూవిభజన వలన, జనాభా ఒత్తిడి కారణంగా, చిన్న రైతులు అప్పులు తీర్చుకోవడానికి తమ భూమిలో కొంత భాగాన్ని అమ్ముకోవడం వలన సాగుభూమి చిన్నాభిన్నంగా చిన్న కమతాలుగా మారిపోతున్న మూలాన నీటిపారుదలకు, యాంత్రీకరణకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలింబించడానికి ఆటంకం కలుగుతుంది. ఇది పంటల ఉత్పాదకతను తగ్గిస్తుంది. భూమి పరిమాణంచాలా తక్కువగా ఉన్నప్పుడు సాగు ఆర్థికంగా ఉండదు. నాణ్యమైన విత్తనాల కొరత పెద్ద సమస్యగా మారింది. కొంత వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకి వస్తున్నాయనో లేదా అరువుగా ఇస్తున్నారనో, అవగాహనా లోపంతోనో చాలామంది రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు విషయంలో కూడా ఇంతే ! నాణ్యమైన ఎరువులు లేక నేల నిస్సారమై పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి దిగుబడి తగ్గి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. ఇలానే జరగడం వలన సరైన పంట ఉత్పత్తి కాక రైతులు ఉసూరుమంటున్నారు. నాణ్యమైన పంటలకు సరైన సమయంలో



సరైన అవకాశాలు మొత్తంలో నీరు ఉండాలి. దేశంలో ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారంపైనే ఆధారపడి వుంది. దేశంలోని 14.1కోట్ల హెక్టార్లస్థూల విత్తన విస్తీర్ణం లో 52శాతం అంటే దాదాపు 7.3కోట్ల హెక్టార్లు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగి ఉందని నీతిఆయోగ్ డేటా తెలుపుతుంది. అరవై ఐదు శాతం వ్యవసాయం ఋతుపవన వర్షపాతంపై ఆధారపడిఉంది. మొత్తం నీటిపారుదల ప్రాంతంలో 40 శాతం కాలువల మీద, మిగిలినది భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. ఋతుపవనాలలో ఏమాత్రం తేడా వచ్చినా సరైన సమయంలో వర్షం పడకపోతే కాలువల మీద ఆధారపడిన ప్రాంతంలో కూడా పంటలు పండవు. ఇక కాలువేతర ప్రాంతాలలో కేవలం భూగర్భజలాలే ఆధారం. సాగునీరుగా భూగర్భజలాలను అధికంగా వాడడం వల్ల తాజా భూగర్భజల స్థాయిలు క్షీణించాయి. అతివృష్టి, అనావృష్టి, పంట ఉత్పత్తిపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఎదుర్కొంటున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతోసహా భారతీయ పంటల దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. హరిత విప్లవం, అస్తవ్యస్త నీటిపారుదల వ్యవసాయ పద్ధతులు భూమి క్షీణతకు దారితీశాయి. మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటుంది. ఒకే పంటను పదే పదే సాగుచేయడం వల్ల నేల పోషకాలును కోల్పోయి నిస్సారంగా మారింది. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధికవడ్డీకి రుణాలు వాడుతున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధికఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పులపాలవుతున్నారు. చాలామంది అనధికారిక వనరుల నుండి రుణాలు పొందుతున్నారు. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇదిపంట అనంతర నష్టాలను మరింత పెంచుతుంది. వీరు పండించే పంటలను విక్రయించడానికి ఇప్పటికీ దళారులపైనే ఆధార పడుతున్నారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు. నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడంవలన వచ్చే ఆదాయంలో కొంతభాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతుంది. సాగులో ఆధునిక సాంకేతికలు అమలు పరచడం లేదు. అందరూ సొంత వ్యవసాయ కమతాలు కలిగి ఉండరు. వ్యవసాయంలో సాంకేతికతను జోడించి ఖర్చులను కనిష్ఠం చేసే మార్గాలను ప్రవేశపెట్టాలి. వ్యవసాయ పని తీరును మెరుగుపరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్క రించడం అత్యవసరం. ఇటు రైతు అటుప్రభుత్వాలు వ్యవ సాయానికి రెండు చక్రాల్లాంటివారు. నేల క్షీణతను అరికట్ట దానికి తగు చర్యలు తీసుకోవాలి. పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టంలతో సహా, సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు అవలంబించాలి. విభిన్న పంటరకాలు, పద్ధతులను అనుసరించాలి. సేంద్రియ ఎరువులు వాడాలి. ఇక ప్రభుత్వపరంగా సమర్థవంతమైన నీటి పారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. ఆర్థిక సహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అంది పుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. ●

# సువిశాల భారతావనికి సంక్రాంతి!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

వైవిధ్యభరిత భారతంలో శీతాకాలం ముగింపుకు సూచిస్తూ, కొత్త పంటలు ఇంటికి రావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో భోగితోపాటు మకరసంక్రాంతి, పంజాబీలు నిర్వహించుకునే లోహ్రీ పండుగ, అస్సామ్‌లో భోహాగ్/భోగాలి/రంగోళి బిహూ వేడుకలు, గుజరాత్‌లో ఉత్తరాయన్, తమిళనాడు పొంగల్, కేరళలో మకర విలక్కు, త్రిపురలో హంగ్రై, మిథిలలో తిలా సక్రెయిత్, యూపీ/బీహార్ లో ఛత్ పూజలు, ఒడిసాలో మకర చౌలా, వమహారాష్ట్రలో మాఘి సంక్రాంతి, కశ్మీర్‌లో శిశుర్ సంక్రాంతి, పశ్చిమ బెంగాల్‌లో పౌశ్ సంక్రాంతి, ఉత్తరాఖండ్‌లో గుగుటి, ఇతర ప్రాంతాల్లో తెహ్రీ, సర్కత్ లాంటి పేర్లతో పర్వదినాలు ఒకే లక్ష్యంతో జరుపుకునే పవిత్ర పండుగలే. రైతుల పంటలు ఇంటికి చేరిన శీతాకాల ముగింపు శుభవేళల్లో ఘనంగా నిర్వహించుకునే వేడుకలే ఈ పర్వదినాలు. పేరు ఏదైనా, భారతదేశవ్యాప్తంగా వైవిధ్యభరితంగా మకర సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవడం మన సాంప్రదాయం. సంక్రాంతి సమయంలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడం 14 జనవరి 2025న జరగడంతో మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. ధాన్యలక్ష్మి గృహ ప్రవేశం చేయడంతో పాటు శీతాకాలానికి వీడ్కోలుగా ఈ పర్వదినం జరుపుకోవడం జరుగుతున్నది. ఈ సమయంలో సూర్యుడు ఉత్తరం వైపు వెళ్లడంతో దీనిని ఉత్తరాయణంగా పవిత్ర భావనలతో జరుపుకుంటారు. ఈ పండుగ వేళల్లో పతంగులా ఎగరేయడం, భోగి మంటలతో చలికి వీడ్కోలు పలకడం, ప్రత్యేక పిండివంటలు చేసుకోవడం, కోడి పందాల జోరు, ఇల్లు వాకిళ్లను ముగ్గులతో నింపేయ డం, గొబ్బెమ్మలతో అలంకరించడం, పిండి వంటలు చేసుకోవడం లాంటివని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. దక్షిణ భారత తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పొంగల్ పండుగను జరుపుకుంటారు. తమిళంలో 'పొంగల్' అనగా 'ఉడకబెట్టడం' అని అర్థం. ఈ పండుగ నూతన సంతవత్సరంగా నాలుగు రోజుల పాటు (14 జనవరి నుంచి 17 వరకు) నిర్వహించుకుంటారు. ఈ రోజున సూర్యదేవుడికి ఉడకబెట్టిన అన్నం, బెల్లంతో చేసిన తీపి పదార్థాలను నైవేద్యంగా పెడతారు. ఈ రోజున వ్యవసాయ పని ముట్లు, పశువులను పూజించడం కూడా జరుగుతుంది. పొంగల్ రోజు తమిళ నూతన సంవత్సరం మొదలు అవుతుంది. మొదటి రోజును భోగి పొంగల్‌గా, రెండవ రోజు సూర్య పొంగల్గా, మూడవ రోజు మట్టు పొంగల్‌గా, నాలుగవ రోజు కనుమ్ పొంగల్‌గా పూజ చేయడం జరుగుతుంది. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం 13 జనవరిన ఉత్తర భారత పంజాబీలు అతి పవిత్రంగా జరుపుకునే లోహ్రీ పండుగను పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో జరుపుకుంటారు. లోహ్రీ పండుగను సిక్కులు, హిందువులు సమైక్యంగా, ఉత్సాహభరితంగా నిర్వహించుకుంటారు. ఒక పెద్ద లోహపు (లోహ్) పాత్రలో రుచికరమైన వేపుడు వంటలను అందరూ కలిసి కట్టెల పొయ్యిపై తయారు చేయడం అనేఆచారం ఈ పండుగ ప్రత్యేకం. ఈ సామూహిక వంటలతో పౌర సమాజనసమైక్యతను చాటుకుంటూ, జరుపుకోవడం లోహ్రీపండుగ పరమార్థం. మహారాజా రంజిత్ సింగ్ కాలం నుంచే బహుళ ప్రచారంలోకి వచ్చిన లోహ్రీపండుగ రోజున భోగిమంటలు, నూతన వస్త్రధారణ, సాంప్రదాయ నృత్యాలు, రుచికరమైన వంటలు, ప్రత్యేకకార్యక్రమాలు, ఊరువాడ ఏకమైన సామూహిక ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో భోగాలి, భోహాగ్/రంగోళి బిహూ అనే పర్వదినం ఒకటి. అస్సామీల నూతన సంవత్సరం భోగాలి బిహూ రోజున ప్రారంభమవుతుంది. 'బిహూ' అనగా 'సమృద్ధి ఆనందం' అని అర్థం. పంటలు చేతికి రావడం, వసంతం రాకతో ప్రకృతి పచ్చదనంతో రంగురంగుల పూలతో శోభిల్లడంతో ఉత్సాహంగా ఈ పర్వదిన వేడుకలు జరుపుకుంటారు. గుజరాత్‌లో అతి పెద్ద పండుగ 'ఉత్తరాయణ్'. పతంగులు ఎగరేయడం, కుటుంబ సభ్యులు తీపి పదార్థాలను పంచుకోవడం జరుగుతుంది. పండుగ పరమార్థం ఒకటే అయినా వివిధపేర్లతో, వివిధ రీతుల్లో సంక్రాంతి వేడుకలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణాల్లో జరుపుకుంటూ తమ సంస్కృతి వారసత్వాలను కొనసాగించడం హర్షదాయకం. ●

# ప్రజావాక్కు



### యువతలో మార్పు రావాలి

భారతదేశాన్ని బాగు చేయడానికి ప్రపంచంలో అన్ని దేశాలు కన్నా ముందుగా నిలబెట్టడానికి నాకు బలిష్టమైన యువతరం కావాలి. పిరికివాళ్లు, కాటికి కాళ్లు చాపుకున్న ముసలి వాళ్లు, అక్షర జ్ఞానమే తెలియని చదువు లేని మూర్ఖులైన చిన్నపిల్లలు కాదుఅని స్వామి వివేకానందుడు అన్నారు. సంస్కృత భాష తెలియక అర్థం చేసుకోలేని భగవద్గీతను చదివేకంటే ,కొత్తగా నేర్చుకుని అవునో, కాదో అనే సందేహంతో మంచో చెడోఏదో ఒకటిచేస్తారు. అదీ చేతకాకపోతే ఫుట్బాల్ ఆడండి గెలుపో ఓటమో ఏదో ఒకటి వస్తుంది గుణపాఠం నేర్చుకుంటారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న జువెనైల్ నేరాలు

దేశంలో జువెనైల్ నేరాలు పెరిగిపోతున్నాయనన పలు నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ధనిక, పేదా అనే వ్యత్యాసం లేకుండా అనేక మంది యువత పలు నేరాల్లో నిందితులుగా మారటం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో, అమ్మాయిలపైఅఘాయిత్యాలు చేయడంలో, సైబర్ నేరాలు చేయడంలో వీరు ముందుంటున్నారు. చిన్నారులు పదమూడు సంవత్సరాల వయస్సు నుంచే వివిధ చెడు వ్యసనాలకు బానిసలవుతూ, పలు నేరాలు చేస్తూ పట్టుబడుతూ జైళ్లలో మగ్గుతున్నారు. జువెనైల్ నేరాలు పెరిగిపోతున్నాయి. తల్లిదండ్రులను బెదిరించి మరీ ఖరీదైన సెల్ ఫోన్లు, మోటార్ సైకిళ్ళు కొనడం. మరికొందరు పిల్లలు తమ తెలివితేటలను సైబర్ నేరాలు చేయడానికి వినియోగిస్తున్నారు.

- సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళంజిల్లా

### పెన్షన్‌దారుల సమస్యలు తీర్చండి

కేంద్రప్రభుత్వంలోనే అన్ని శాఖల పెన్షన్‌దారుల ఎన్నో అంశాలు చాలాకాలం నుండి వార్తగానే ఉంటుంది. వాటిలో ఎన్నో కోర్టుతీర్పు ఉన్నవే. అయినా ప్రభుత్వం కొంత వరకు మేలు చేసే ముఖ్యమైన వాటి గురించి ఇతర శాఖలకురిఫరెన్స్ తో కాలయాపనజరుగుతుంది. పింఛను దార్లు అందరూ ఆస్తిపరులు కారు. ఒకటో తారీఖుకు ముందేఎదురుచూపులు తప్పడం లేదు. ఒకపక్క ధరలు, ఛార్జీలు, వగైరా పెంపు తెలిసినదే. యూనియన్ ప్రతినిధులతో చర్చలు నామమాత్రమే.

-బొల్లోజు మేఘనాథమ్, విజయవాడ

### కోడి పందాలను నిషేధిస్తారా?

కోడి పందాలను నిషేధిస్తూ 2016లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునిచ్చినప్పటికి ఇవి నిర్విఘ్నంగా ప్రతియేటా ముఖ్యంగా గోదావరి, కృష్ణాజిల్లాలలో ధనవంతులు, రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తూంటారు. లక్షలకోట్ల రూపాయలు చేతులు మారుతూంటాయి. ఈ జాడ్యం మరికొన్ని జిల్లాలకు కూడా పాకింది. ఈ పందేలు కేవలం సంక్రాంతి పండుగ రోజుల్లోనే జరుగుతుంటాయి. ఈ చట్టవ్యతిరేక రక్తక్రీడను ఆపడానికి ప్రభుత్వం, పోలీసులు అనేకచర్యలు తీసుకుంటున్నారని వార్తల్లోచ్చాయి. డ్రోన్ల సహాయంతో ఎక్కడెక్కడ ఈక్రూరఆటలు ఆడిస్తున్నారో తెలుసుకునేఏర్పాట్లు చేసారట. గత సంవత్సరాలలో ఎవరిని అరెస్టు చేయలేదెందుకో? ఇప్పుడు సంక్రాంతి తరువాతనే కదా అసలు విచారణలు, అరెస్టులు ఉంటాయో లేదో తెలిసేది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### గాడి తప్పుతున్న ఎమ్మెల్యేలు!

రాష్ట్రంలో కూటమి పక్షాల తరుపున గెలిచిన పలువురు ఎమ్మెల్యేల వ్యవహారశైలి ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతుంది. చాలామంది ఎమ్మెల్యేలు కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారు. అలాగే మద్యం, ఇసుక, గుత్తేదారుల నుంచి కమిషన్ల గుంజటం పరిపాటి అయిపోయింది! ఏలూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యేగారిజన్మదిన వేడుకలకు ప్రభుత్వోద్యోగులను హాజరు కావాలని హుకుం జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది! కూటమి నేతలు వెంటనే అన్ని నియోజక వర్గాల్లో మూడు పక్షాల కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ఆయా ఎమ్మెల్యేల పని తీరుపై వాస్తవాలు రాబట్టి గాడి తప్పుతున్న ఎమ్మెల్యేలను దారికి తీసుకు రావాలి. లేకుంటే చరిత్ర పునరావృతం అవుతుంది.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### కార్చిచ్చు ఆగేదెప్పుడు?

అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు ఆగడం లేదు. సముద్ర తీరా ప్రాంతం కలిగిన లాస్ ఏంజిల్స్ భూభాగంలో పీడనం ఉష్ణోగ్రత రెండు అపసవ్యదశలో ఉంటాయి. అయితే గాలిలో తేమ లేకపోవడం వర్షాభావ పరిస్థితులు కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అంతమాత్రమే కాదు స్టాక్ హోమ్ అగ్రిమెంట్‌కి గాని 2015 నాటి పారిస్ అగ్రిమెంట్ లో కుదుర్చుకున్న 1.5 ఉష్ణోగ్రతను దాటి 1.8 డిగ్రీలకు ప్రపంచ ఉష్ణోగ్రత చేరడం ప్రమాద గంటికలు మోగిస్తుంది.

-భారత అవినాష్, జనగామ

**మనవి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విశాఖ రైల్వే జోన్‌లో గుంతకల్లు డివిజన్ విలీనం సబబేనా?

షేక్ అక్బర్ హుస్సేన్

దేశాభివృద్ధిలో అతనయంత కీలకమైన రవాణా వ్యవస్థలో రైల్వే వ్యవస్థలు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో విస్తృత ప్రయోజనాల రీత్యా తీసుకునే నిర్ణయాలలో కేంద్ర, రాష్ట్రాల పాలకులు సమన్వయం సక్రమంగా లేకుంటే ఏం జరుగుతుందో విశాఖరైల్వేజోన్ ఏర్పాటులో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం–2014లోని చాప్టర్–8, షెడ్యూల్ 13మేరకు కొత్తగా ఏర్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని స్పష్టంగా ఉన్నా పాలకులు మాత్రం అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని గాలికి వదిలేసి ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖపట్నంలో కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయతలపెట్టారు. తాజాగా దక్షిణ కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయ నిర్మాణాన్ని శంకుస్థాపన చేసింది. అంతవరకు బాగానే ఉంది. రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్‌ను ఎక్కడో 786కి.మీల దూరంలో ఉన్న విశాఖపట్నం రైల్వే జోన్‌లో విలీనం చేయడమొక్కటే ఈ ప్రాంత ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖ రైల్వే జోన్ పరిధిలో వాల్తేరు డివిజన్‌లోని కొంతభాగంతో పాటు విజయవాడ, గుంటూరు డివిజన్లను కలపడంపై ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరాలు లేకపోయినా గుంతకల్లు రైల్వే డివిజన్‌ను విశాఖ రైల్వే జోన్‌లో విలీనం చేయడంపై ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. మహారాష్ట్రలోని జిల్లా కేంద్రమైన నాందేడ్ డివిజన్ సెంట్రల్ రైల్వే జోన్ ప్రధాన కేంద్రమైన ముంబైకు 608కి.మీల దూరంలో ఉంది. అదే దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కేంద్రమైన సికింద్రాబాద్ కేవలం 271కి.మీల దూరంలో మాత్రమే కలిగి ఉంది. దీంతో నాందేడ్‌ను మహారాష్ట్రలోని ముంబై కంటే సికింద్రాబాద్‌లోనే కొనసాగడానికి నాందేడ్ డివిజన్ వాసుల అభిలాష. రైల్వే శాఖ కూడా ప్రజాభీష్టం మేరకే నాందేడ్‌రైల్వే డివిజన్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే కొనసాగిస్తోంది. స్వాతంత్ర్యం అనంతరం జరిగిన రైల్వే జాతీయీకరణలో భాగంగా 1951ఏప్రిల్ 14న భారతీయ రైల్వేలో ఆరుజోన్లు ఏర్పడ్డాయి. నాడు గుంతకల్లు రైల్వే డివిజన్ మద్రాసు కేంద్రంగా ఉన్న సదరన్ రైల్వే జోన్‌లో ఉండేది. పరిపాలన సౌలభ్యం కోసం 1966 అక్టోబరు 2న దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రాయలసీమ వాసులు, గుంతకల్లు రైల్వే డివిజన్ అధికార యంత్రాంగం మద్రాసు వెళ్లి రావడానికి దూరాభారం




కావడంతో దశాబ్దం పాటు పోరాడి ఎట్టకేలకు 1977 అక్టోబరు 2నుంచి ప్రస్తుతం సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో విలీనం చేయించుకున్నారు. నాటి నుంచి 48సం॥లుగా గుంతకల్లు రైల్వే డివిజన్ దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలో కొనసాగుతోంది. ఈ తరుణంలో 2019ఫిబ్రవరి 27న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్‌లను కలిపి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి రైల్వే మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌ను దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేయాలనుకోవడం అర్థరహితం, ఏకపక్ష నిర్ణయంగా ఈ ప్రాంతీయులు భావిస్తున్నారు. విశాఖ రైల్వే జోన్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌ను కలపమని ఎలాంటి విజ్ఞప్తులు లేవుకానీ పాలనాసౌలభ్యాన్ని అంచనా వేసుకోలేక గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి చుట్టుపక్కల గల రైల్వే జోనల్ ప్రధాన కేంద్రాలతో పోల్చితే విశాఖపట్నం రైల్వే జోన్ చాలా దూరమవుతుంది. గుంతకల్లు నుంచి నైరుతి రైల్వే (ఎస్‌డబ్ల్యుఆర్) ప్రధాన కేంద్రమైన హుబ్లీ కేవలం 256కి.మీలు మాత్రమే ఉండగా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్)జోనల్ ప్రధాన కేంద్రమైన సికింద్రాబాద్–366కి. మీలు, సదరన్ రైల్వే (ఎస్ఆర్) జోనల్ ప్రధాన కేంద్రమైన చెన్నై–445కి.మీలు ఉండగా ప్రస్తుతం కొత్తగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అత్యధికంగా 786కి.మీలు ప్రజలు, పాలకులు అధికార యంత్రాంగం తమ తమ అవసరాల నిమిత్తం జోనల్ కార్యాలయానికి వెళ్లి రావాలంటే 786కి.మీల దూరంలో ఉన్న విశాఖపట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో జోనల్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి రావాలంటే వ్యయప్రయాసలు తప్పవు. ముఖ్యంగా రైల్వే డివిజన్ కేంద్రం నుంచి జోనల్ కేంద్రానికి వివిధ విభాగాలకు చెందిన దాదాపుగా రెండు వందల మంది రైల్వే సిబ్బంది నిత్యం వృత్తిరీత్య వెళ్లి రావలసి ఉంటుంది. తద్వారా రైల్వే యాజమాన్యం ట్రావెలింగ్ అలవెన్సులు(టిఎ)ను చెల్లించవలసి ఉంటుంది. ఇది సిబ్బందికి దూరభారం కాగా రైల్వేకు ఆర్థిక భారం కూడా. సికింద్రాబాద్, హుబ్లీ జోనల్ ప్రధాన కార్యాలయాలకు ఒకే ఒక్క రోజు పట్టే సమయం, విశాఖపట్నం వెళ్లి వచ్చేందుకు మరో రోజో రెండు రోజులో పడుతుంది. ఈ ప్రతిపాదన సిఫార్సు చేసిన వారు ఇంత చిన్నలాజిక్‌ను ఎలా మిస్ అయ్యారోనని సీమ వాసులు ముక్కునవేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు ఈ విషయంపై దృష్టి సారించి ప్రజల అభీష్టం మేరకు గుంతకల్లు రైల్వే డివిజన్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే కొనసాగించాలని అశేష ప్రజానీకం కోరుతూ ఆ మేరకే గెజిట్ నోటిఫికేషన్ వెలువరించడం ఉభయ తారకంగా ఉంటుంది. ●

# క్రౌడ్‌ఫండింగ్‌లో సిఎం అతిశికి ఒక్కరోజే రూ.19.26లక్షలు



**న్యూఢిల్లీ,జనవరి 13:** దేశరాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్నకొద్దీ రాజకీయ పార్టీల్లో ప్రచారం జోరందుకుంది. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలోప్రధాన పార్టీల ప్రచారం వేడెక్కింది. ఈ క్రమంలో ఢిల్లీ సీఎం అతిశీ మర్లెనా ఎన్నికలప్రచారంకోసం క్రౌండ్‌ఫండింగ్‌ప్రారంబించారు. ఈ పిలుపునకు భారీ స్పందన వచ్చింది. ఒక్కరోజులోనే 19.26 లక్షల ఆన్‌లైన్ విరాళాలు అందాయి. కాల్‌కాజీ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి పోటీచేస్తున్న అతిశి మీడియాతోమాట్లాడుతూ ఈ క్రౌడ్‌ఫండింగ్ ప్రారంబించారు. ఎన్నికల్లో పోటీచేసేందుకు తనకు రూ.40 లక్షలు కావాలని అంతడబ్బు తనవద్ద లేనందున విరాళాలు ఇవ్వాలని ఆమెప్రజలను కోరారు. ఇందుకోసం ఒక ఆన్‌లైన్ లింక్‌ను విడుదలచేసారు. అందులో ఇప్పటివరకూ 443 మంది దాతలు రూ.19.26 లక్షలు విరాళంగా అందించారు. కల్కాజీ స్థానంనుంచి సీఎం అతిశి నామినేషన్‌కు ఏర్పాట్లుచేసుకున్నారు. ముందు స్థానికంగా ఉన్న కాల్‌కాజీ ఆలయాన్ని దర్శించుకుంటున్నట్లు ఆమెత ఎలిపారు. ఇదే స్థానంనుంచి బిజెపి తరపున మాజీ ఎంపి రమేశ్ బిదూరి కాంగ్రెస్‌నుంచి అల్కాలాంబాలుపోటీలో ఉన్నారు. అతిశిపై బిదూరిచేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. 70 స్థానాలనున్న ఢిల్లీలో ఫిబ్రవరి 5న ఎన్నికలు రగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కింపుచేపట్టి ఫలితాలనుప్రకటించనున్నారు. గత రెండుపర్యాయాలు విజయం సాధించిన ఆమ్ ఆద్మీపార్టీ ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్‌కొట్టాలని ఉత్సాహంగా ఉంది. అటు ఆప్‌ను అడ్డుకుని అధికారంలోకి రావాలని బిజెపి వ్యూహాలు రచిస్తోంది. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలైన కాంగ్రెస్, ఆప్ విడివిడిగానే పోటీచేస్తుండటం గమనార్హం.



# సరిహద్దుల వద్ద భారత సైన్యం మోహరింపులు బలంగా ఉన్నాయి

## ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ, జనవరి 13:** చైనాతో సరిహద్దులు పంచుకొంటున్న వాస్తవాధీన రేఖ వద్ద పరిస్థితి సున్నితంగా కొనసాగుతున్నా స్థిరంగానే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ మొదలైందని తెలిపారు. న్యూఢిల్లీలో న్యూఢిల్లీలో నిర్వహించిన వార్షిక ప్రెస్‌మీట్‌లో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. భారత సైన్యం మోహరింపులు బలంగా, సమతౌల్యంతో ఉన్నాయని ద్వివేది చెప్పారు. ఎటువంటి పరిస్థితినైనా సైన్యం ఎదుర్కోగలదన్నారు. సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయడంతోపాటు సామర్థ్యాలను బలపరుస్తున్నట్లు చెప్పారు. ఇక పాకిస్థాన్ వైపు ఉన్న నియంత్రణ రేఖ వద్ద చొరబాటు యత్నాలను అడ్డుకొంటున్నట్లు ద్వివేది వెల్లడించారు. పాక్ వైపు ఉగ్ర స్థావరాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని పేర్కొన్నారు. గతేడాది ఇక్కడ మట్టుబెట్టిన వారిలో 60 శాతం మంది ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చినవారేనని తెలిపారు. ఈశాన్య భారత్‌లోని మణిపుర్‌లో ప్రభుత్వం తీసుకొన్న చురుకైన చర్యలు ఫలితాన్ని చూపిస్తున్నాయని జనరల్ ద్వివేది చెప్పారు. ఈ రాష్ట్రంలో పరిస్థితి అదుపులో ఉందన్నారు. భద్రతా దళాలు, ప్రభుత్వం చురుగ్గా చేపట్టిన చర్యలు అక్కడి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి అని చెప్పారు.

# భారత్ సరిహద్దు సమీపంలో చైనా సైనిక విన్యాసాలు!

బీజింగ్, జనవరి 13: టిబెట్‌లోని అత్యంత ఎత్తయిన ప్రదేశంలో చైనా భారీగా సైనిక విన్యాసాలను మొదలుపెట్టింది. అత్యంత కఠిన ప్రదేశాల్లో యుద్ధ సన్నద్ధత, లాజిస్టిక్స్ సరఫరా వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని పిఎల్ఎ వీటిని నిర్వహిస్తోంది. ఇండియన్ ఆర్మీ ఫౌండేషన్ డే ఇంకొన్నాళ్లలో ఉండనగా చైనా వీటిని మొదలుపెట్టడం గమనార్హం. షింజియాంగ్ మిలటరీ కమాండ్‌కు చెందిన రెజిమెంట్ వీటిని చేపట్టింది. అత్యాధునిక సైనిక టెక్నాలజీ, ఆల్ టెర్రెన్ వెహికల్స్, అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్, డ్రోన్లు, ఎక్సో స్కెలిటెన్స్ వంటి వాటిని ఈ విన్యాసాల్లో వినియోగిస్తున్నారు. మరోవైపు వీటిని దృష్టిలో ఉంచుకొని భారత దళాలు అప్రమత్తమయ్యాయి.
తాజాగా బీజింగ్ చేపట్టిన లాజిస్టిక్స్ సపోర్ట్ ఎక్సర్‌సైజ్‌లు చాలా వ్యూహాత్మకమైనవి. అత్యంత ఎత్తయిన ప్రదేశాల్లో యుద్ధం వేళ వేగంగా దళాలకు అవసరమైన పరికరాలు, ఆహారం వంటివి సరఫరా చేయడంపైనా సాధన చేస్తున్నారు. ఈ విన్యాసాలు చేపట్టిన ప్రదేశం కూడా లద్దాఖ్‌ను ఆనుకొని ఉంది. ఇక్కడి వాతావరణ కారణంగా శారీరకంగా ఎదురయ్యే సవాళ్లను తట్టుకొనేలా చైనా దళాలు ఎక్సో స్కెలిటెన్లు వినియోగించడం విశేషం. 2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకొన్న భారత్-చైనా సైనిక ఘర్షణ తర్వాత ఈ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పలుమార్లు సైనిక-దౌత్య స్థాయిల్లో చర్చలు జరిపి పరిస్థితిని కొంత శాంతపర్చారు. బలగాలను వెనక్కి తీసుకొనే అంశంపై గతేడాది అక్టోబరులో కీలక ఒప్పందం జరిగింది.
భారత సైన్యం కూడా హిమాలయాల్లో పోరాట పటిమను పెంచుకొనేందుకు యేటా హిమ్ విజయ్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో వివిధ దళాల సమన్వయంతో ఆపరేషన్లు నిర్వహించడంపై సాధన చేశారు. చైనా దళాల కదలికలను గుర్తించేందుకు వీలుగా అత్యాధునిక నిఘా వ్యవస్థలు, ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లను భారత్ వినియోగిస్తోంది. సరిహద్దుల్లో కీలకమైన రోడ్లు, వంతెనలు, సొరంగాలు నిర్మాణాలను భారత్ వేగవంతం చేసింది.

# అప్పుడే ట్రంప్‌ను విభేదిస్తున్న ఉపాధ్యక్షుడు వాన్స్




**వాషింగ్టన్, జనవరి 13:** డొనాల్డ్‌ట్రంప్ జెడివాన్స్ ఇంకా ప్రమాణ స్వీకారంచేయకుండానే ఇద్దరికీ కొన్ని అంశాల్లో అభిప్రాయభేదాలు వచ్చాయి. క్యాపిటల్ హిల్ ఘటనలో నిందితులకు క్షమాబిక్ష అంశంపై వారు ఏకాభిప్రాయానికి రాలేదు. ఇప్పటికే వారికి తన అదికారాలను ఉపయోగించి కేసులనుంచి విముక్తి కల్పిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. మరోవైపు ఉపాధ్యక్షుడుగా వచ్చిన వాన్స్ మాత్రం సహ జంగానే వారికి ఎటువంటి క్షమాబిక్ష ఇవ్వకూడదంటున్నారు. తాజాగా వాన్స్ మాట్లాడుతూ ఇది చాలా సింపుల్. ఆరోజు శాంతియుత ఆందోళనచేసినట్లయితే మిమ్మల్ని జస్టిస్ డిపార్టుమెంట్ ఓ గ్యాంగ్ సభ్యుల్లా ట్రీట్‌చేసేది. మీకు క్షమాబిక్ష కూడా ఉండేది. కానీ ఒకవేళ మీరు ఆరోజు హింసకు పాల్పడితే మీకు క్షమావిక్షరాదు. దీనిపై కొంత అస్పష్టత ఉంది. జనవరి 6వ తేదీనాటి అల్లర్లకు సంబంధించి చాలా మంది అమాయకులు విచారణను ఎదుర్కోనడం సరికాదు. దాన్ని సరిచేయాలి అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై వాన్స్‌కు తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. జనవరి ఆరు ఖైదీల నిధికి నేనుకూడా విరాళం ఇచ్చానని, నేను సెనేట్‌బరిలో నిలిచినవేళ ఈ విషయాన్ని చాలామంది విమర్శించారు. నేను చాలా ఏళ్లుగా వీరిని రక్షిస్తున్నానన్నారు. నాడు జనసమూహంలో ఫెడరల్ ఇన్ఫార్మర్లు ఉన్నారు. వారికి క్షమాబిక్ష లభిస్తుందా అలాగని నేను అనుకోనన్నారు. అధ్యక్షుడు ప్రతి కేసును పరిశీలిస్తానని చెప్పారు. అలా అంటే కొంత వెనక్కి తగ్గినట్లు కాదు. అన్యాయంగా జైళ్లకువెళ్లినవారిని రక్షిస్తాం. ఎవరి ప్రభావానికోలోనయి రెచ్చిపోయినవారు, చెత్త విచారణలు ఎదుర్కొంటున్నా వారుకూడా వీరిలో ఉన్నారని ఆయన పోస్టుపెట్టారు. అధికారంచేపట్టిన తొలిరోజే క్యాపిటల్ హిల్స్ ఘటనలో నిందితులకు క్షమాబిక్షను ప్రకటిస్తాననం ట్రంప్ చెప్పారని ఇటీవల ఎన్‌బీసి మీట్‌ది ప్రెస్‌లో మాట్లాడుతూ వీలైనంత త్వరగా దీనిని పూర్తిచేస్తానన్నారు. 2020 జనవరి 6వ తేదీ జోబైడెన్ విజయం తర్వాత ట్రంప్ మద్దతుదారులు క్యాపిటల్‌హిల్‌భవనం వద్దకు చేరి ఆందోళన చేపట్టారు. తర్వాత వారు అడ్డంకులు తొలగించుకుని ఆభవనంలోకి చొరబడి అరాచకం సృష్టించారు. 100 మంది పోలీసులు గాయపడ్డారు. సుమారు 1500మందిపై దీనికి సంబంధించి కేసులు కూడా నమోదుచేసారు.

# బంగ్లా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, హైకమిషనర్‌కు సమన్లు

**న్యూఢిల్లీ, జనవరి 13:** బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబాటు యత్నాలు, స్మగ్లింగ్ కార్యకలాపాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ భద్రతను పటిష్టం చేసింది. ఈ క్రమంలోనే కంచె నిర్మాణానికి చర్యలు తీసుకోగా బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాల నడుమ సరిహద్దు ఉద్రిక్తతల పేరుతో భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను బంగ్లాదేశ్ విదేశాంగశాఖ పిలిపించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై భారత్ సైతం తగు చర్యలు తీసుకుంది. ఇక్కడి బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నురల్ ఇస్లామ్‌కు విదేశాంగశాఖ సమన్లు జారీ చేసింది. దీంతో ఆయన కార్యాలయానికి చేరుకుని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇండో, బంగ్లా సరి హద్దుల్లో అయిదుచోట్ల కంచెల ఏర్పాటుకు భారత్ ప్రయత్నిస్తోందని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఢాకా ఆరోపణలు చేసింది. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే విదేశాంగశాఖ కార్యాలయానికి వెళ్లిన వర్మ అక్కడున్న కార్యదర్శి జషీముద్దిన్‌తో సమావేశమయ్యారు.
అనంతరం వర్మ మీడియాతో మాట్లాడుతూ కంచెల విషయంలో రెండు దేశాల రక్షణ దళ్ళాలు బిఎస్ఎఫ్, బిజిబిలు ఓ అవగాహనతో ఉన్నాయి. సరిహద్దు వెంబడి నేరాల నియంత్రణకు ఈ అవగాహన, సహకారం కొనసాగుతాయని ఆశిస్తున్నానని తెలిపారు.

# రూ.5వేలకోట్లతో మహాకుంభమేళ ప్రధాన మౌలిక సదుపాయాల కల్పన

## - 13వేలకుపైగా రైళ్లు - 1,176సిసి కెమెరాలతో ప్రత్యేక పర్యవేక్షణ - రైల్వే బోర్డులో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు




**గుంతకల్లు రైల్వే,జనవరి 13,ప్రభాతవార్త** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ రాజ్(అలహాబాద్)లో జరుగుతున్న మహాకుంభ మేళ-2025కు 40కోట్లమంది యాత్రికులు సందర్శించే అవకాశం ఉందని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి తరలి వచ్చేయాత్రికుల సౌకర్యార్థం ఐదువేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రధాన మౌలిక సదుపాయాలన ప్రాజెక్టులను చేపట్టినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే బోర్డు చైర్మన్/సిఇవో సతీష్‌కుమార్ తదితరులతో కలిసి మాట్లాడుతూ లక్షలాది మంది యాత్రికులను సురక్షితంగా సజావుగా సాంకేతికంగా అధునాతన సేవలను అందించడమే భారతీయ రైల్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైల్వే బోర్డులో ఆపరేషన్స్,కమర్షియల్,సెక్యూరిటీ,మెకానికల్,సివిల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్ విభాగాల నుంచి ప్లాట్‌ఫాం మొదలుకొని స్టేషన్,డివిజన్,జిల్లా,జోనల్‌లో నుంచి రైల్వే బోర్డులలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాంగం ప్రయాగరాజ్,నైని,చియోకీ,సబేదార్ గంజ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన 12 భాషలలో ప్రకటన వ్యవస్థ యాత్రికులకు 22 భాషలతో కూడిన ప్రత్యేక సమాచార దర్శిని పుస్తకాన్ని వైష్ణవ్ ఆవిష్కరించారు.
కుంభమేళాలో 13వేల రైళ్లను నడుపుతుండగా వీటిలో 10వేల సాధారణ రైళ్లు,3,134ప్రత్యేక రైళ్లు గతంలో పోల్చితే 4.5రెట్లు అధికం,1,869స్వల్ప దూరం ప్రయాణించే రైళ్లు,706 సుదూరంగా (వీటిలో దక్షిణ మధ్య రైల్వే 138రైలు సర్వీసులను నడుపుతుండగా,మరో 37రైలు సర్వీసులు దక్షిణ మధ్య రైల్వే మీదుగా వెళ్లే రైలు సర్వీసులను కలుపుకుని మొత్తం 175రైలు సర్వీసులను దక్షిణ మధ్య రైల్వే జోన్ మీదుగా ప్రయాణించే రైళ్లు),కాగా 559రింగ్ రైళ్లు ఏర్పాటు చేశారు. మహాకుంభమేళాను పురస్కరించుకుని ప్రయాణికుల రైళ్ల నిర్వహణ నిమిత్తం సరుకు రవాణా రైళ్లను డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ద్వారా మళ్లించారు.
ప్రత్యేకంగా కేటాయించిన ఐదువేల కోట్ల రూపాయాల పెట్టుబడితో రూ.3,700కోట్ల వ్యయంతో గంగానది మీదుగా బెనారస్-ప్రయాగరాజ్(వారణాసి-అలహాబాద్) మధ్య డబ్లింగ్ రైలు మార్గంతో పాటు 48ప్లాట్ ఫాంలు,21ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు,లక్షమందికి పైగా యాత్రికులకు సామర్థ్యంతో 23 శాశ్వత హోలి ్డంగ్స్,21ఆర్ఓబి/ఆర్‌యూబిల నిర్మాణం,151 మొబైల్ యూటిఎస్ కౌంటర్‌లతో పాటు,554టిక్కెట్ కౌంటర్లు,తొమ్మిది స్టేషన్‌లలో 12 భాష ప్రకటన వ్యవస్థలు,ఈ నెల 29న మౌని అమావాస్యను పురస్కరించుకుని 5కోట్ల మంది యాత్రికులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రియల్‌టైం పర్యవేక్షణలో 1,176సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి రైల్వే తరపున నిత్యం పర్యవేక్షణలో అప్రమత్తంగా ఉంటూ మహాకుంభమేళాను సాంకేతిక ఆధారిత అనుభవంతో సురక్షితంగా సమర్థవంతంగా భారతీయ రైల్వే నిబద్ధతతో పనిచేస్తుందని వారు వివరించారు.

# మా దేశాన్ని ఎన్నటికీ అమ్మకానికి పెట్టం

## కెనడా ప్రతిపక్ష నేత జగ్మీత్‌సింగ్



**వాషింగ్టన్, జనవరి 13:** అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా తమ దేశంలో 51వ రాష్ట్రంగా విలీనం కావాలని పలుమార్లు ప్రతిపాదించిన విషయం విదితమే. ట్రంప్ వ్యాఖ్యలను ఖలిస్థానీ మద్దతుదారు, నేషనల్ డెమోక్రటిక్ పార్టీ నేత జగ్మీత్‌సింగ్ తీవ్రంగా ఖండించారు. 'డొనాల్డ్ ట్రంప్‌నకు నేనొక సందేశం ఇవ్వాలనుకుంటున్నాను. మేము మా దేశాన్ని (కెనడా) ఎప్పటికీ మీకు అమ్మకానికి పెట్టం. మీరు కోరుకుంటున్నది ఇప్పుడే కాదు.. ఎప్పటికీ జరగదు. మా దేశంపై మాకెంతో ప్రేమ, గౌరవం ఉన్నాయి. ట్రంప్ నుంచి దానిని రక్షించుకోవడానికి ఎటువంటి పోరాటానికైనా ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని జగ్మీత్‌సింగ్ అన్నారు. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తున్న సమయంలో భవనాలకు అంటుకున్న మంటలను ఆర్పడానికి తమ అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారని.. అదే తమ వ్యక్తిత్వమని ఆయన అన్నారు. తాము వారి పొరుగు దేశాలకు మద్దతిస్తామన్నారు. ట్రంప్ అంటున్నట్లు కెనడాపై సుంకాలు విధిస్తే అమెరికా దానికి ప్రతిఫలం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. తాము కూడా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తామని అన్నారు. ఇటీవల కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తర్వాత కెనడా ప్రధాని ట్రూడో.. ట్రంప్‌తో భేటీ అయనఆయరు. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాన సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదా సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. అంతేకాక, ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రూడోకు చురకలంటించారు. ఈ క్రమంలో 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోను వ్యంగ్యంగా సంబోధించారు. కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో రాజీనామా చేసిన తర్వాత విలీనంపై ట్రంప్ మాట్లాడుతూ.. 'కెనడాలో మెజారిటీ ప్రజలకు 51వ రాష్ట్రంగా అమెరికాలో విలీనం కావడం ఇష్టమే అని అన్నారు. ఆ దేశంతో భారీ వాణిజ్యలోటును, ఇస్తున్న రాయితీలను అమెరికా ఇక ఎంతోకాలం భరించలేదని జస్టిస్ ట్రూడోకు తెలుసు కాబట్టే, రాజీనామా చేశారని పేర్కొన్నారు. కెనడా అమెరికాలో విలీనమైతే ఈ సుంకాలు, అధిక పన్నులు ఉండవని.. నిరంతరం చుట్టుముట్టి ఉండే రష్యా, చైనా నౌకల ముప్పు నుంచి సురక్షితంగా ఉండవచ్చని సూచించారు. అయితే ఈ ప్రతిపాదనకు కెనడా వైపు నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు.

# నలుగురు పిల్లల్ని కంటే రూ.లక్ష నజరానా

## మధ్యప్రదేశ్ పరశురామ్ కల్యాణ్ బోర్డు కొత్తస్కీం




**భోపాల్, జనవరి 13:** మధ్యప్రదేశ్ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పరశురామ్ కల్యాణ్ బోర్డు తమ కమ్యూనిటీని పెంచుకునేందుకు ఎక్కువ మంది సంతానాన్ని కనాలని పిలుపునిచ్చింది. నలుగురు పిల్లల్ని కనే బ్రాహ్మణ దంపతులకు రూ.లక్ష నజరానా ఇస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోజరిగిన ఒక కార్యక్రమంలో పరశురామ్ కల్యాణ్‌బోర్డు అద్యక్షుడు పండిత్ విష్ణు రాజోరియా ఈ ప్రకటన జారీచేసారు. మనం మన కుటుంబాలపై దృష్టిపెట్టడం మానేశామని ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారన్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోందని భవిష్యత్తు తరాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. అందుకే కనీసం నలుగురు సంతానం ఉండాలని కోరుతున్నట్లు రాజోరియా చెప్పారు. నలుగురు పిల్లల్ని కనే మహిలలకు బోర్డు తరపున రూ.లక్ష నజరానా అందిస్తామని నేను బోర్డు అధ్యక్షుడుగా దిగిపోయిన తర్వాత కూడా ఈ అవార్డు కొనసాగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్‌అవుతోంది.

# భార్య ప్రియాంక పుట్టినరోజు.. రాబర్ట్ వాద్రా అన్నదానం

**న్యూఢిల్లీ, జనవరి 13:** సోమవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ పుట్టినరోజు. ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్డ్ వాద్రా పేదలకు అన్నదానం చేశారు. న్యూఢిల్లీలో తన నివాసం వద్ద ఆయన భండారా (అన్నదానం) నిర్వహించారు. ఈ సందర్భంగా రాబర్డ్ వాద్రా స్వయంగా పేదలకు భోజనం వడ్డించారు. అయితే ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రియాంకగాంధీ కనిపించలేదు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారాలకే పరిమితమైన ప్రియాంకాగాంధీ ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బరిలో దిగి ఘనవిజయం సాధించారు. లోక్‌సభలో తన తొలి ప్రసంగంలోనే ఔరా అనిపించారు. అన్నదానం అనంతరం రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. పేదలకు స్వయంగా భోజనం వడ్డించడం తనకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. అందరూ తమ భోజనాన్ని ఆస్వాదించారని చెప్పారు. ప్రతిఒక్కరికీ లోహ్రీ శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రియాంకాగాంధీ ఎంపిగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో దేశంలోని చాలామంది సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వయనాడ్ ప్రజలు ప్రియాంకను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపారని అన్నారు.

# కాసినో, గ్యాంబ్లింగ్ బిల్లుకు థాయ్‌లాండ్ ఆమోదం



**బ్యాంకాక్, జనవరి 13:** క్యాసినో, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన ప్రతిపాదిత బిల్లుకు థాయ్‌లాండ్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వస్తే థీమ్, వాటర్ పార్కులు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ వంటి టూరిజం కాంప్లెక్సుల్లో క్యాసినోల ఏర్పాటుకు అనుమతికి వీలుంటుంది. ఇందుకు సంబంధించిన బిల్లు వివాదాస్పదమైనప్పటికీ పర్యాటకానికి మరింత ఊతమివ్వడంతో పాటు ఉద్యోగాల కల్పన కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు థాయ్ ప్రభుత్వం వెల్లడించింది. థాయ్‌లాండ్‌లో ప్రభుత్వం నిర్వహించే గుర్రపు పందేలకు మాత్రమే అనుమతి ఉంది. కానీ అక్రమ బెట్టింగ్ మాత్రం దేశవ్యాప్తంగా భారీస్థాయిలో కొనసాగుతోంది. ఇటువంటి అక్రమ జూదం సమస్యను పరిష్కరించడంతో పాటు ఆదాయాన్ని పెంచడం,
థాయ్‌లాండ్‌లో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యాలతో తాజా నిర్ణయం తీసుకున్నామని ప్రధాన మంత్రి పేటోంగ్టార్న్ పేర్కొన్నారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం 20 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారికి క్యాసినోలకు అనుమతి ఉండదు. విదేశీయులకు ఉచిత ప్రవేశం. కాగా థాయ్ పౌరులు మాత్రం రూ.148 డాలర్ల ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

# మాట నిలబెట్టుకున్న మోడీ.. నేను సిఎంనయ్యా!

## జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా




**శ్రీనగర్, జనవరి 13:** జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామనిహామీ ఇచ్చినట్లు గానేప్రధాని విజయవంతంగా ఎన్నికలు నిర్వహించారని మోడీ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లోజరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. ఆనాడే జమ్ముకాశ్మీర్‌లోఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు వాగ్దానంచేసారని అన్నట్లుగానే నాలుగు నెలలోపు జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికకలు జరిగి కొత్తప్రభుత్వం ఏర్పాటయిందని అన్నారు. దాని ఫలితంగానే తాను ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చానన్నారు. జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో అన్ని ప్రాంతాలప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని ఎక్కడా రిగ్గింగ్ అధికారి దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు లేవని పేర్కొన్నారు. అదే విధంగా జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరిస్తానని ఇచ్చిన హామీని ప్రధాని త్వరలో నెరవేరుసానతరని నమ్ముతున్నానని అన్నారు. మళ్లీ భారత దేశంలోని ఒక రాష్ట్రంగాజమ్ముకాశ్మీర్ అవతరిస్తుందని అన్నారు. ప్రధానిమోడీ కృషివల్ల సరిహద్దుల్లో శాంతిభద్రతలు కొలిక్కి వచ్చాయని ఒమర్ అన్నారు. పర్యాటకపరంగా కూడా కాశ్మీర్ అభివృద్ధిచెందుతోందని తెలిపారు. శ్రీనగర్ లేహ్ రహదారిపై సోన్‌మార్గ్‌ప్రాంతంలో నిర్మితమైన జడ్‌మోడ్ సొరంగాన్ని నేడు ప్రధానిమోడీ ప్రారంభించడంపట్ల ఆనందం వ్యక్తంచేసారు. ఈ సొరంగం ప్రారంభంతో ఎగువ ప్రాంతాలప్రజలు ఇకపైమైదాన ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఏడాదిలో ఏసీజన్‌లోనైనా లడక్‌ను రహదారిమార్గంద్వారాచేరుకోడానికి వీలవుతుందని అన్నారు.
దీనివల్ల సోన్‌మార్గ్‌కు పర్యాటకుల రాకకూడా పెరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో జమ్ముకాశ్మీర్‌లో పర్యటించిన ప్రధానినరేంద్రమోడీ అక్కడిప్రజల అభివృద్ధికోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. జమ్ముకాశ్మీర్‌ను మళ్లీ రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. కాశ్మీర్ యువతచేతిలో రాళ్లను వదిలేసి విద్య అబివృద్ధివైపు వెళ్లాలని ఎదురు చూస్తున్నారని అన్నారు.

# ఉక్రెయిన్ బందీలుగా ఉత్తరకొరియా సైనికులు

**క్యీవ్, జనవరి 13:** ఉక్రెయిన్‌పై రష్యాచేస్తున్న యుద్ధంలో ఆదేశానికి మద్దతుగా ఉత్తరకొరియా సైనికులు కూడా వచ్చినసంగతి తెలిసిందే. రష్యా తరపున పోరాడుతున్న ఇద్దరు ఉత్తరకొరియా సైనికులను తాము అదుపులోకి తీసుకున్నామని అధనయక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాలో బందీగా ఉన్న తమ సైనికులను విడుదలచేస్తే ఉత్తరకొరియా సైనికులను వారి అదినేత కిమ్‌జాంగ్ ఉన్‌కు అప్పగిస్తామని అన్నారు. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను అదుపులోకి తీసుకు నాన మని ఆదేశానికి చెందిన మరికొందరు సైనికులను పట్టుకోడానికి మాదళాలుప్రయత్ని స్తున్నాయని అన్నారు. రష్యా వద్ద బందీలుగా ఉన్న మా వాళ్లను విడుదలచేస్తేనే వీరిని ఉత్తం˘కొరియాకు అప్పగిస్తామని జెలెన్‌స్కీ వెల్లడించారు. అందుకు సంబంధించిన విడియోను కూడా షేర్‌చేసారు. పట్టుబడిన సైనికులపై ఉక్రెయిన్‌భద్రతా సర్వీస్ ఎస్‌బియు అధికారులు మాట్లాడుతూ ఒక సైనికుడు దగ్గర ఎలాంటి ధృవపత్రంలేదని, మరో సైనికుడి దగ్గర రష్యా మిలిటరీ కార్డు ఉందన్నారు. రష్యాకు మద్దతుగా సుమారు 12 వేల మంది ఉత్తరకొరియా సైనికులు రంగంలోకి దిగారని ఉక్రెయిన్ ఆరోపించింది. మాస్కో ప్రకటన చేయలేదు. ఉత్తరకొరియా సైనికులు కూడా భారీగా చనిపోయినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు.

# రాజ్యసభలో నోట్ల కట్టలు నైతిక విలువలకు సవాల్

## ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, జనవరి 13:** ఇటీవలి పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజ్యసభలో కరెన్సీ నోట్లకట్ట కనిపించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ మను సంఘ్వీకి కేటాయించిన కుర్చీ వద్ద ఆ కరెన్సీ నోట్లను గుర్తించినట్లు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆ సమయంలో వెల్లడించారు. తాజాగా ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇదే వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ఆ డబ్బు తమదంటూ ఎవరూ ముందుకు రాకపోవడం తనను బాధించిందన్నారు. ఇది మన నైతిక విలువలకు సవాలు వంటిందని పేర్కొన్నారు. 'గత నెలలో రాజ్యసభలో ఓ సీటు వద్ద కరెన్సీ నోట్ల కట్ట లభ్యమైంది. అయితే, ఆ నగదు మాదేనంటూ ఎవరూ ముందుకు రాకపోవడం నన్ను ఎంతగానో బాధించింది. అవసరాల దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరైనా ఆ నోట్లు తీసుకెళ్తూ ఉండొచ్చు.
కానీ, ఈ విషయంలో ఎవరూ ముందుకురాలేదు. ఇది చాలా తీవ్రమైన అంశం. మన నైతిక విలువలకు సవాలువంటిది' అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో అనేక యేళ్లపాటు నైతిక విలువల కమిటీ లేదని ధన్‌ఖడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1990ల చివర్లో మాత్రమే రాజ్యసభలో తొలిసారి ఈ కమిటీ ఏర్పాటయ్యిందని తెలిపారు. 'రాజ్యసభ ఛైర్మన్‌గా ఒక విషయం మాత్రం చెప్పగలను. సభలో ఉన్నవారు గొప్ప అర్హతలు, అనుభవం కలిగి ఉన్నవారే. కానీ, సభ కార్యకలాపాల విషయానికి వస్తే.. వేరేవారి మార్గనిర్దేశంలో నడచుకుంటారు' అని విచారం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ధన్‌ఖన్ నోట్లకట్ట ప్రకటనతో సభలో దుమారం చెలరేగింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలంటూ బిజెపి ఎంపిలు డిమాండ్ చేశారు.
ధన్‌ఖడ్ ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు బయటకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. సభకు తాను నోట్ల కట్టను తీసుకురాలేదని సింఘ్వీ స్పష్టం చేశారు. తన సీటు వద్ద కరెన్సీ నోట్లు దొరకడం భద్రతా వైఫల్యమేనన్నారు. సభలో ప్రతి సీటు చుట్టూ గాజు గదినిగానీ, ముళ్లతో కూడిన ఇనుప కంచెను గానీ ఏర్పాటు చేయాలని సూచించారు.



మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి తదితరులు

## మచ్చలేని మహానాయకుడు మర్రి చెన్నారెడ్డి

### జయంతి సందర్భంగా నివాళులర్పించిన పలువురు నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** మచ్చలేని మహానాయకుడు, మరిచిపోలేని మహానేత మర్రి చెన్నారెడ్డి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి 106వ జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మర్రి చెన్నారెడ్డి రాక్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు మాజీగవర్నర్ పి.ఎస్. రామ్మోహన్‌రావు, మాజీమంత్రి జానారెడ్డి, సమరసింహారెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, ఎంఎల్‌ఏ కాలే యాదయ్య, బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, శ్యాం సుందర్‌గౌడ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నారెడ్డి అనేకపదవులలో తన ప్రత్యేక ముద్ర వేసుకున్నారని, పార్టీలకు అతీతంగా అందరూ చెన్నారెడ్డిని అభిమానిస్తారన్నారు. చెన్నారెడ్డి స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### సంప్రదాయాలను పరిరక్షించడం మన బాధ్యత

### నారావారిపల్లిలో నారా దంపతులు

**చంద్రగిరి, జనవరి 13, ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరీ అన్నారు. సంక్రాంతి సంబరాలను సొంతూరులో జరుపుకునేందుకు నారా వారు కుటుంబంతో సహా నారావారిపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో సంక్రాంతి సంబరాలలో భోగిపండుగ రోజున ప్రధానమైన గొబ్బిళ్ళు, ముగ్గుల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, గొబ్బిళ్ళ పోటీలు, విద్యార్థులకు బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ ఛైర్స్, పొటాటో గ్యాదరింగ్, గన్నీబ్యాగ్ రేస్, లెమన్ స్పూన్, వంటి అనేక ఉత్సాహభరితమైన పోటీలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేదికపై అధిష్టించగా, నారా భువనేశ్వరీ పోటీలను ఆయనకు వివరించారు. ఈ పోటీలను తిలకించిన నారా దంపతులు క్రీడాకారులు, మహిళల ప్రదర్శనల స్ఫూర్తిని గమనించి మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి మనవడు నారా దేవాన్ష్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తేజపరచడం మరింత ఆసక్తిని కలిగించింది. ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి రూ.10,116/-లు నగదు బహుమతులను అందజేశారు.

అదేవిధంగా విద్యార్థులకు బహుమ తులు అందజేసి మహిళలు, విద్యార్థులతో వేర్వేరుగా గ్రూప్ ఫోటో తీయిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మ ణీ, నందమూరి వసుంధర, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎం ఎల్ఏలు పులివర్తి నాని, అమర్‌నాద్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు తెలుగు సాంప్రదాయాలకు ప్రతీకలు

### తెలంగాణ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్

**తొట్టంబేడు, జనవరి 13, ప్రభాతవార్త:** మన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ.సృజన అన్నారు. టిటిడి జెఇఒగా తిరుమలలో సేవలందించి, అటు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిగా, దేవాదాయశాఖ కమిషనర్‌గా సేవలందించి ప్రస్తుతం పదవీవిరమణ చేసిన జి.బలరామయ్య, తమ కుటుంబసభ్యులతో సంక్రాంతి పండుగరోజున ప్రతి ఏడాది క్రమం తప్పకుండా తమ స్వగ్రామమైన తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామానికి వస్తారు. ఈసందర్భంగా ఆయన కుమార్తె తండ్రిబాటలో పయనించి ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేడు తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ సృజన ఆధ్వర్యంలో సోమవారం స్వగ్రామం పూడిలో సంక్రాంతి సంబరాలను అంగరంగవైభంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ మన సంస్కృతి, నాగరికతలకు అనుగుణంగా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఇందులో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమైనవిగా అభిప్రాయపడ్డారు. నేడు యువత వారివారి ఉద్యోగరీత్యా, కుటుంబబాధ్యతలుకు మాత్రమే పరిమితం అవుతున్నారని రాష్ట్రం గురించి కూడా పట్టించుకోవాలని కోరారు.

అనంతరం గ్రామంలోని 'స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ', పూడియువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులకు,చిన్నారులకు, క్రీడాకారులకు బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, కోకో, చిన్నారులకు మ్యూజికల్‌ఛైర్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పండుగ సమయాల్లో స్వగ్రామంలో అందరితో గడపడం తమకు ఎంతో ఆనందమని ఆమె వివరించారు. రానురాను పండుగ ప్రాభవం తగ్గిపోతోందని సినిమాలు, టివిల వలన యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతోందన్నారు. టివిలు, ఇంటర్‌నెట్‌లు వచ్చిన తర్వాత యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్నారని భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాలంటే వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్ననాటి గుర్తులు అందరికీ గుర్తుండాలంటే తాము పుట్టిన పల్లెసీమలను మరచిపోకూడదన్నారు.

రానురాను పండుగలకు ప్రాముఖ్యత తగ్గిపోతోందని పండుగ ప్రాశస్త్యాలను తెలుసుకునేందుకు తమ వంతు ప్రయత్నాలుచేస్తున్నామన్నారు. గత పది సంవత్సరాలుపైగా తాము సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నామని, గ్రామీణ క్రీడలైన గోళీలు, బొంగరాలు, చిల్లంకోడు, కబడ్డీలతో పాటు వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించి నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతామన్నారు.

కార్యక్రమాల్లో మాజీ దేవాదాయశాఖ కమిషనర్ గుమ్మళ్ళబలరామయ్య, న్యాయవాది పి.రవితేజ, స్పందన స్వచ్ఛందసేవాసంస్థ సభ్యులు జలకంబాలమురళీ, జలకం.శ్రీనివాసులు, మాధవయ్య, చక్రి,పలువురు సభ్యులు, గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు. కాగా ఆయన్ను దుశ్శాలువ ఎంజిఎం హోటల్ డైరెక్టర్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు దుశ్శాలువతో సత్కరించారు.

# మందుపాతరలతో పోలీసులను టార్గెట్ చేస్తున్న మావోయిస్టులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** భద్రతా బలగాల దాడులతో వరుస ఎదురుదెబ్బలు తగులుతున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతోపాటు పొరుగునే వున్న తెలంగాణలో పట్టుకోసం మావోయిస్టులు మరోసారి మందు పాతరలను ఆయుధంగా ఎంచుకున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణలోని ములుగు, కొత్తగూడెం జిల్లాలలో పోలీసులపై దాడులకు నక్సలైట్లు మందుపాతరలను అమర్చిన విషయమై అప్రమత్తంగా వుండాలని పోలీసులను నిఘా వర్గాలు అప్రమ త్తం చేశాయి. పది రోజుల క్రితం ములుగులో పోలీసులను లక్ష్యం చేసుకుని నక్సలైట్లు అమర్చిన మందు పాతర పేలి ఓ గిరిజన యువకుడు గాయపడ్డాడు. దీని తరువాత ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా కుత్రు అటవీ ప్రాంతంలో నక్సలైట్లు అమర్చిన మందు పాతరకు తొమ్మిది మంది జిల్లా సాయుధ పోలీసులు మరణించారు. ఈ ఘటనలో మరో పదిమంది గాయపడ్డారు. ఈ రెండు ఘటనలకు బావసారూప్యం వుండడంతో ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆ రాష్ట్రానికి సరిహద్దుగా వున్న తెలంగాణలోని కొన్నిచోట్ల మావోయిస్టులు పెద్ద ఎత్తున మందు పాతరలను అమర్చివుంటారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నక్సల్స్ అమర్చిన మందుపాతరల కోసం ఛత్తీస్‌గఢ్, ఉత్తర తెలంగాణలో పోలీసులు గాలింపు చేబట్టసాగారు.

నక్సల్స్‌కు కోటగా వున్న ఛత్తీస్‌ఘడ్‌లో వారిని ఏరివేసేందుకు పోలీసులు చేబడుతున్న వరుస ఆపరేషన్లు తీరని నష్టం కలిగిస్తున్న పోలీసులపై ఎదురు దాడులకు మా వోయిస్టులు మందు పాతరలను అమర్చడం సంచలనం రేపుతోంది. పది రోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్ మందు పాతరకు తొమ్మిది మంది మరణించారు. గడచిన కొన్ని నెలలుగా వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో నక్సలైట్లు మరణిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో కొన్నిసార్లు భద్రతా బలగాల తరపున కొ ందరు గాయపడడం విదితమే. అయితే నక్సలైట్ల తరపున భారీ నష్టం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ ఖిల్లా అబూజ్‌మడ్‌ను కైవసం చేసుకు నేందుకు కేంద్ర బలగాలతో కలిసి రాష్ట్రాల పోలీసులు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో దండకారణ్యంలో గల అనేక నక్సలైట్ల శిబి రాలను పోలీసులు ధ్వంసం చేయడంతో పాటు వారికి చెందిన అనేక అమరవీరుల స్తూపాలను నేల మట్టం చేశారు. తమ నేతల స్తూపాలను పోలీసులు ధ్వంసం చేయ డం నక్సలైట్లకు రుచించడం లేదు. ఇదే సమయంలో వరుసగా తగులుతున్న ఎదురుదెబ్బలకు ప్రతీకారంగా బీజాపూర్‌లోని కుత్రు అటవీ ప్రాంతంలో నక్సలైట్లు ఐఈడీ మందు పాతర పేల్చి తొమ్మిది మంది పోలీసులను హత్య చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో గతంలో అనేకసార్లు పోలీసుల వాహనాలను నక్సలైట్లు మందుపాతరలతో పేల్చి వేసిన ఉదంతాలున్నాయి. ఈ ఘటనల్లో పదుల సంఖ్యలో పోలీసులు మృత్యువాత పడ్డారు. అయితే ఛత్తీస్‌ఘడ్‌లో సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల సంఖ్య పెరిగిన తరువాత నక్సల్స్ కట్టడి ఎక్కువయ్యింది. దీంతో పోలీసులపై ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని మావోయిస్టు నాయకత్వం తమ క్యాడర్‌ను ఆదేశించించడంతో పోలీసులను లక్ష్యం చే సుకుని నక్సలైట్లు మందుపాతర పేల్చినట్లు తెలుస్తోంది. ఇటువంటివి మరిన్నింటిని నక్సలైట్లు అమర్చివుంటారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. సాధార ణంగా నక్సల్స్ ఏరివేతకు పోలీసులు కాలి నడకన లేదా వాహనాలలో వెళుతుంటారు. కాలినడకన వెళ్లే వ్యక్తులపై మందుపాతర పేల్చడం వల్ల నష్టం తక్కువగా వుంటుందని, వాహనంలో వెళ్లే వారిని లక్ష్యం చేసుకుంటే నష్టం ఎక్కువగా వుంటుందని నక్సలైట్లు భావిస్తుంటారు. ఇదే సూత్రం ఆధారంగా కుత్రు అటవీ ప్రాంతంలో నక్సలైట్లు పోలీ సులను లక్ష్యం చేసుకుని మందు పాతర పేల్చారు. ఛత్తీస్‌గఢ్ విషయం ఇలా వుంటే తెలంగాణలోని ములుగులోనూ నక్సలైట్లు పోలీసులను లక్ష్యం చేసుకుని మందు పా తర అమర్చారు. అయితే అదృష్టవశాత్తూ ఇక్కడ ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఈ మందు పాతరపై పోలీసుల వాహనం వెళ్లివుంటే కచ్చితంగా నష్టం ఎక్కువగా వుండేది. అయితే ఓ గిరిజన యువకుడు కాలు పెట్టడంతో గాయపడ్డాడు. కుత్రు, ములుగు ఘటనల తరువాత ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఆ రాష్ట్రానికి సరి హద్దుగా వున్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పోలీసులను నిఘా వర్గాలు అప్రమత్తం చేశాయి. ఈ ప్రాంతాలలో నక్సలైట్లు మరిన్ని మందు పాతరలు అమర్చి వుంటారని నిఘావర్గాలు అంచనాకు వచ్చాయి. కుత్రు, ములుగు ఘటనల నేపథ్యంలో నక్సలైట్ల కూంబింగ్‌కు వెళ్లే పోలీసులు మరింత జాగ్రత్తగా ఉండాలని, ఏమరపాటుగా వుండరాదని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఛత్తీస్ గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ, సుకుమా జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అనుమానిత ప్రాంతాల్లో మందుపాతరల కోసం గాలింపు చేబట్టారు.

**అప్రమత్తంగా ఉండాలని ఛత్తీస్‌గఢ్, తెలంగాణ భద్రతా బలగాలకు నిఘా వర్గాల హెచ్చరిక**

## అధికార లాంఛనాలతో మాజీ ఎంపి మంద జగన్నాథం అంత్యక్రియలు

### అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు పొన్నం, జూపల్లి

**హైదరాబాద్ (సైదాబాద్), జనవరి 13, ప్రభాతవార్త:** మాజీ పార్లమెంటు సభ్యులు మంద జగన్నాథం అంత్య క్రియలను అధికార లాంఛనాలతో సైదాబాద్‌లోని ధోభిఘాట్ శ్మశాన వాటికలో సోమవారం నిర్వహించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంద జగన్నాథం ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు సోమవారం దోభిఘాట్ శ్మశానవాటికలో ముగిసాయి. చంపాపేటలోని ఆయన నివాసం నుంచి దోభిఘాట్ శ్మశానవాటిక వరకు అంతిమ యాత్రను నిర్వహించారు. మంద జగన్నాథం అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు అంత్యక్రియల కోసం తగిన ఏర్పాట్లు చేశారు.

**నివాళులర్పించిన ప్రముఖులు..**

మాజీ ఎంపి మంద జగన్నాథం మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు చంపాపేటలోని ఆయన నివాసానికి వచ్చి మంద భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. మంద జగన్నాథంతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకు న్నారు. ఎంపిగా ఆయన ప్రజలకు ఎన్నో సేవలందించారని, నిత్యం ప్రజల గురించి పరితపించే నాయకుడిని రాష్ట్రం కోల్పోయింద న్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపి రాములు, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ రాజయ్య, ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మధుయాష్కీ, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎంపి కె.కేశవరావు, బిఆర్‌ఎస్ నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు చంపాపేటలోని మంద జగన్నాథం నివాసానికి వచ్చి మంద భౌతికకాయం వద్ద నివా ళులర్పించి ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.

**మాజీమంత్రి కెటిఆర్ నివాళులు..**

అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ ఎంపి మంద జగన్నాథం భౌతిక కాయానికి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నివాళులర్పించారు. చంపాపేటలోని మంద జగన్నాథం ఇంటికి చేరుకున్న కెటిఆర్, మందా భౌతికకాయానికి నివాళు లర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం కెటిఆర్ మీడి యాతో మాట్లాడుతూ మంద జగన్నాథం రాజకీయాల్లో వివాదరహితుడని, సౌమ్యుడని, ఆయన మరణంతో రాష్ట్రం ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పో యిందన్నారు. నాలుగుసార్లు ఎంపిగా ఆయన అందించిన సేవలు చిరస్మణీ యమని అన్నారు.



మాజీ ఎంపి మంద జగన్నాథం అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు తదతరులు

## పటిష్ట వ్యూహంతో ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం

**తిరుమల, జనవరి 13, ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వార దర్శనాలను పటిష్ట ప్రణాళికలతో టిటిడి అధికారులు ప్రశాంతంగా చేయించగలిగారు. గత నాలుగురోజులుగా ఆన్‌లైన్‌లో పొందిన టిక్కెట్లు, ఆఫ్‌లైన్‌లో తీసుకుంటున్న దర్శన టోకెన్లతో భక్తులు తిరుమలకు చేరుకుంటే వారికి ఆలయంలోనికి సాఫీగా క్యూలైన్లలో వచ్చేలా చూస్తున్నారు. తిరుపతిలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల భక్తులేగాక తెలుగురాష్ట్రాల భక్తులు కూడా తిరుపతికి చేరుకుని రోజువారీగా 43వేల టోకెన్లు ప్రశాంతంగా అందుకుంటున్నారు. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు భక్తులు తిరుమలలోని వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా ఆలయంలోనికి చేరుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకుంటున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ ప్రాంతాల్లోని టోకెన్ కౌంటర్ల వద్ద పక్కావ్యూహంతో, పటిష్ట ప్రణాళికలతో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భద్రత సిబ్బంది భక్తులను నియంత్రించి వరుసక్రమంలో అనుమతించడంతో టోకెన్లు వచ్చిన భక్తులు వచ్చినట్లు పొందుతున్నారు. ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలను పటిష్టంగా నిర్వహించడంతో ఎక్కడా ఏ చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బంది లేకుండా టోకెన్లు జారీ జరుగుతోంది. మూడురోజులుగా 10వతేదీ వైకుంఠ ఏకాదశిన 60,094మంది భక్తులు, 11న ద్వాదశిన 53,103మంది భక్తులు, 12న మూడోరోజు 70,966మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం చేయించారు. సోమవారం సాయం త్రం వరకు 42వేలమంది భక్తులు వైకుంఠద్వారంలో శ్రీవారిని దర్శించుకున్నారు. మరుసటిరోజు దర్శనానికి వస్తుండటంతో ప్రశాంతంగా సాగుతోంది. తిరుపతి పరిసరాల్లోని స్థానికులు కూడా ఆధార్‌కార్డులతో ఈ దర్శన టోకెన్లు పొందుతున్నారు.

## 'సంక్రాంతికి బంపర్ ఆఫర్' ప్రకటనలను నమ్మవద్దు

### సెల్‌ఫోన్ వినియోగదారులకు టిజిసిఎస్‌బి హెచ్చరిక

**హైదరాబాద్, జనవరి 7, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు సంక్రాంతి పండగ వేళ కొత్త తరహా మోసాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మహా కుంభమేళ సందర్భంగా హో టళ్లు, గెస్ట్ హౌస్‌లు, త్రివేణి సంగమంలో ప్రత్యేక స్నానాలు, పూజల పేరిట నకిలీ వెబ్‌సైట్లు ప్రారంభించి అమాయకులను టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు సం క్రాంతి పండగ వేళ కొత్తరకం నేరాలను ఎంచుకున్నారు. పండగ వేళ సెల్‌ఫోన్‌లను ఆఫర్‌లో భాగంగా ఉచితంగా ఛార్జింగ్ చేస్తామని, ఊహించని విలువైన బహుమతు లను అందుకోండి, మేము సూచించిన మాల్స్‌లో ఉచితంగా షాపింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తాం...అంటూ సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా రెండు రోజు లుగా ప్రకటనలు ఇస్తుండడంపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) దృష్టి సారించింది. ఈ తరహా ప్రకటనల్లో అంతా మోసం వుందని, వీటిని నమ్మి ఫోన్‌లో క్లిక్ చేస్తే బ్యాంకులో వున్న నగదు క్షణాల్లో మాయం అవుతుందని టిజిసిఎస్‌బి అధికారులు హెచ్చరించారు. ఈ కామర్స్, ఆన్‌లైన్ వెబ్‌సైట్లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల పేరుతో వచ్చే ఫేక్ లింకులకు క్లిక్ చేయవద్దని ఆ విభాగం అధికారులు కోరుతున్నారు. ఈ తరహా మోసాలపై బాధితులు వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. మహా కుంభమేళ సందర్భంగా ప్రయోగరాజ్‌లో ప్రత్యేక ఏర్పాట్ల పేరిట హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి నకిలీ వెబ్‌సైట్‌ను వాడి లక్షా 50 వేల రూపాయలను పోగొట్టుకున్నాడు. ఇదే సమయంలో ఏపి సిఎం చంద్రబాబు నాయుడు పేరులో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి రా యితీపై మాల్స్‌లో దుస్తులు, షోరూంలలో వాహనాలను కొనుగోలు చేసే అవకాశం ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలుగు రాష్ట్రాల్లో విరివిగా ప్రకటనలు చేయసాగారు. ఇటువంటి ప్రకటనలను నమ్మవద్దని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. ఇదంతా సైబర్ నేరగాళ్ల పన్నాగమని వారు హెచ్చరించారు.

### ఐఐటి హైదారబాద్-జెఎన్‌టియుహెచ్ మధ్య

## విద్యా, పరిశోధనా సహకారం

### ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌తో జెఎన్‌టియు విసి భేటీ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** ఐఐటీ హైదరాబాద్‌తో విద్యా, పరిశోధనా సహకారాన్ని పెంపొందించడం కోసం జేఎన్‌టీయూ చర్యలు తీసు కోనుంది. ఇందుకు సంబంధించి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బూదరాజు శ్రీనివాస మూర్తితో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ, ఐఐటీ హైదరాబాద్ మధ్య విద్యా, పరిశోధనా సహ కారాన్ని బలపరచడంతోపాటు ఇన్నోవేషన్ మరియు పరిశోధనకు ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయడంతోపాటు ఇతర అనేక కీలక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధానంగా పరిశోధన కార్యకలాపాలను మెరుగుపరచడం, ప్రస్తుత ప్రయోగశాలలను అభివృద్ధి చేయడం, ప్రయోగశాలలను షేర్ చేసుకునే అవకాశాలపై చర్చించారు. వివిధ కోర్సుల్లోని పాఠ్యాంశాల్లో కొత్త సాంకేతికతలను ప్రవేశపెట్టడం, విద్యార్థుల ఉద్యోగావకాశాలతోపాటు యూనివర్సిటీ అభివృద్ధిని మెరుగుపరచడం గురించి చర్చించారు. రెండు ప్రతిష్టాత్మక సంస్థల మధ్య సహకారాన్ని పెంచుకోవడం, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి ప్రోగ్రామ్స్ తోపాటు.. అధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయడం ద్వారా దేశంలో సాంకేతికత, ఇన్నోవేషన్ మరియు పరిశోధన రంగాలలో ప్రగతిని సాధించాలని భావిస్తున్నారు. విద్యార్థుల కోసం కటింగ్-ఎడ్జ్ పరిశోధన, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి రంగాలలో రెండు సంస్థలు కలిసి పని చేయడానికి అవకాశాలను పరిశీలిస్తున్నారు. రెండు సంస్థల భాగస్వామ్యం సాంకేతికత అభివృద్ధి, ఇన్నోవేషన్ మరియు పరిశోధనలో మంచి అవకాశాలను అందిస్తుందని.. ఇకపైన విద్యా రంగంలో ప్రతిష్టను పెంపొం దించేందుకు దోహదపడుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**సుల్తాన్‌పూర్ క్యాంపస్‌ను సందర్శించిన బాలకిష్టారెడ్డి..**

తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర రావుతో కలిసి సోమవారం జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ క్యాంపస్‌ను తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి నరసింహ, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సునీతా రెడ్డితోపాటు ఇతర బోధన సిబ్బందితో మాట్లాడారు. తరగతి గదులు, గ్రంథాలయం, వసతి గృహాలు, భోజనశాల, స్టాక్ రిజిస్టర్లను వీసీ బాలకిష్టారెడ్డి పరిశీలించారు. అన్ని విభాగాలు, వసతి గృహాల్లో శుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు.. గడియార స్తంభం, ఆడిటోరియం నిర్మాణం మరియు ఫార్మసీ కళాశాల భూమి విస్తరణ కోసం ప్రతిపాదనలు సమర్పించారు. ప్రతిపాదనలను సమీక్షించి, రిజిస్ట్రార్‌తో చర్చించి వాటి అమలుకు హామీ ఇచ్చారు.

## ఎగువఘాట్‌లో అడ్డంగా తిరగబడిన ఆర్టీసి బస్సు

### ఇంజిన్‌ఆయిల్ వల్లే బ్రేక్‌లు పడక రక్షణ గోడకు ఢీ


**తిరుమల, జనవరి 13, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో సోమవారం మధ్యాహ్నం ఆర్టీసి బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డుగా తిరగబడింది. ఈ సంఘటనలో బస్సులోని ప్రయాణీకులు, టిటిడి ఉద్యోగులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సుడ్రైవర్ లోకేశ్‌కూడా గాయాలకు గురయ్యాడు. శ్రీకాళహస్తిడిపోకు చెందిన ఆర్టీసి బస్సు సోమవారం మధ్యాహ్నం తిరుమలకు వస్తున్న సమయంలో 12వ కిలోమీటర్ వద్ద హరిణి విశ్రాంతి కేంద్రానికి సమీపంలో జోరు వర్షం కురుస్తోంది. అప్పటికే అక్కడ రోడ్డుపై వాహనం ఇంజన్ ఆయిల్ ఎక్కువగానే పడివుంది. దీన్ని గమనించలేని బస్సు డ్రైవర్ సాధారణ రీతిలోనే వేగంగా వస్తుండటంతో బ్రేక్‌వేసినా అదుపులోకి రాలేదు. దీంతో కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీ కొన్ని రక్షణగోడను కొట్టి ఆగిపోయింది. బస్సు రోడ్డుకు అడ్డుగా తిరగబడింది. దీంతో తిరుమలకు వచ్చే అప్‌ఘాట్‌లో సుమారు 3కిలోమీటర్లు వరకు వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న అలిపిరి ఏవిఎస్‌ఒ రాజశేఖర్ వాహనాలను టోల్‌గేట్‌లోనే నిలుపుదలచేశారు. ఆర్టీసి సిబ్బంది, తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, ఏవిఎస్‌ఒ రాజశేఖర్ తమ సిబ్బందితో సంఘటనాస్థలికి చేరుకున్నారు. చాలాసమయం శ్రమించి బస్సును క్రేన్ సాయంతో పక్కకు తరలించారు. ఆ తరువాత వాహనాలను తిరుమలకు అనుమతించారు. కాగా గాయపడిన వారిని తిరుపతి రుయాకు తరలించారు.



## కనువిందు చేసిన దేశ, విదేశీ పతంగులు

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి 13, ప్రభాతవార్త:** హైదరాబాద్ మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఈ ప్రాంతంలో ఉంటారని రాష్ట్ర పరా ్యటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి క్రిష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ కైట్ స్ అండ్ స్వీట్ వేడుకలను సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జ్యోతి ప్రజ్వల చేసిన ప్రారంభించారు. ఈ వేడుకల్లో దేశ, విదేశాల నుంచి ఈ కైట్ స వేడుకల్లో పాల్గొన్నారు. తెలుగు ప్రజలందరికి మంత్రులు సం క్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కైట్ స ఫెస్టివల్‌కు 16 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ స ప్లేయర్లు, వివిధ రాష్ట్రాల నుంచి 60 మంది కైట్ స ప్లేయర్లు పాల్గొన్నారు. 400 రకాల స్వీట్ స్టాల్ స ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర స న్ వెన్నెల గద్దర్, రోడ్ స డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి,రామ్‌రెడ్డి,ఫైనాన్ స కమీషన్ మెంబర్ సుధీర్ రెడ్డి,పర్యాటక, సాంస ్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్‌వాల్, పరా ్యటక సంచాలకులు జెండగే హనుమంత్, బాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరిక్రిష్ణ, కైట్ ఫెస్టివెల్ కన ్సల్‌టెంట్ పవన్, డి.సోలంకి, క్లీక్కు కన్వీనర్ బెంజిమెన్, దేశ, విదేశాలకు చెందిన కైట్ స ప్లేయర్ స, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



చిలకవాగు కల్వర్టులోకి దూసుకువెళ్లిన బైక్

## అదుపుతప్పి చిలకవాగు కల్వర్టులోకి దూసుకువెళ్లిన బైక్

### యువకుడిని గమనించి బయటకు తీసిన స్థానికులు

**తాండూరు, జనవరి 13, ప్రభాతవార్త:** అదుపుతప్పి ఓ బైకు చిలుకవాగు కల్వర్టులోకి దూసుకు వెళ్లింది. యువకుడు బైక్‌తోపాటు కల్వర్టులో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే తేరుకొని యువకుడితో పాటు బైక్‌ను బయటకు తీసుకువచ్చారు. ఈ సంఘటన తాండూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. తాండూరు కోడంగల్ రోడ్డు మార్గంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న జాతీయ రోడ్డు పనుల్లో భాగంగా బ్రిడ్జి సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం తాండూరు నుంచి కోడంగల్‌వైపు ఓ యువకుడు బైక్‌పై వెళ్తున్నాడు. అయితే, కల్వర్టు నిర్మాణం వద్ద ఎలాంటి బారికేడ్లు లేకపోవడంతో యువ కుడు అదుపుతప్పి బైక్‌తోపాటు కల్వర్టులోకి దూసుకుపోయాడు. గమ నించిన స్థానికులు వెంటనే యువకున్ని బైక్‌ను బయటకు తీశారు. కల్వర్టు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థాని కులు వాపోయారు. నడిరోడ్డుపై కల్వర్టు పనులు చేపడుతున్నా ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపమే అంటూ మండిపడ్డారు. జరగరానిది జరిగితే బాధ్యులు ఏవరంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే కల్వర్టు వద్ద జాగ్రత్తలు చేపట్టాలని, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌పై డిజిపికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో డీజీపీ జితేందర్‌కి మాజీ మంత్రి హరీష్ రావు ఫోన్ చేశారు. అరెస్ట్ చేయదగిన కేసు కాకపోయినప్పటికీ.. పండుగ వేళ ప్రజా ప్రతినిధిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని చెప్పారు. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి అక్రమ కేసు బనాయించడం తగదని, కక్షసాధింపు చర్యలకు పోలీసులు సహకరించవద్దని సూచించారు. తక్షణమే స్టేషన్ బెయిల్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విడుదల చేయాలని కోరారు.

## గిరిజనుల జీవనోపాధిపై సర్కార్ దృష్టి

### కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ కల్పనకు కార్యాచరణ

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా గిరిజన సంక్షేమ శాఖ కసరత్తు చేస్తున్నది. అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నది. గతంలో అటవీ భూముల్లో వ్యక్తిగత హక్కుల కల్పనలో భాగంగా పోడు సాగు రైతులకు పట్టాలు ఇవ్వగా, ఈసారి సామాజిక అటవీ హక్కుల కల్పనలో భాగంగా ఆవాసం పరిధిలోని గిరిజనులందరికీ లబ్ధి కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోని ఉట్నూరు, ఏటూరు నాగారం, భద్రాచలం, మన్ననూరు ఐటీడీఏల పరిధిలోని మూడు వేల ఆవాసాల్లో కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ అమలుకు నిర్ణయించింది. ప్రతి ఆవాసానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోని వనరుల ద్వారా గిరిజనులు ఏ విధంగా లబ్ధి పొందవచ్చనే అంశంపై ఇప్పటికే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఈ విధానాన్ని తెలంగాణలోనూ అమలు కోసం ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నది. ఇప్పటి వరకు పరిశీలించిన వాటిలో ఒడిశా నమునాను రాష్ట్రంలో అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

## నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌పై వేటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్‌పై ప్రభుత్వం వేటు వేసింది. ప్రభుత్వ ఆసుపత్రిని అడ్డాగా చేసుకొని ఇష్టారాజ్యంగా కార్యకలాపాలు నడపడంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆమె పదవీకాలంలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించారు. రోగుల అవస్థలను పట్టించుకోకుండా తన చాంబర్‌ను ఫంక్షన్ హాల్‌లా మార్చుకొని పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం, సిబ్బంది నుంచి కానుకలు పొందడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని ఆమెను బాధ్యతలు నుంచి తప్పించింది. నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించింది.

## తెలుగు వాకిళ్లలో భోగి మంటల సందడి



**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగునాట సంక్రాంతి సందడి మొదలైంది.సోమవారం తెల్లవారు జామునుంచే రాష్ట్రంలో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. భోగి మంటలు గుండెల నిండుగా ఆనందరాగాన్ని పలికిస్తు న్నాయి. సంక్రాంతి శోభతో తెలుగు లోగిళ్లు వెలుగులీను తున్నాయి. భోగభాగ్యాల భోగిని సంక్రాంతిని ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.

భోగి పర్వదినాన ఊరూవాడా తెల్లవారు జామునే సందడి నెలకొంది. ఏడాదంతా సుఖశాంతులతో ఉండాలని, నవ ధాన్యాలు, సిరి సంపదలు కలగాలని కోరుకుంటూ, భోగి మంటలు వేశారు. కొత్త కాలానికి స్వాగతం పలుకుతూ, భోగిమంటల చుట్టూ చిన్నా పెద్దా కేరింతలు కొట్టారు. విజయవాడలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారే కాక దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారు సైతం ఇందులో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. మన సంస్కృతి సాంప్రదాయాలు నేటి తరానికి అందిం చాలనే లక్ష్యంతో వారిని దీనిలో భాగస్వామ్యం చేశారు. పిల్లలకు పండగ విశిష్టత, సంప్రదా యాలను తెలియజేశారు. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలు అంతరించిపోకుండా భావి తరాలకు తెలియజేయడం, వారు పాటించేలా చేయడమే ఆశయంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణం నుంచి పల్లెకు చేరిన వారంతా వేకువజామునే లేచి భోగి మంటలు వేశారు. ఆటపాటలతో సందడి చేశారు. శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నివాసం వద్ద ఉదయాన్నే భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఒంగోలులోని టిడిపి ఆఫీసులో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడల వేకువ జాము నుంచే భోగి మంటలతో ప్రజలు సందడి చేశారు. గంగిరెద్దులు, హరిదాసులు ఆటపాటలతో అలరించారు. సంక్రాంతి శోభతో తెలుగు ఇళ్ళన్ని వర్ణించలేని ఆనంద ఫలాల రుచులను పండిస్తున్నాయి. భోగభాగ్యాల సంక్రాంతిని ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కార్యాలయంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వెలిగించి సంబరాల్లో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట టిడిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు.

# కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుకు కేంద్రం సానుకూలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణలో రానున్న రోజుల్లో మరిన్ని విమానాశ్రయాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ మినహా ముఖ్యమైన నగరాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా.. కొత్తగూడెం ఎయిర్ పోర్టుకు సంబంధించిన కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం నుంచి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది.కొన్ని రోజుల క్రితమే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్‌లో నిర్మించాలని భావిస్తున్న మామునూరు ఎయిర్ పోర్టు భూసేకరణ, ప్రాజెక్టు వివరాలు, నిర్మాణాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరంగా ఉన్న వరంగల్ కు విమాన సర్వీసుల్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

తాజాగా.. భద్రాది కొత్తగూడెం జిల్లాలోనూ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కోరడంతో.. గతంలో కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) అధికారులు అక్కడ ఎయిర్ పోర్ట్ నిర్మించాలని భావిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఫీజిబిలిటీ సర్వే సానుకూలంగా రాకపోవడంతో విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎయిర్ పోర్టు నిర్మిస్తున్న ప్రాంతం.. దగ్గర్లోని ఎయిర్ పోర్టుల నుంచి రాకపోకల సాధ్యాసాధ్యాలు, విమానాశ్రయ నిర్మాణానికి అయ్యే ఖర్చు, వినియోగించాల్సిన సాంకేతికతలు, ఇతర ఆర్థికపరమైన అంశాలను పరిగణలోకి తీసుకుని విశ్లేషిస్తుంటారు. ఈ పరీక్షల్లో సానుకూల ఫలితాలు రాకుంటే.. ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగదు. కానీ.. కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్ పోర్టు రావడం వల్ల ఆ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అక్కడ ఎయిర్ పోర్టు నిర్మించాలని గట్టిగా పట్టుబడుతోంది.

ఈ నేపత్యంలోనే.. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిశారు. కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు నూతన ఎయిర్ పోర్టు నిర్మించాలని భావిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ మేరకు.. తాజాగా

### సర్వే కోసం 20న ఎయిర్‌పోర్టు అథారిటీ బృందం రాక

### ఫీజిబిలిటీ పరీక్షలు నిర్వహణ కోసం రూ.38 లక్షలు విడుదల

సాధ్యాసాధ్యాలను మరోసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. అధికారులను ఆదేశించడంతో, అక్కడ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై ఏయిర్‌పోర్ట్ అథారిటీ దృష్టి సారించింది. ఏఏఐ నుంచి నిపుణులు వచ్చి సంబంధిత ప్రాంతంలో ఫీజిబిలిటీ పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాల్సిందిగా.. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. వెనువెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర సంస్థ కోరిన రూ.37.87 లక్షలను విడుదల చేసింది. దీంతో..ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందం ఈ నెల 20న కొత్తగూడెంలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ బృందం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించి విమానాశ్రయ ఏర్పాటుకు కావాల్సిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ పరీక్ష, సాయిల్ టెస్టింగ్‌తో పాటు ఇతర సాధ్యాసాధ్యాలను పరిశీలించి, నివేదిక రూపొందించనుంది. కేంద్ర ప్రభుత్వ అధికారులు, నిపుణుల పర్యటన నేపథ్యంలో.. కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ తదితర ప్రాంతాల్లోని 950 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. ఈ భూముల్లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుకూలంగా ఫీజిబిలిటీ టెస్ట్ ఫలితాలు వస్తే.. భూసేకరణ చేసి విమానాశ్రయ నిర్మాణాన్ని సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని భావిస్తున్నారు.

# మేం కలిసే పనిచేస్తున్నాం!

### భక్తులకు మరింత మెరుగైన సేవల కోసం సమష్టి కృషి

### తిరుమలలో టిటిడి ఛైర్మన్, ఇఒ, అదనపు ఇఒ సంయుక్త సమావేశం



సోమవారం తిరుమలలో టిటిడి ఇఒ, అదనపు ఇఒతో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:** దురదృష్టవశాత్తు... పొరబా టున కొందరి నిర్వాకం వల్ల తిరుపతిలో 8వతేదీ రాత్రి తొక్కిసలాట ఘటన జరిగిందని, అంతమాత్రాన పాలకమండలి,అధికారుల మధ్య విభేదాలు ఉన్నట్లు ప్రచారం చేయడం మంచిదికాదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఒకింత అసహనంతో వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకమండలి, అధికారులు కలసి పనిచేసినపుడే లక్షలాదిమంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలందించ గలమన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న సామాన్య భక్తులకు త్వరితగతిన, మెరుగైన దర్శనం చేయించడానికి తామంతా కలసి పనిచేస్తున్నామని ఆయన నిర్మొహమాటంగా తెలిపారు.మా మధ్య భేదాభిప్రాయాలు లేవని, టిటిడిపై బురదజల్లే వార్తలు, అనవసరంగా దుష్ప్రచార వార్తలు రాసే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం మరీ విశేషం. తిరుమల విషయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుండి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. కొన్ని పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో టిటిడి ఛైర్మన్‌కు, ఇఒకు మధ్య మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు.

సోమవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సమష్టిగా మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన,పటిష్టమైన, పారదర్శకంగా సేవలు అందించేందుకు అందరూ కలసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలకమండలిలో కూడా సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకమండలి తీసుకునే నిర్ణయాలను అమలుచేయడంలో కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం కావచ్చేమోగానీ, తొందరపడి అసత్యప్రచారం చేయవద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. తిరుమల విషయంలో మీడియా సిబ్బంది కూడా కొంత మంచి దృష్టితో ఉండాలని ఆయన కోరారు. వైకుంఠ ఏకాదశికి భక్తులకు మెరుగైన సేవలందించామన్నారు. విద్యుత్‌కాంతులు, పుష్పాలంకరణలు, చక్కటి క్యూలైన్ల నిర్వహణ, శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత బావుందని పెద్దసంఖ్యలో భక్తులు అభినందనలు తెలిపారన్నారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మరణించడం, 50మంది వరకు గాయపడటం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,టిటిడిని, ప్రజలను ఎంతో బాధించిందన్నారు. ఇప్పటికే 31మందికి పరిహారం అందించామని, మరో 20మందికి రెండు మూడురోజుల్లో పరిహారం అందజేస్తామని ఛైర్మన్ వెల్లడించారు. ఇకపై చిన్నపొరబాట్లు కూడా జరగకుండా చాలా ముందు జాగ్రత్తతో సేవలు అందిస్తున్నామని బిఆర్‌నాయుడు తెలిపారు. ఇకనుండి దేవుడి గురించి,ఇక్కడ జరిగే మంచి కార్యక్రమాలు, నిత్యకైంకర్యాలు గురించి విస్తృత ప్రచారం చేయాలని ఆయన కోరారు.

**సమన్వయలోపం అస్సలు లేదు: ఇఒ శ్యామలరావు**

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పన, మరింతగా మంచి పనులు చేపట్టే విషయంలో టిటిడిలో పాలకమండలిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడం తమ బాధ్యత అని టిటిడి ఇఒ శ్యామలరావు తెలిపారు. ఛైర్మన్,ఇఒ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, సమన్వయలోపం అస్సలు లేదన్నారు. గత ఆరునెలల కాలంలో భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూల నాణ్యత మెరుగుపరచడం జరిగిందన్నారు. దళారీ వ్యవస్థను పూర్తిగా అరికట్టగలిగామన్నారు. విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం మాస్టర్‌ప్లాన్‌ను అమలుచేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన సమయాల్లో వివిధ రంగాలకు చెందిన నిపుణుల నుండి సూచనలు, సహకారం తీసుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా వస్తుందన్నారు. భక్తుల తొక్కిసలాట అంశం న్యాయవిచారణ పరిధిలో ఉందని, న్యాయ విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతాయన్నారు.

**భక్తులకు త్వరితగతిన దర్శనం: అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల సంఖ్య రెట్టింపవుతోందని, భక్తుల రద్దీకి తగ్గట్లు ఎక్కువ సమయం వేచిఉండకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు చూస్తున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. విచక్షణ కోటాను,మానవజోక్యాలను తగ్గించి భక్తులకు త్వరితగతిన దర్శనం చేసేలా సాంకేతికతను వినియోగించుకునేందుకు చూస్తున్నామన్నారు.

వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా అన్ని వర్గాల భక్తులకు భేషుగ్గా ఏర్పాట్లు చేసి సంతోషకరమైన దర్శనాలు చేయించామని వెల్లడించారు. దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్ చేయించి, అర్హులైన దాతలకు సేవలందేలా, మధ్యవర్తులను పూర్తిగా నిషేధించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు మరింత పారదర్శకంగా వసతి గదులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి వాట్సాప్‌కే పూర్తిసమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయని అదనపు ఇఒ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, విఎస్ఒ అల్లంసురేంద్ర పాల్గొన్నారు.

## సంక్షేమ గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల ప్రాథమిక ఎంపిక జాబితా వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణ సంక్షేమ గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల ప్రాథమిక ఎంపిక జాబితాను గురుకుల నియామక బోర్డు ఛైర్మన్ సైదులు తాజాగా వెల్లడించారు. ఈ జాబితాను గురుకుల నియామక బోర్డు వెబ్‌సైట్లో పొందుపరిచామని, అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డైరెక్టుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పోస్టులకు మొత్తం 96 మంది ఎంపికయ్యారని, వారందరికీ ఆయా గురుకుల సొసైటీలు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి.. అనంతరం నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

**తెలంగాణ ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్ష తుది 'కీ'విడుదల**

తెలంగాణ రాష్ట్రస్థాయిలో గత ఏడాది నవంబరు 24న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన తుది 'కీ'ని వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఈ పరీక్ష జరుపుతారు. వచ్చే 2 నెలల్లో జిల్లాలు, సామాజికవర్గాల వారీగా ఎంపికైన వారి జాబితా విడుదల చేయనున్నారు. ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ అందజేస్తారు.

## పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గమైన చర్య: మాజీమంత్రి కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి13:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఖండించారు. కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పూటకో అక్రమ కేసు పెట్టడం.. రోజుకో బీఆర్ఎస్ నేతను అన్యాయంగా అరెస్టు చేయడం రేవంత్ సర్కారుకు ఓ అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనకేసుకొచ్చి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఏకపక్షంగా అరెస్టుచేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతు రుణమాఫీని ఎగ్గొట్టి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకే ముఖ్యమంత్రి ఈ అణచివేత చర్యలకు దిగుతున్నారన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డిపై చర్య తీసుకోవాల్సిందిపోయి ప్రజల పక్షాన ప్రశ్నించిన కౌశిక్ రెడ్డిపై కేసులు పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా ? అంటూ నిలదీశారు. పోరాటాలే ఊపిరిగా పుట్టిన గులాబీ పార్టీ నేతల ఆత్మస్థయిర్యాన్ని ఇలాంటి చిల్లర చేష్టలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ దెబ్బతీయలేదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గ్రీన్ హైడ్రోజన్‌కు నజరానా

### రాయితీలు, ప్రోత్సాహకాలు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** రాష్ట్రం లో గ్రీన్ హైడ్రోజన్, దాని అనుబంధ ఉత్పత్తుల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తెలంగణ సర్కార్ నజరానాలు ప్రకటించింది. ఎలక్ట్రోలైజర్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల ప్లాంట్లను స్థాపించే సంస్థలకు ఎలక్ట్రోలైజర్ స్టాక్ ప్లాంట్, వాటికి సంబంధించి పరికరాలపై 30 శాతం పెట్టుబడి రాయితీని అందించనుంది. ఇందులో భాగంగా ప్రతి మెగావాట్‌కు 1,400 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యానికి కోటి రూపాయల చొప్పున 30 కోట్ల రూపాయల వరకూ గరిష్ట పరిమితికి లోబడ ఒక్కో ప్లాంట్‌కు పెట్టుబడి రాయితీ ఇస్తామని తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విషయమై ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజనిక్ కార్బన్తో సహా) పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది.

ప్లాం ట్, పరికరాల (ఎలక్ట్రోలైజర్తో సహా) పరిశ్రమల స్థాపనకు పెట్టే పెట్టుబడులపై 25 శాతాన్ని రాయితీగా అందించనుంది. కనీసం 500 మెగావాట్ల వార్షిక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థం కలిగిన తొలి 5 ప్లాంట్లకు మాత్రమే ఈ రాయితీని వర్తించనుంది. అంతేకాకుండా రాష్ట్రంలో జరిపే గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల అమ్మకాలపై 100 శాతం ఎస్జీఎస్టీని 5 ఏళ్ల పాటు రీయింబర్స్ చేయనుంది. అదే ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమల శ్ర ఉత్పత్తుల అమ్మకాలపై ఏడేళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ తిరిగి చెల్లింపు చేయాలని నిర్ణయించింది. ఇదే సమయంలో గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు 10 ఏళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు 5 ఏళ్ల పాటు 100 శాతం విద్యుత్ పన్ను మాఫీ చేయనుంది. గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమశ్రలు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ కరెంటుకు 3 రూపాయల చొప్పున 20 ఏళ్ల పాటు బిల్లులను తిరిగి చెల్లిస్తుంది. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌కు ఒక రూపాయి చొప్పున ఈ రాయితీ వర్తిస్తుంది.

అలాగే గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమల ఏర్పాటుకు కొనుగోలు చేసే స్థలాలకు 100 శాతం స్టాంప్ డ్యూటీని చెల్లించాలని ప్రతిపాదించింది.

## 'నామినేటెడ్'కు కసరత్తులు షురూ

### కార్పొరేషన్లకు కేటగిరీలు

**విజయవాడ,జనవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం మూడో విడుత నామినేటెడ్ పోస్టుల భర్తీ చేసేందుకు పూర్వరంగం సిద్ధం చేసింది.ఇందుకు సంబంధించి సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,బిజెపినేత,మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పలు పర్యాయాలు మంతనాలు జరిపారు.సాధ్యమైనంత వరకు వారం,రెండు వారాల గడువుల లోపల ఈ పోస్టులను భర్తీ చేస్తారు.ఈ పర్యాయం ఆయా కార్పొరేషన్ ఛైర్మన్లు,డైరెక్టర్లు పోస్టులను ప్రకటించే అవకాశం ఉంది. సిఎం చంద్రబాబు ఆదేశాలను అనుసరించి ఆయా కార్పొరేషన్ పోస్టుల భర్తీ విధానాన్ని ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించింది. కార్పొరేషన్ ఛైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు/బోర్డులను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. కేటగిరీలుగా వర్గీకరణ చేయడం పట్ల పదవులు పొందిన నేతలు పెదవి విరుస్తున్నారు. యాదవ, పద్మశాలీ కార్పొరేషన్లను, రాజమండ్రి, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లను ఎ కేటగిరిలో చేర్చారు. మిగిలిన కుల కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను బి కేటగిరిలో చేర్చడం పట్ల పలు విమర్శలు వినవస్తున్నాయి. ఆర్‌టిసి జోన్ ఛైర్మన్లను కూడా ఎ కేటగిరి కింద ప్రభుత్వం చేర్చింది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 8ని విడుదల చేసింది. కేటగిరి నామినేటెడ్ ఛైర్మన్‌కు నెలకు రూ.1.25 లక్షలుగా వేతనం నిర్ణయించారు. అలవెన్సులు, సహాయ సిబ్బంది నియామకం, వారి జీతభత్యాలు మొత్తమ్మీద నెలకు రూ.2,77,500 డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. బి కేటగిరి ఛైర్మన్లు, బోర్డు ఛైర్మన్‌లకు నెలకు వేతనంగా రూ.60 వేలుగా నిర్ణయించారు. అలవెన్సులు, సిబ్బంది జీత భత్యాలతో కలిపి మొత్తమ్మీద రూ.1,93,500 నెలకు డ్రా చేసే అవకాశం ఉంది. ఎ కేటగిరిగా పేర్కొన్న విభాగాల్లో డైరెక్టర్‌గా నియమించిన వారికి నెలకు రూ.20 వేలు వేతనంగా పేర్కొంది.

**కేటగిరి ఎ లో కార్పొరేషన్ బోర్డు**

20 సూత్రాల ఆర్థిక పథకం, ఎపిఎస్ఎంఇ, ఎపిఐఐసి, సివిల్ సప్లై కార్పొరేషన్, ఎపి మార్క్‌ఫెడ్, పద్మశాలీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపిస్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, లెదర్ ఇండిస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, సీడ్ ఎపి, శాప్, వక్ఫ్‌బోర్డు, ఎపి ట్రైకార్, ఎపిఎస్ఆర్‌టిసి, ఎపి మారిటైమ్ బోర్డు, ఎపి టిడ్కో, ఎపి హౌసింగ్ బోర్డు, ఎపి యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎపి కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్, ఎపి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపిఐడిసిఎల్, ఎపిఆర్‌డిసి, ఎపి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ మిషన్, అన్నమయ్య, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి), ఎపిఎస్ ఆర్‌టిసి విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప జోన్ రీజిన్ బోర్డు ఛైర్మన్లను ఎ కేటగిరిలో ప్రకటించారు.

# కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంపు

**రూ.3 లక్షల నుండి రూ.5 లక్షల రుణాలు**

**రైతులకు సరిపడా పంటల పెట్టుబడి**

**2025-26 బడ్జెట్‌లో ప్రతిపాదన**

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త :** వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రైతులకు అవసరమైన రుణాల పరిమితిని పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కిసాన్ క్రెడిట్‌కార్డు రుణపరిమితిని 5 లక్షల రూపాయలకు పెంచేందుకు కేంద్రం ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ఈమేరకు ప్రకటన చేయనుంది. ఫిబ్రవరి తొలి వారంలో రైతుల ఖాతాలో పీఎం కిసాన్ సమ్మన్ యోజన నగదు జమ చేయాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం, అంతకన్నా ముందే ఈ రుణ పరిమితి పెంపును అందుబాటులోకి తీసుకురానుంది. కిసాన్ క్రెడిట్ కార్డుపై ఇప్పటి వరకు ఉన్న రుణపరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా ఈ కిసాన్ క్రెడిట్ కార్డు రుణపరిమితి పెంచాలని రైతులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. రైతులకు తక్కువ ధరకు రుణాలు అందించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని వ్యవసాయరంగ నిపుణులు సైతం సూచించారు. ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితిని పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీనిద్వారా వ్యవసాయం చేసే రైతులకే గాక, పశుపోషణ మరియు చేపల పెంచే రైతులకూ ఈ పథకం వర్తించడం ద్వారా చాలా మేలు కలుగుతుంది. కాగా కిసాన్ క్రెడిట్‌కార్డు పథకాన్ని కేంద్రప్రభుత్వం 1998లోనే ప్రారంభించింది. వ్యవసాయం చేసే రైతులకు అతి తక్కువగా 9 శాతం వడ్డీతో స్వల్పకాలిక పంట రుణాలను ఈ క్రెడిట్‌కార్డు ద్వారా అందిస్తోంది. ఇందులో 2శాతం వడ్డీ రాయితీని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. పైగా సకాలంలో రుణాలు చెల్లించే వారికి అదనంగా మరో 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తోంది. అంటే రైతులు చెల్లించాల్సింది కేవలం 4 శాతం వడ్డీ మాత్రమే. 2023 జూన్ నాటికి ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 7.4 కోట్ల మంది యాక్టివ్ క్రెడిట్ కార్డు ఖాతాలు ఉన్నాయి. వీరందరికి 8.9 లక్షల కోట్ల రుణం ప్రభుత్వం అందించింది.

ప్రధానంగా రైతు ఆదాయం, గత రుణ చరిత్ర, వ్యవసాయ భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని రుణం మంజూరు చేస్తారు. ఒకసారి కిసాన్ క్రెడిట్‌కార్డు తీసుకుంటే ఐదుసంవత్సరాల పాటు కాల పరిమితి ఉంటుంది. ఈ ఐదేళ్లలో రూ.5లక్షల రుణం అందిస్తారు. అలాగే ఈ కార్డు కలిగి ఉన్న రైతులకు ప్రభుత్వమే బీమా రక్షణ కల్పిస్తుంది. రైతు మరణిస్తే, కుటుంబానికి రూ.50వేల వరకు ఆర్థికసాయం అందుతుంది.కిసాన్ క్రెడిట్ కార్డుతో పాటు రైతులకు పొదుపు ఖాతా, డెబిట్ కార్డ్, స్మార్ట్ కార్డ్ అందిస్తారు. ఆ ఖాతాలో చేసే పొదుపుపై వడ్డీ వస్తుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి కిసాన్ క్రెడిట్ కార్డుల ప్రాధాన్యత పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం తాజాగా రుణ పరిమితిని పెంచేందుకు సిద్ధమైంది.

# 'మజాకా' టీజర్ రిలీజ్



**పీపుల్స్ స్టార్** సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్. ఈరోజు మజాకా హైలీ ఎంటర్ టైనింగ్ టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు.

సందీప్ కిషన్, రీతు వర్మ ఆర్కె బీచ్‌లో డ్రింక్ చేస్తూ పట్టుబడటంతో టీజర్ ప్రారంభమవుతుంది, ఇది వారి అరెస్టుకు దారితీస్తుంది. వారి మధ్య ఘర్షణ త్వరలో ప్రేమగా మారుతుంది.ఇద్దరూ ప్రేమలో పడతారు. వారి కథతో పాటు, సందీప్ తండ్రి పాత్రలో రావు రమేష్‌కు కూడా ఒక ప్రేమకథ వుంది. ఇది కథనానికి మరింత వినోదాన్ని జోడించింది. తండ్రీకొడుకుల డైనమిక్ ఇందులో మెయిన్ హైలైట్. వారి కెమిస్ట్రీ నవ్వులు పంచింది. మాస్ ఎంటర్‌టైనర్‌లను రూపొందించడంలో త్రినాధరావు నక్కిన మరోసారి తన మార్క్ చూపించారు,. 'తమ్ముళ్లు సీట్లు లేగుస్తాయి' అనే లైన్‌తో దర్శకుడి సిగ్నేచర్ స్టైల్ స్పష్టంగా కనిపిస్తుంది. సందీప్ కిషన్ తన డైనమిక్ క్యారెక్టర్‌లో అదరగొట్టారు, కంప్లీట్ ఎంటర్ టైనింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తండ్రి కొడుకులుగా రావు రమేష్ సందీప్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి అతిపెద్ద ఆకర్షణ.

త్రినాధ రావు నక్కినతో విజయవంతమైన ప్రాజెక్టులలో కొలబారేట్ అయిన రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ, మజాకాకు కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ రాస్తున్నారు. ఈ కాంబోలో ఇది మరో మెమరబుల్ ఎంటర్‌టైనర్ అవుతుందని హామీ ఇస్తుంది. టీజర్ ఇప్పటికే సంచలనం సృష్టించింది, ప్రేక్షకులల్లో క్యురియాసిటీ క్రియేట్ చేసింది. మజాకా ఫిబ్రవరి 21న గ్రాండ్‌గా విడుదల కానుంది.

టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ..అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఇది నా 30వ సినిమా.నా గత సినిమాలు భైరవకోన, రాయన్ మంచి రిజల్ట్స్ ఇచ్చాయి. ఆడియన్స్ నానుంచి మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ని కోరుకుంటున్నారని వారితో మాట్లాడినప్పుడు తెలిసింది. ముప్ఫై సినిమాలు చేయడం అంటే ప్రేక్షకులు ఇచ్చిన వరం. వారు కోరుకున్న సినిమా చేయడం నా బాధ్యత. అలాంటి సమయంలో 'మజాకా' నా దగ్గరకి వచ్చింది. 'మేము వయసుకు వచ్చాం' సినిమా చూసినప్పటినుంచి త్రినాథ్‌గారితో పని చేయాలని వుండేది. ఫైనల్ గా 'మజాకా'తో కుదిరింది. త్రినాథ్ గారు, ప్రసన్న చాలా నిజాయితీగా పని చేస్తారు. లియోన్ జేమ్స్ సూపర్బ్ మ్యూజిక్ ఇచ్చారు. అన్న వెరీ స్వీట్ పర్సన్. రీతూ గారు సూపర్బ్ యాక్టర్. రావు రమేష్ గారు చేసిన ఫాదర్ క్యారెక్టర్ ఇందులో మేజర్ రోల్ ప్లే చేస్తుంది. మా కెమిస్ట్రీ అద్భుతంగా వచ్చింది.ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఖచ్చితంగా పోస్టర్ పై చాలా పెద్ద నెంబర్ కనిపిస్తుంది. అందరికీ థాంక్ యూ అన్నారు.

డైరెక్టర్ త్రినాథ్ నక్కిన మాట్లాడుతూ.. మజాకా నాకు చాలా ఇష్టమైన కథ. సినిమా ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. మన్మధుడు తర్వాత అన్న ఈ సినిమాలో నటించడం ఆనందంగా వుంది. రీతు వర్మ ఎక్సలెంట్ యాక్టర్. సందీప్ గారితో ఎప్పటినుంచో సినిమా చేయాలని వుండేది. ఈ సినిమా తనతో చేయడం చాలా ఆనందంగా వుంది. సందీప్ గారు ఎక్సలెంట్ గా చేశారు. నిజార్ చాలా చక్కని ఫోటోగ్రఫీ ఇచ్చారు. నిర్మాత రాజేష్ గారు చాలా ఓపిగ్గా ఈ సినిమా చేశారు. ఈ సినిమా ఆయనకి పెద్ద విజయం ఇస్తుంది. ఫిబ్రవరి 21న సినిమా మీ ముందుకు వస్తోంది. ఫ్యామిలీతో వెళ్లి ఎంజాయ్ చేయండి అన్నారు.

రైటర్ ప్రసన్న మాట్లాడుతూ.. ఇది తండ్రి కొడుకుల కథ. సందీప్ కిషన్ గారు, రావు రమేష్ గారు కెమిస్ట్రీ అదిరిపోతుంది. రాజా గారు సినిమాని ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. తప్పకుండా ఈ సినిమా ఆయనకి మంచి విజయాన్ని ఇస్తుంది. మా త్రినాథ్ గారితో ఇది నాకు ఐదో సినిమా. మా జర్నీ ఇలాగే కంటిన్యూ అవుతుంది. అన్న ఈ సినిమాతో నాకు దొరికిన మంచి ఫ్యామిలీ ఫ్రెండ్. రీతు గారు చాలా ప్రొఫెషనల్ యాక్టర్. సందీప్ కిషన్ అన్న సినిమా చూపిస్తా మామ సినిమాకి వచ్చిన ఒకే ఒక హీరో అప్పటినుంచి ఆయనతో జర్నీ ఉంది.ధమాకా లాంటి 100 కోట్ల సినిమా మేము చేసిన తర్వాత పర్ఫెక్ట్ టైంలో ఈ సినిమా సందీప్ గారికి ల్యాండ్ అయింది. నాన్ స్టాప్‌గా నవ్వుతూనే ఉంటారు. ఫ్యామిలీ అందరికీ నచ్చే సినిమా ఇది అన్నారు.

యాక్టర్ రావు రమేష్ మాట్లాడుతూ.. ప్రసన్న గారు అద్భుతమైన కథ చేశారు. తండ్రి కొడుకుల కథ. తండ్రి పాత్ర త్రూ అవుట్ వుంటుంది. ఇంత లెంత్ పాత్ర చేయాలంటే ముందు కొడుకు ఒప్పుకోవాలి. సందీప్‌కి అంత బిగ్ హార్ట్ వుంది. డైరెక్టర్ త్రినాథ్ గారికి నిర్మాతలు రాజేష్ గారు, అనిల్ సుంకర గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.మా మధ్య చాలా మంచి సీన్స్ వుంటాయి. సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ...మజాకా కథ వినప్పుడు నాన్ స్టాప్‌గా రెండు గంటలు నవ్వుకుంటూనే వున్నా. ఈ సినిమాకి ఎవరు కావాలో కథే తీసుకొచ్చింది. మన్మధుడు తర్వాత అన్న రీలాంచ్ అవుతున్నారు. చాలా మంచి పేరు వస్తుంది. సందీప్ గారు కథ వినగానే చేసేద్దామని అన్నారు. మంచి యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తీశాం. నా బ్యానర్‌లో ఇప్పటివరకూ తీసిన సినిమాలన్నిటి కంటే బెస్ట్ మూవీ తీశానని గర్వంగా చెప్పుకోవచ్చు. నా బ్యానర్‌కి వందకోట్ల సినిమా ఇస్తున్నారని బలంగా నమ్ముతున్నాను అన్నారు.

# 'నాగబంధం' నుంచి విరాట్ కర్ణ ఫస్ట్ లుక్

**హైలీ యాంటిసిపేటెడ్** పాన్‌ఇండియా మూవీ 'నాగబంధం' నుంచి రుద్రగా యువ హీరో విరాట్ కర్ణ ప్రీలుక్ ఇటీవల విడుదలై మంచి బజ్ క్రియేట్ చేసింది. పాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ గ్రాండ్‌స్కేల్ ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విరాట్ కర్ణ ఫెరోషియస్ రగ్గడ్ అవతార్‌లో సాలిడ్ ఫిజక్‌తో కనిపించారు. యాక్షన్‌ప్యాక్డ్ పోస్టర్‌లో అతని సిక్స్‌ప్యాక్ అబ్స్ ప్రజెంట్ చేస్తోంది. కర్ణను స్టన్నింగ్ అవతార్‌లో, సముద్రంలో భయంకరమైన మొసలితో పోరాడుతున్నట్లు చూపిస్తున్న ఫస్ట్ లుక్ అదిరిపోయింది. తన ఒట్టి చేతులు, తాడుతో మొసలి నోరు తెరిచి పట్టుకున్న రుద్ర డేరింగ్ నేచర్ ఆకట్టుకుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా క్యురియాసిటీని క్రియేట్ చేసింది. 'ది సీక్రెట్ ట్రెజర్' అనే ట్యాగ్‌లైన్‌తో 'నాగబంధం' ఒక ఎపిక్ అడ్వంచర్‌గా రూపుదిద్దుకుంటోంది. అభిషేక్ నామా కథ స్క్రీన్‌ప్లే రెండింటికీ తనదైన విజన్ తీసుకువస్తున్నారు.

అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి వి.రీ స్టూడియోస్ ఆధ్వర్యంలో కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు.నాగబంధం పాన్‌ఇండియన్ ఎపిక్,ఆధ్యాత్మికతను ఉత్కంఠభరితమైన సాహసయాత్రతో మిళితం చేస్తుంది. ఇందులో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్స్, జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ,



బి.ఎస్. అవినాష్ కీలక పాత్రల్లో నటించారు. నాగబంధం..పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుండి ప్రేరణపొంది, ఆధ్యాత్మిక సాహసోపేత మైన ఇతివృత్తాలతో వుంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవా లయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు.

# 'పెద్ద' ఫస్ట్ లుక్ లాంచ్



**వైభవ్, సునీల్** లీడ్ రోల్స్ లో ఇళంగో రామ్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ కామెడీ ఎంటర్ టైనర్ రూపొందుతోంది. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్, బవేజ స్టూడియోస్ సమర్పణలో ఎస్ కార్తికేయన్, హర్మాన్ బవేజ, పి. హిరణ్య నిర్మిస్తున్నారు. శశి నాగ్ సహ నిర్మాత. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ని స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ లాంచ్ చేశారు. ఈ చిత్రానికి 'పెద్ద' అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు.

"ఫన్ ఫ్యామిలీ ఫ్యూనరల్" అనే ట్యాగ్ తో ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మరణించిన కుటుంబ పెద్ద చూట్టూ గుమిగూడిన కుటుంబం, వారి డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి.

ఈ చిత్రంలో రెడిన్ కింగ్స్లి, దీపా శంకర్, బాల శరవన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అరుణ్ రాజ్ మ్యూజిక్ అందిస్తున్నారు. సత్య తిలకం డీవోపీ, సూర్య కుమారగురు ఎడిటర్.

నటీనటులు: వైభవ్, సునీల్, రెడిన్ కింగ్స్లి, దీపా శంకర్, బాల శరవన్



## 'అఖండ 2: తాండవం' మహా కుంభమేళాలో షూటింగ్ ప్రారంభం

**గాడ్ ఆఫ్ మాసెస్** నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ ఖిఅఖండ 2: తాండవంఖి కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఇది వారి మునుపటి స్మాష్ హిట్ ఖిఅఖండఖి కు ఇది సీక్వెల్, మరింత హై ఆక్టేన్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామాను ప్రామిస్ చేస్తోంది. ఎం తేజస్విని నందమూరి సమర్పణలో ప్రతిష్టాత్మక 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అఖండ 2' న్యూ షూటింగ్ షెడ్యూల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ఈరోజు ప్రారంభమైయింది. మూవీ యూనిట్ చాలా కీలకమైన సన్నివేశాలని మహా కుంభమేళాలో చిత్రీకరిస్తోంది. ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు వున్నాయి. అంచనాలకు తగ్గట్టుగానే డైరెక్టర్ బోయపాటి శ్రీను అఖండ-2ను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.

ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు, సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్, ఎడిటర్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్‌తో సహా అత్యున్నత సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. సెప్టెంబర్ 25, 2025న దసరా కానుకగా సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.




# రాష్ట్రాలు దాటిన 'బేబి' వైష్ణవి చైతన్య క్రేజ్



**తెలుగు చిత్ర పరిశ్రమలో** తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావడమన్నది మిరాకిల్ అన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయి. అందం, అభినయం ఉన్నప్పటికీ తెలుగు భామలను దర్శక నిర్మాతలు ఎందుకో పట్టించుకోవడం లేదు. కానీ కొందరు తెలుగు అమ్మాయిలు మాత్రం ఇలాంటి వాటికి అతీత మని నిరూపిస్తున్నారు. టాలెంట్ ఉంటే ఎప్పటికైనా అవకాశాలు అవే వెతుక్కుంటూ వస్తాయని ప్రూవ్ చేస్తున్నారు. ఇలాంటి వారిలో వైష్ణవి చైతన్య ఒకరు.

షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ మొదలుపెట్టిన వైష్ణవి చైతన్యకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. లవ్ ఇన్ 143 అవర్స్, ది సాఫ్ట్‌వేర్ డెవలపర్, అరెరె మానస, మిస్సమ్మ వంటి షార్ట్ ఫిల్మ్స్ వైష్ణవి చైతన్యకు పాపులారిటీ తెచ్చిపెట్టాయి. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుని చిన్న పాత్రయినా సరే ఒప్పుకుని తన ముద్ర వేసింది.

ఈ దశలో సాయిరాజేష్ దర్శకత్వంలో వచ్చిన 'బేబీ' చిత్రం వైష్ణవి కెరీర్‌ను మలుపు తిప్పింది. ఏమాత్రం అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్ల వరకు వసూళ్లను సాధించి చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. బేబీ విజయంలో వైష్ణవిదే కీలకపాత్ర.. అందుకే ఆమెకు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు దక్కింది. నాటి నుంచి వైష్ణవికి అవకాశాలు క్యూకట్టాయి. అలా అని ఆమె వచ్చిన ప్రతి ఆఫర్‌ని ఒకే చేయడం లేదు. సెలక్టివ్‌గా సినిమాలు చేస్తుంది.కథాబలం, కథను ముందుకు నడిపించే పాత్రలనే ఆమె ఎంపిక చేరుకుంటుంది. ప్రస్తుతం ఆమె 'జాక్' సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో ఆమె ముస్లిం అమ్మాయిగా కనిపించబోతుంది అని మేకర్స్ ఒక పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమాలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉండబోతుంది.'బేబి' తో వైష్ణవి, 'టిల్లు స్క్వేర్' తో సిద్ధు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరి సూపర్ ఫామ్లో ఉన్నారు. అందువల్ల 'జాక్' పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.మరోపక్క తెలుగుతో పాటు తమిళం, కన్నడ ఇండస్ట్రీలు కూడా ఆమెకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రెండు తమిళ, కన్నడ సినిమాలకు వైష్ణవి సైన్ చేశారట. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈముద్దుగుమ్మ.. తనకు సంబం ధించిన ప్రతి చిన్న అంశాన్ని అభిమానులతో పంచుకుంటారు. తాజాగా లంగా ఓణీలో పదహారణాల తెలుగు అమ్మాయిలా వైష్ణవి చేసిన ఫోటో షూట్ ఇన్‌స్టాలో వైరల్ అవుతోంది.

## విడుదలకు సిద్ధమైన 'ఎమర్జెన్సీ'

**బాలీవుడ్ ఫైర్ బ్రాండ్** 'కంగనా రనౌత్' స్వీయ దర్శకత్వంలో 'ఎమర్జెన్సీ' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, వివాదాల్లో చిక్కుకున్న ఈ చిత్రం ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది.ఈ క్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఈ మూవీ ప్రీమియర్‌ను సినిమా టీమ్ నాగ్‌పూర్‌లో ప్రదర్శించింది. కంగనా, అనుపమ్ ఖేర్‌కు ఈ సందర్భంగా గడ్కరీ కృతజ్ఞతలు తెలుపుతూ.. దేశ చరిత్రలోని ఓ చీకటి అధ్యాయాన్ని చక్కగా తెరకెక్కించారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూడాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరడం విశేషం.

కాగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ ఇతివృత్తం ఆధారంగా ఈ మూవీని తీసుకువస్తున్నారు. ఇందిర పాత్రలో కంగనా కనిపించబోతుంది. అలాగే, మరో కీలక పాత్రలో అనుపమ్ ఖేర్ నటిస్తున్నారు. అన్నట్టు బిజెపి నుంచి కంగనా బిజెపి ఎంపీగా గెలిచింది. ఈ క్రమంలో ఆమె ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ ఇతివృత్తం ఆధారంగా సినిమా చేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒకవేళ సినిమాలో ఇందిరా గాంధీని అవమానించే విధంగా సన్నివేశాలు ఉంటే తగిన బుద్ధి చెబుతాం అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోస్టులు పెడుతున్నారు.



# 'గేమ్ చేంజర్' సినిమాపై కుట్ర



**కోట్లకు కోట్ల రూపాయల** ఖర్చుచేసి గ్లోబల్ రేంజ్‌లో ఇమేజ్ ఉన్న ఒక స్టార్ హీరో మూడేళ్లకు పైగా కష్టపడి చేసిన సినిమా విడుదల రోజు నెట్టింట లీక్ అయితే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంక్రాంతికి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మించిన ఖిగేమ్ చేంజర్ విడుదల రోజే ఆన్‌లైన్‌లో పైరసీప్రింట్ లీక్ అయ్యింది. దీని వెనుక సుమారు 45 మందితో కూడిన ఒక ముఠా ఉంది. 'గేమ్ చేంజర్' విడుదల ముందు నిర్మాతలతో పాటు చిత్ర బృందంలోని కీలక వ్యక్తులు కొందరికి సోషల్ మీడియా, అలాగే వాట్సాప్‌లలో కొంత మంది నుంచి బెదింపులు వచ్చాయి. తాము అడిగిన అమోంట్ ఇవ్వకపోతే సినిమా పైరసీ ప్రింట్ లీక్ చేస్తామని గొడవకు దిగారు. 'గేమ్ చేంజర్' విడుదలకు రెండు రోజుల ముందు సినిమాలో కీలక ట్విస్టులను సోషల్ మీడియా అకౌంట్‌లలో షేర్ చేశారు. ఇక విడుదలైన తర్వాత హెచ్‌డి ప్రింట్ లీక్ చేయడమే కాదు... టెలిగ్రామ్, సోషల్ మీడియాలో ఆడియన్స్ అందరికీ షేర్ చేశారు. 'గేమ్ చేంజర్' చిత్ర బృందాన్ని బెదిరించిన, పైరసీ ప్రింట్ లీక్ చేసిన 45 మంది మీద ఆధారాలతో సహా సైబర్ క్రైమ్‌లో కంప్లైంట్ చేసింది టీం. ఆ 45 మంది కలిసి ఓ ముఠాగా ఏర్పడి 'గేమ్ చేంజర్' మీద నెగెటివిటీ స్ప్రెడ్ చేశారా? పైరసీ ప్రింట్ లీక్ చేశారా? లేదంటే వాళ్ల వెనుక ఎవరైనా ఉన్నారా? అనేది తెలియాల్సి ఉంది. ఈ కేసును టేకప్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. దర్యాప్తు తర్వాత నిజానిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది. సోషల్ మీడియా (ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్) పేజీలలో ఒక పథకం ప్రకారం 'గేమ్ చేంజర్' మీద పలువురు నెగెటివిటీ స్ప్రెడ్ చేశారు. సినిమా క్లిప్స్ షేర్ చేయడంతో పాటు కీలకమైన ట్విస్టులు రివీల్ అయ్యేలా చేసి ఆడియన్స్ సినిమాను ఎంజాయ్ చేయకుండా చేశారు. సదరు పేజీల మీద కూడా కంప్లైంట్స్ నమోదుచేశారు. త్వరలో ఆ సోషల్ మీడియా పేజీలమీదకూడా చర్యలు తీసుకోనున్నట్లు తెలియచేశారు. ర

## సంక్రాంతి శోభ



భోగి వచ్చింది
భోగభాగ్యాలు తెచ్చింది
సంక్రాంతి వచ్చింది
సంబరాలు తెచ్చింది
కనుమ వచ్చింది
పాడి పంటలు తెచ్చింది
బసవన్న విన్యాసాలతో..
హరిదాసుల కీర్తనలతో..
కోడిపందాల ఉత్సాహంతో..
పతంగుల కేరింతలతో..
జంగమదేవరుల శంఖారావాలతో..
బుడబుక్కలవారి వింత
నాదాలతో..
మకర సంక్రాంతి వచ్చింది
తరతరాల సంస్కృతితో!
కొత్త అల్లుళ్ల కోరికలు
ఆడబిడ్డల అలకలు
కన్నెపడుచుల గొబ్బిపాటలు
ముంగిట గొబ్బెమ్మలు,
రంగవల్లులు, భోగి మంటలు
మూడు రోజుల పండుగ
ముచ్చటైన పండుగ!

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

# సంబరాల సంక్రాంతి



**మన భారతదేశం సంస్కృతి. సంప్రదాయాల సమ్మేళనం. సంప్రదాయాలు, ఆచారాలు. పండుగల సమ్మేళనాలతో భారతదేశ కీర్తి చాలా గొప్ప స్థానాన్ని సంపాదించింది. పండుగలు అంటేనే భారతదేశానికి పెట్టింది పేరు. ప్రతినెలా ఏదో ఒక సరికొత్త పండుగ వాతావరణంతో మన తెలుగు లోగిళ్ళన్నీ నిత్యం 'నిత్య కళ్యాణం పచ్చ తోరణం'ఈ అన్న చందాన కళకళలాడుతుంటాయి.**

ఈ పండుగలు అంటే మన ఆడపడుచుల ఆనందానికి పట్టపగలు ఉండవు. ప్రతి తెలుగు ఇంటి ఆడపడుచు మోములో అమ్మవారి కళ ఉట్టి పడుతుంది. ఈ ఆనందాతిరేకల్లోనే ఈ పండుగ ఉవ్వెత్తున ఎగసిపడుతుంది. ఇంతటి ఆనందాన్ని ఇచ్చే గొప్ప పెద్ద పండుగ సంక్రాంతి. సరదాల సంక్రాంతి వచ్చేసింది, సిరులు ఎన్నో తెచ్చింది అంటూ భోగభాగ్యాలను ఆహ్వానిస్తూ ఈ పండుగనాడు తెలుగు లోగిళ్ళలో ఉట్టిపడే కళే వేరు. అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు ధన ధాన్యాలు, పడుచుల ఆటపాటలు పండుగకి ఎంతో హుషారుని తెస్తాయి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడంతో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలయ్యే సమయమిదే. సంక్రాంతి పండుగ విశిష్టతే వేరు. భోగితో ప్రారంభమై కనుమతో ముగిసే ఈ పండుగలో ప్రతిరోజు ప్రత్యేకమే. సంక్రాంతి వచ్చిందంటే చాలు గ్రామాలన్నీ శోభతో కళకళలాడుతుంటాయి. పిల్లల కేరింతలు, ఆటపాటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, బసవన్నలు, హరిదాసుల కీర్తనలతో ఇల్లు వాకిళ్ల ఒక్కటేమిటి ఎటు చూసినా అంతా సందడే. కోడిపందాలు, ఎడ్ల పందాలతో ఊరు వాడ అంతా హోరెత్తిపోతుంది. ఇలా ఎన్నో విశిష్టతలు కలిగిన అందమైన పండగ మన సంక్రాంతి. రోజులో బ్రహ్మ ముహూర్తం తెల్లవారే సమయంలో ఎలా ఉంటుందో ధనుర్మాస కాలం కూడా సత్వ గుణాన్ని పెంచేదిలా ఉంటుంది. ఈ కాలంలో చేసే చక్కని ఆచరణ ఏడాది కాలం పాటు మనల్ని మంచి మార్గంలో నడిచేటట్లు చేస్తుంది. మంచి మార్గంలో పయనించడమే ఈ పండుగల యొక్క అసలు పరమార్థం. అలాగే 'సం' అంటే మంచిగా 'క్రాంతి' అంటే అడుగు పెట్టడం అని అర్థం. ఇలా అందరూ మంచిగా జీవించేందుకు తీసుకున్న గొప్ప నిర్ణయం కాబట్టి సంక్రాంతి అయ్యింది. అందుకే ఓ సినీ మహాకవి గారు అన్నారు "సంక్రాంతి వచ్చిందే తుమ్మెద సరదాలు తెచ్చిందే తుమ్మెద/ కొత్త ధాన్యాలతో కోడి పందాలతో/ ఊరే ఉప్పొంగుతుంటే/ ఇంటింటా పేరంటం, ఊరంతా ఉల్లాసమంటూ"/ పండుగ వాతావరణం నింపారు. సంక్రాంతి పండుగని మనం మూడు రోజులు అంగరంగ వైభవంగా జరుపుకుంటాం. మొదటి రోజు భోగి పండుగ, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవరోజు కనుమ పండుగ. మొదటిరోజు వచ్చే భోగి భోగభాగ్యాలతో తులతూగుతుంది. ఈరోజున బాగా గుర్తుండేవి భోగి పళ్ళు, భోగి మంటలు. తెల్లవారుజామునే లేచి కాల కృత్యాలు తీర్చుకుని ప్రతి ఇంటి ముంగిట భోగి మంటలు వేస్తారు. ఈ మంటల్లో ధనుర్మాసం నెల రోజులు పెట్టిన గబ్బెమ్మలను ఎండబెడితే వచ్చిన పిడకలను దండలుగా గుచ్చి భోగిమంటల్లో వేస్తారు. ఈ పిడకలతో పాటు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తని, పనికిరాని చెట్టు కొమ్మల్ని, దుంగల్ని, మన ఇంట్లో పనికిరాని చెత్తని ఈ మంటల్లో వేస్తారు. పాతకు స్వస్తి చెబుతూ కొత్తకు స్వాగతం పలుకుతారు. ఆపై తల స్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఈ రోజున కొత్త బియ్యం, పెసరపప్పు, బెల్లం కలిపి పాయసం లేదా కిచిడి చేసి భోగి పురుషునికి నివేదన చేస్తారు. అలాగే ముందుగా చేసిన అరిసెలు పిండివంటలు నివేదన చేస్తారు. సాయంత్రం బొమ్మల కొలువు పెట్టి చిన్నారులకు భోగి పళ్ళు పోస్తారు. అక్షింతలు, చిల్లర పైసలు, పూలరేకులు కలిపి చిన్నారుల చుట్టూ మూడుసార్లు తిప్పి తల మీద పోస్తారు. ఇలా పోయడం వల్ల పిల్లల్లో ఉండే దోషాలు, దిష్టి తొలగిపోతాయి. ముత్తైదువులకు శనగలు, తాంబూలం, పళ్ళు వాయినంగా ఇస్తారు. ఇంకా ఇంటి ముంగిట భోగి కుండలు ముగ్గు వేస్తారు. ఈ ముగ్గులు వేయడంలో విజ్ఞానం, ఆరోగ్యాలు, ఖగోళ శాస్త్ర విజ్ఞానం దాగి ఉన్నాయి. ఇలా నెల రోజులపాటు పేడ నీళ్లతో కళ్ళాపి చల్లి బియ్యం పిండితో ముగ్గు వేస్తే క్రిమికీటకాలు మన ఇళ్ళల్లోకి రావు. ఇలా ముగ్గు వేయడంలో అనేక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. రెండవ రోజు వచ్చే పెద్ద పండుగ మకర సంక్రాంతి. ఈరోజు అందమైన వైకుంఠ వాకిళ్ళ ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసుల పాటలకు, బసవన్నల ఆటలకు, మిఠాయిలకు, గాలిపటాలకు పెట్టింది పేరు. ఈ మకర సంక్రాంతిని పంటల కోతల లేదా పంటల మార్పిడిల పండుగగా పిలుస్తారు. ఎందుకంటే ఈ సమయానికల్లా పంట మార్పిడిలు అయిపోయి రైతన్నలు పెద్ద ఉత్సవాలలాగా జరుపుకుంటారు. ఈరోజు పంటల్లో సహాయపడిన వారికి కృతజ్ఞతలు తెలుపుతారు. ఈరోజు కుటుంబ సభ్యులు, బంధువులు అంతా కలిసిమెలిసి జరుపుకుంటారు. ఈ రోజు అన్నదాతల కష్టాలకు ఫలితం దక్కింది. ఈ మకర సంక్రాంతి రోజున కొత్త బియ్యంతో చేసిన పాయసం పిండి వంటలు దేవతలకు సమర్పించడం, పితృదేవతలను పూజించడం, వారికి పట్టు వస్త్రాలు పెట్టడం లాంటివి చేస్తూ సంప్రదాయాల్ని పాటిస్తారు. అందుకే దీనిని పెద్దల పండుగ అని కూడా అంటారు. మకర సంక్రాంతి రోజున హరిదాసులు "హరిలోరంగ హరి" అంటు కీర్తనలు పాడుకుంటూ వచ్చి మన ఇచ్చే కాను కలు స్వీకరించి దీవిస్తారు. ఆ దీవెనలే మనకు కొండంత బలం. ఇహ మూడవ రోజు వచ్చే పండుగ కనుమ. ఇది పశువుల పండుగ. పశువులను అదృష్టానికి, శ్రేయస్సుకు చిహ్నంగా భావించే రైతులకు ఇది ప్రత్యేకమైన పండుగ. ఈ రోజున రైతులందరూ పశువులు, పశువుల కొట్టాలు, ఆవులు, ఎద్దులను రంగులు మరియు బంతిపూలతో అలంకరిస్తారు. ఈ కనుమ అనేది ఆవులు, వ్యవసాయ జంతువులు, వ్యవసాయ పరికరాలను పూజించే పండుగ. ఇది ఉత్తరాయణ దశ. సూర్యుడు తన స్థానాన్ని దక్షిణం నుండి ఉత్తర గోళానికి మార్చినప్పుడు పురాణ కాలం ప్రకారం ఈ రోజున గ్రామాల్లో భారీగా వరదలు వచ్చినప్పుడు తనను రక్షి ంచడానికి వచ్చిన గోకుల స్థానిక ప్రజలను కృష్ణుడు రక్షించాడు. వానల దేవత ఇంద్రుడు కోపంతో గ్రామాన్ని ముంచెత్తాడని పెద్దలు చెబుతారు. శ్రీకృష్ణుడు తన చిటికెన వేలుతో గోవర్ధనగిరిని ఎత్తుకొని ఆపదలో ఉన్న గ్రామస్తులు అందరికీ ఆశ్రయము ఇచ్చాడు. ఇది చూసిన ఇంద్రుడు తన తప్పును గ్రహించి గోకులం నుండి భారీ వర్షాలను ఉపసంహరించుకున్నాడు. ఈ రోజున పశువులను పూజించడానికి గోవర్ధన పూజ నిర్వహిస్తారు. ఈరోజు ఎద్దుల పోటీలు నిర్వహించి రైతన్నలకు మంచి కానుకలు ఇస్తారు. ఇంకా కోడి పందాలు కూడా జరుపుకుంటారు. పిండివంటలు చేసి అల్లుళ్లకు విందు ఏర్పాటు చేస్తారు. నాలుగవ రోజు ముక్కనుమను జరుపుకుం టారు. ఈ రోజున బంధువులు స్నేహితులను సందర్శించి సరదాగా గడుపుతారు. ఇలా సంక్రాంతి పండుగని ఊరువాడ అందరూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని కోరుకుంటూ ఫ్రెండ్స్ అందరికీ సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు జేజేలు, వందనాలు.



- పింగళి భాగ్యలక్ష్మి

చిన్నాపెద్ద కుచ్చులతో నిండిన రంగుల్లో జరీ అంచు మెరుపులతో కళ్లను కట్టిపడేసే పరికిణీ... బారసాల వేడుకైనా సంక్రాంతి పండుగొచ్చినా ఏంచుకునే అందమైన సంప్రద వస్త్రధారణ... దక్షిణాదిన పుట్టిన ఏ అమ్మాయికైనా ఓ మధుర జ్ఞాపకం!

# పట్టుందాలు పండుగ హేళ !



పూర్వం సంపన్నులకీ రాజకుటుంబీకులకీ మాత్రమే సొంతమైన పట్టు పరికిణీ క్రమేణా సామాన్యులకీ వచ్చింది. అప్పట్లో కంచిపట్టు వాడకమే ఎక్కువ. ఇప్పుడైతే ఆరణి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ, నారాయణపేట, టిష్యూ, చందేరి, పైతానీ, గద్వాల... ఇలా అన్నింట్లోనూ పరికిణీకోసం నేస్తున్నారు. వీటికి ఇమిటేషన్లూ వస్తున్నాయి. దాంతో పేదాగొప్పా. తమ స్థాయికి తగ్గ పట్టు పరికిణీలతో పాపాయిల్ని ముద్దుగా రెడీ చేస్తున్నారు. ఏమయినా పరికిణీ కట్టిన అమ్మాయి అందమే వేరు. అందుకే ఫ్యాన్సీ డ్రెస్సులెన్ని వచ్చినా పట్టుపరికిణీ మరిన్ని కుచ్చులతో ఇంకాస్త అందంగా విచ్చుకుంటోంది. వివిధ ఎంబ్రాయిడరీలతో డిఫినిషన్ హోదాని సంతరించుకుంది, కుచ్చుల్లోనూ దానిమీద వేసుకునే బ్లౌజుల్లోనూ వైవిధ్యమైన డిజైన్లతో అమ్మాయి మనసు దోచుకుం టుంది. ఇందుకు కాదూ, పట్టు పరికిణీ అమ్మాయి జీవితంలో అందమైనది జ్ఞాపకంగా నిలిచిపోయేది! ◻

## చిరు ధాన్యాల లడ్డు



**కావాల్సినవి..** కొర్రలు, రాగులు, సజ్జలు, అరికలు, సామలు, పెసరపప్పు, బార్లీ ఒక్కో కప్పు చొప్పున తీసుకోవాలి. తురిమిన బెల్లం ఆరు కప్పులు యాలకుల పొడి కొద్దిగా నెయ్యి వేయించడానికి సరిపడాజీడిపప్పు పావుకప్పు

**తయారీ:** ముందుగా స్టౌపై ప్యాన్ పెట్టి.. అందులో నెయ్యి వేడి చేసి జీడిపప్పును దొరగా వేయించుకోవాలి. ఇప్పుడు ప్యాన్ లో కొర్రలు, రాగులు, సజ్జలు, అరికలు, సామలు, పెసర పప్పు, బార్లీలను ఒక దాని తర్వాత మరొకటి విడివిడిగా వేయించు కొని చల్లార్చుకోవాలి. ఆపై వీటిని కలిపి మిక్సీలో మెత్తటి పొడిలా మిక్సీ పట్టుకోవాలి. ఆపై మళ్లీ తురిమిన బెల్లం కూడా వేసి మళ్లీ గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక వెడల్పాటి గిన్నెలోకి తీసుకుంటే.. ఇందులో వేయించిన జీడిపప్పు, కరిగించిన నెయ్యి, యాలకుల పొడి వేసి కలుపుకోవాలి. అరచేతు లకు నెయ్యి రాసుకుంటూ ఈ మిశ్రమాన్ని లడ్డూల మాదిరిగా చుట్టుకోవాలి. ఇలా తయారైన లడ్డూలను గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేస్తే 23 వారాల పాటు చేసుకుంటే నిల్వ ఉంటాయి.

## మొక్కజొన్న గారెలు




**కావాల్సినవి:** ఆరోగ్యమస్తు అనుబంధయూత్ కార్నర్ రిపురామొక్క జొన్న గింజలు ఒకటిం పావు కప్పు.. శెనగపప్పు అరకప్పు (గంట పాటు నీళ్లలో నానబెట్టాలి).. ఉల్లిపాయ ఒకటి (సన్నగా తరిగి పెట్టుకోవాలి).. పచ్చిమిర్చి రెండు (సన్నగా తరిగి పెట్టుకోవాలి)నిజూ ఇయర్, నిజూ హోమ్అల్లం చిన్న ముక్కజీలకర్ర అరటీస్పూన్.. తరిగిన కొత్తిమీర కొద్దిగాశోక ఉప్పు రుచికి సరిపోతుంది నూనె డీప్ ఫ్రైకి సరిపడ.

**తయారీ :** ముందుగా మిక్సీ జార్‌లో కప్పు మొక్కజొన్న గింజలు, నానబెట్టిన శెనగపప్పు, పచ్చిమిర్చి, అల్లం.. వేసి బరకగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నె లోకి తీసుకొని, మిగిలిన పావు కప్పు మొక్క జొన్న గింజలు, ఉల్లి పాయ ముక్కలు, జీలకర్ర, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కలుపుకోవాలి. ఇప్పుడు అరచేతులకు కాస్త నూనె రాసుకొని, ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకొని మునివేళ్లతో కాస్త మందపాటి వడల మాదిరిగా ఒత్తుకోవాలి. ఇప్పుడు బాండీలో నూనె వేడి చేసుకొని వీటిని వేసి డీప్ ఫ్రై చేసుకోవాలి. అంతే.. ఎంతో టేస్టీగా ఉంటే మొక్కజొన్న గారెలు రడీ!

## చెరకు మురుకులు

**కావాల్సినవి:** చెరకు రసం అర కప్పు బియ్యప్పిండి కప్పువెన్న రెండు టేబు ల్స్పూన్లు (కరిగించుకోవాలి).. నువ్వులు టీస్పూన్ఉప్పు టీస్పూన్ డీప్ ఫ్రైకి నూనె సరిపడ

**తయారీ** ఒక గిన్నెలో బియ్యప్పిండి, వెన్న, నువ్వులు, ఉప్పు వేసి కలుపుకోవాలి. ఆపై ఇందులో చెరకు రసాన్ని కొద్దికొద్దిగా పోసుకుంటూ, చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌ పై బాండీ పెట్టి అందులో డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసి వేడి చేసుకోవాలి. ఇందాక తయారుచేసుకున్న పిండి మిశ్రమాన్ని మురుకుల ప్రెస్సర్ వేసుకొని నూనెలో ఒత్తుకోవాలి. వీటిని డీప్ ఫ్రై చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉంటే చెరకు మురుకులు రడీ అయినట్లే! ◻



# సరదాగా.. సంతోషంగా !

**సంక్రాంతి పండుగను ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా పిలుస్తారు. ఒక్కో సంప్రదాయాన్ని అనుసరిస్తారు. ముఖ్యంగా పంజాబ్, చండీగఢ్, హరియాణాల్లో మన భోగి రోజుని లోరీగా జరుపుకొంటారు. పంట దిగుబడిని చూసిన సంతోషంలో రైతన్నలు సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెబుతూ చేసుకునే పండుగ ఇది.** ఈ రోజు కొత్తదుస్తులు ధరిస్తారు. పిండి వంటలు వండు కుని తింటారు. అంతేనా, చలిమంట వేసి దాని చుట్టూ, మహిళలు, పిల్లలూ జానపద పాటల్ని పాడుతూ, నృత్యం చేస్తూ సంతోషంగా గడుపుతారు. ఈ పాటలన్నీ పంజాబ్ విప్లవకారుడు దుల్లాభట్టిని కీర్తిస్తూ, స్త్రీ శక్తి స్వాతంత్ర్యం, లింగ సమానత్వాన్ని ప్రస్తావిస్తూ సాగేవే అయితే, మధ్యలో కొన్నాళ్లు పురుషాధిక్యత ప్రభావంతో లోరీని మగపిల్లల మొదటి పుట్టినరోజుగా జరుపుకోవడం ఆరంభించారు. లింగనిష్పత్తిలో వ్యత్యాసాలు, బాలికల ప్రాముఖ్యతను గుర్తించేలా చేయడంతో.. పండుగ అసలు ఉద్దేశాన్ని గుర్తించేందుకు, దాని ప్రాధాన్యం తిరిగి సాధించుకునేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వాలూ అమ్మాయిల పుట్టుకను సంబరంగా చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దీంతో లోరీ పండుగలో భాగంగా తమ ఇంటి ఆడబిడ్డ తొలిపుట్టినరోజు నిర్వహించ డానికి అక్కడి తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. బంధుమిత్రులకు ఆహ్వాన పత్రికలను పంచుతున్నారు. ఈ మార్పు 'ప్రతి ఆడపిల్ల పుట్టుక ఒక పండుగ కావాలనీ, ఇది సమాజ పునరుజ్జీవానికి దారి తీయాలనీ' ఆశిద్దాం. ◻



## పదును పెట్టి.. తరిగేయొచ్చు !



**కూరగాయలు తరిగేందుకు ఒకప్పుడు కత్తిపీటలుండేవి.** ఇప్పుడు మాడ్యులర్ కిచెన్ల పుణ్యమా అని వాకులకూ, కటింగ్ బోర్డులకూ ప్రాధాన్యత పెరిగింది. అలాగని ఏదో ఒకటి వాడేద్దామని సరి పెట్టేసుకోలేం. ఇవి అనుకూలంగా ఉండాలి. పనీ త్వరగా పూర్తివ్వాలి. అలా ఆలోచించే వారికోసమే వచ్చింది ఈ మల్టీ ఫంక్షనల్ డబుల్ సైడెడ్ కటింగ్ బోర్డు. దీనికే హ్యాండిల్ దగ్గర చాకుకి పదును పెట్టుకునే అవకాశం, వెల్లుల్లి వంటివాటిని నూరుకునే అవకాశం ఉంది. శుభ్రం చేయడమూ సులువే. ◻

# సంప్రదాయ నోము



**ముత్తయిదువులు ఏటా ఏదో ఒక నోము నోచుకోవడం తెలుసు.** చిన్నపిల్లలూ నోము చేసుకునే సంప్రదాయం తెలంగాణాలో కనిపిస్తుంది. ఇది చోటు చేసుకునేదీ సంక్రాంతి సమయంలోనే ఇక్కడ అయిదేళ్ల వరకూ అందరిలాగే చిన్నారులకు భోగిపండ్లు పోస్తారు. తరువాత మిగిలిన చోట్ల ఓణీల వేడుకను ఇక్కడ గురుగుల నోము చేస్తారు. దీన్ని సాధారణంగా అమ్మాయిలకు 9, 11, 13 ఏళ్లలో ప్రారంభిస్తారు. 13 దొంతులు పెట్టి, 13వస్తువులతో నోము నోయిస్తారు. ఒక్కసారి ప్రారంభమైతే ఏటా చేసుకోవాల్సిందే. ఏటా ఒక్కోరకం నోము నోచుకుంటారు. పెళ్లయ్యాక 'పెళ్లి నోము'లు మొదలవుతాయి. వధూవరులిద్దరి తరపు బంధువులూ ఒక్కచోట కలుసు కుంటారు. వదువుచేత నోము నోయిస్తారు. ఊళ్ళో వాళ్లందరినీ బంధుత్వపు వరస కలిపి నోరారా పలకరిస్తారు. 'సందె దీపాలనోము నోచుకున్న మహిళలు సంధ్య వేళ ఇళ్లకు వెళ్లి స్వయంగా ఆ ఇళ్లలో దీపం పెడతారు. ఇంట్లో దీపం పెట్టిన ఆడపిల్ల పట్ల ఆ ఇంటివారికి బాధ్యతతో కూడిన బంధం ఏర్పడుతుంది. ఏ నోము నోచుకున్నా ఇంటింటికీ వెళ్లి నోచుకున్న వస్తువులను పంచుతారు. ఆడపిల్లల చేత నోములన్నీ చేయించే బాధ్యత పుట్టింటివారిదే. ఏటా ఆడపిల్ల పుట్టింటికి రావాలి, వాళ్లకి ఎల్లవేళలా మాతోడు అని చెప్ప డమే దీని ఉద్దేశం. ఇంకా పెళ్లి చేసి పంపించ డంతో అమ్మాయి పట్ల తల్లిదండ్రుల బాధ్యత తీరిపోలేదనీ, అమ్మానాన్నలతో పాటు బంధువులూ ఎప్పుడూ ఆమెకు అండగా నిలవడం కూడా ఈ నోముల్లోని అంతరార్థం. ◻

## వయసు ఆటంకం కాదు

నేనేమన్నా చిన్నపిల్లనా.... చెప్పగానే ఇట్టే పట్టేయడానికి వయసు పైబడ్డ వాళ్ళు ఇలాంటి మాటలు అనడం మనం వింటూ ఉంటాం. కానీ ఓ కళే, నైపుణ్యంతో నేర్చుకోవడానికి మనం చిన్నపిల్లలుగానే ఉండక్కర్లేదని చెబుతోంది ఈ అధ్యయనం. కోపెన్ హెగెన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన ఇది. నాట్యం, సంగీతం ... ఇలా నైపుణ్యం ఏదైనా సరే, చిన్నవయసులోనే ఒంట పడతాయి అన్న భావన మనలో ఉంటుంది. ఆ వయసుని గోల్డెన్ పీరియడ్ అంటుంటారు. కానీ ఒక విద్యను నేర్చుకోవడానికి గోల్డెన్ పీరియడ్ అంటూ ఏది ఉండదని స్పష్టం చేస్తోంది ఈ పరిశోధన, పదేళ్లలోపు పిల్లల్ని ఒక బృందంగా, పదహారేళ్లలో ఉండేవారిని ఒక బృందంగా, అలాగే ముప్పైఏళ్లలోపు వారిని ఒక బృందంగా తీసుకుని వారికి కొన్ని నైపుణ్యాలను నేర్పించారు. ఇందులో చిన్నపిల్లలు ఎలా చురుగ్గా నేర్చుకున్నారో పెద్దవాళ్లూ అంతకన్నా చురుగ్గా, వేగంగా నేర్చుకున్నారట. కాకపోతే.... ఎంత వేగంగా నేర్చుకున్నారో అంతే వేగంగా ఆ నైపుణ్యాలని మర్చిపోయారట. పెద్దవాళ్లకుండే బాధ్యత, నిద్రలేమి కారణంగా వాళ్ళు సాధన చేయకపోవడమే ఇందుకు కారణమని తేల్చారు. తప్పు మేధో అంతే వాళ్లికే సమస్య లేదని నిర్ణయించారు. కాబట్టి శ్రద్ధా, సాధనా తోడైతే ఎంత పెద్దవాళ్లైనా కొత్త అంశాలు నేర్చుకోవచ్చు. ◻

## రంగవల్లి






శాంతి నర్వా
సరూర్‌నగర్

21 చుక్కలు
3 వరుసలు
రథం ఆకారంలో
పెటుకోవలెను


18 చుక్కలు
6 వరుసలు
ఇటు అటు వదిలి
6 వరకు






జానకి , కెఆర్‌ఆర్ హిల్స్ , హైద్రాబాద్


32 చుక్కలు
6 పరుసలు
6 వచ్చే వరకు





ఎ. మహాలక్ష్మి , టాటానగర్ బెంగళూరు

16 చుక్కలు
2 వరుసలు
2 వనరే
సరిచుక్క





చాపాకు ఇందుసాయి
తడ సూళ్ళూరుపేట
తిరుపతి జిల్లా

# రెండో వన్డేలో.. భారత్ గ్రాండ్ విక్టరీ

## ఐర్లాండ్‌పై 2-0తో సిరీస్ కైవసం



**ఢిల్లీ:** ఐర్లాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత మహిళలు వరుసగా రెండో విజయం నమోదు చేశారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ 116 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి రికార్డు స్థాయిలో 370 పరుగులు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో దిగిన ఐర్లాండ్ 7 వికెట్లు నష్టానికి కేవలం 254 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, ప్రియా మిశ్రా 2, సాధు, సయాలి తలో వికెట్ తీశారు. సూపర్ సెంచరీచో అదరగొట్టిన జెమీమా రోడ్రిగ్స్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. ఇక భారీ లక్ష్య ఛేదనలో కౌల్టర్ (80 పరుగులు) మినహా పెద్దగా ఎవరూ రాణించలేక పోయారు. ఏ దశలోనూ ఐర్లాండ్ పోటీలో లేదు. టీమ్ఇండియా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేశారు. అయితే వికెట్లు పడకపోయినప్పటికీ ఐర్లాండ్ వేగంగా పరుగులు సాధించలేకపోయింది. ఫార్బెస్ (38 పరుగులు), డెలానీ (37 పరుగులు), పాల్ (27 పరుగులు) ఫర్వాలేదనిపించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ రికార్డు స్థాయి స్కోర్ (370 5 పరుగులు) నమోదు చేసింది. మహిళల వన్డే హిస్టరీలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోర్. జెమీమా రోడ్రిగ్స్ (102 పరుగులు; 91 బంతుల్లో 124) సెంచరీతో చెలరేగగా, ఓపెనర్లు స్మృతి మంధాన (73 పరుగులు), ప్రతీకా రావల్ (67 పరుగులు) హర్లీన్ డియోల్ (89 పరుగులు) హాఫ్ సెంచరీలు బాదారు. రిచా ఘోష్ (10) వేగంగా ఆడే క్రమంలో ఔట్ అయ్యింది. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా 2, కెల్లీ 2, డెంప్సీ ఒక వికెట్ తీశారు. తాజా విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 20తో కైవసం చేసుకుంది. ఇక ఇరు జట్ల మధ్య మూడో వన్డే జనవరి 15న జరగనుంది.

### ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో..

# తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన నగాల్



**ఢిల్లీ:** ఆస్ట్రేలిస్ట్రేయన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. బరిలో ఉన్న ఏకైక భారత ప్లేయర్ సుమిత్ నగాల్ తొలి రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ 25వ ర్యాంకర్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన టొమాస్ మఖచ్‌తో మెల్‌బోర్న్‌లో జరిగిన తొలి రౌండ్స్‌లో ప్రపంచ 91వ ర్యాంకర్ నగాల్ 3-6, 1-6, 5-7తో ఓడిపోయాడు. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు, 20 అనవసర తప్పిదాలు చేశాడు. 19 విన్నర్స్ కొట్టిన నగాల్ తన సర్వీసును ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీసును రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొలి రౌండ్లో ఓడిన నగాల్‌కు 1,32,000 ఆస్ట్రేలియన్ డాలర్ల (భారత్ కరెన్సీలో 69 లక్షల 94 వేల రూపాయలు) ప్రైజ్ మనీ లభించింది.

# హాకీ ఇండియా లీగ్‌లో.. కళింగపై 5-1 తేడాతో హైదరాబాద్ గెలుపు

### మహిళల హాకీలో ఒడిశా వారియర్స్ శుభారంభం

**ఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు విజయాల పరంపర కొనసాగిస్తోంది. తాజాగా వేదాంత కళింగ లాన్సర్‌నజట్టుపై నాలుగో విజయం నమోదు చేసింది.



వేదాంత కళింగ లాన్సర్స్ జట్టుతో రూర్కెలాలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 5-1 గోల్స్ తేడాతో గెలిచింది. తూఫాన్స్ తరఫున గొంజాలో పిలాట్ (6వ నిముషం, 30వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా, మైకో కసెల్లా (21వ నిమిషంలో), టిమ్ బ్రాం డ్ (47వ నిమిషంలో), అర్ దీప్ సింగ్ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. కళింగ లాన్సర్స్ జట్టుకు అలెగ్జాండర్ హెండ్రిక్స్ (5వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఆరు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ తూఫాన్స్ జట్టు 10 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది.

**ఒడిశా వారియర్స్ బోణీ..** కాగా రాంచీలో మొదలైన తొలి మహిళల హాకీ ఇండియా లీగ్‌లో ఒడిశా వారియర్స్ జట్టు శుభారంభం చేసింది. ఒడిశా వారియర్స్ 4-0 గోల్స్ తేడాతో ఢిల్లీ ఎస్జీ పైపర్స్ జట్టును ఓడించింది. ఒడిశా వారియర్స్ తరఫున యిబ్బీ జాన్సెన్ (16వ నిముషంలో, 37వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా, బల్జీత్ కౌర్ (42వ నిమిషంలో), ఫ్రీక్ మోయిస్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు.



# భారత్‌లో ఒలింపిక్స్!

### అహ్మదాబాద్ సహా వివిధ చోట్ల విశ్వక్రీడలు

**ఢిల్లీ:** కామన్వెల్త్ క్రీడలు-2010లో బహుళ క్రీడల టోర్నీకి చివరి సారిగా ఆతిథ్యమిచ్చిన భారత్, ఇప్పుడు 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆ విషయాన్ని తెలియజేస్తూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి ఓ లేఖను కూడా సమర్పించింది. అయితే అహ్మదాబాద్‌లో ఈవిశ్వ క్రీడలను నిర్వహించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ఈ క్రమంలో ఒకవేళ బిడ్ గెలిస్తే ఒక్క అహ్మదాబాద్‌లోనే కాకుండా దేశంలోని వివిధ నగరాల్లోనూ ఈ పోటీలను నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దేశంలో ఉన్న క్రీడా సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నదే వారి ఉద్దేశం. అయితే ఈ ప్లాన్ ఓకే చేసినా కూడా అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగానే పోటీలు జరుగుతాయని తెలుస్తోంది. ఖర్చును తగ్గించడం కోసం ఏ ఆతిథ్య దేశమైనా సరే ఒలింపిక్ క్రీడలను ఒకటి కంటే ఎక్కువ నగరాల్లో నిర్వహించడానికి వీలు కల్పించే ప్రతిపాదనకు అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) 2014లోనే ఆమోదం తెలిపింది. అందుకే ఒలింపిక్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కితే ఇక ఇక్కడి వివిధ నగరాల్లో ఉన్న క్రీడా వసతులకు తగినట్లుగా ఆయా ఈవెంట్లను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతాయి. ఎలా ఉంటే హాకీ కేంద్రంగా పేరున్న ఒడిశాలో హాకీ మ్యాచ్‌లను ఆడిస్తారు. అలాగే రోయింగ్ ఈవెంట్లను భోపాల్‌లో, ఆ తర్వాత కనోయింగ్, కయాకింగ్‌లకు పుణె వేదికగా మారనుంది. ఇక క్రికెట్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ లాంటి క్రీడలకు సంబంధించిన వేదికల గురించి ప్రభుత్వం అలాగే క్రీడా మంత్రిత్వశాఖ మధ్య చర్చలు జరుగుతున్నాయి. క్రికెట్ టోర్నీలను నిర్వహించేందుందుకు ముంబయి, దిల్లీ, అహ్మదాబాద్‌లు టాప్ ప్రియారిటీ లిస్ట్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఇండోర్ ఈవెంట్లకు చాలా వరకు అహ్మదాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదిక అయ్యే అవకాశం ఉంది. పెద్ద మొత్తంలో ఈవెంట్లను ఆర్గనైజ్ చేసేందుకు అవసరమయ్యే అన్ని వసతులు అక్కడ ఉన్నాయి. అయితే ఒలింపిక్స్ నిర్వహణకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను అధికారులు త్వరలోనే ఐసీసీకి సమర్పించనున్నట్లు సమాచారం. కాగా 2028 ఒలింపిక్స్‌కు లాస్‌ఏంజిలెస్, ఆ తర్వాత 2032 ఒలింపిక్స్‌కు బ్రిస్బేన్ ఆతిథ్యమివ్వనున్నాయి. అయితే 2036 ఒలింపిక్ నిర్వహణ హక్కుల కోసం భారత్‌తో పాటు దక్షిణ కొరియా, మెక్సికో, ఇండోనేసియా, తుర్కియే, పోలెండ్, ఈజిప్ట్ పోటీ పడుతుండగా, మరి ఎవరికి అవకాశం వస్తుందనేది సందేహాస్పదమవుతోంది.

# ఛాంపియన్ ట్రోఫీకి 6 టీమ్‌లు రెడీ





### తేలని మరో 2 జట్ల ప్లేయర్లు

### ఖరారు కాని భారత్, పాకిస్థాన్ స్క్వాడ్‌లు

**ఢిల్లీ:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీకి సన్నాహాలు మొదలయ్యాయి. ఈ సన్నాహాల్లో తొలి అడుగుగా ఇప్పుడు అన్ని క్రికెట్ బోర్డులు తమ జట్లులను ప్రకటిస్తున్నాయి. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో మొత్తం 8 జట్లు పోటీపడుతున్నాయి. ఈ ఎనిమిది జట్లలో 6 జట్లను ప్రకటించారు. పాకిస్థాన్, భారత్ తమ జట్లను ఇంకా ప్రకటించలేదు. ఆతిథ్య దేశమైన పాకిస్థాన్ ఈ వారంలోనే తమ జట్టును ప్రకటించే ఛాన్స్ ఉంది. ఆ తర్వాత టీమిండియా ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఖరారైన జట్లలో దక్షిణాఫ్రికా జట్టుకు సంబంధించి టెంబా బావుమా (కెప్టెన్), టోనీ డి జోర్జి, మార్కో జాన్సెన్, హెన్రిక్ క్లాసెన్, కేశవ్ మహరాజ్, ఐడెన్ మార్క్రామ్, డేవిడ్ మిల్లర్, వియాన్ ముల్డర్, లుంగి ఎన్గిడి, హెన్రిక్ నోకియా, కగిసో రబడ, ర్యాన్ రికెల్టన్, తబ్రెజ్సీ, టాబ్రెజ్సీ డస్సెన్, ట్రిస్టన్ స్టబ్స్ ఉన్నారు. ఇంగ్లండ్ జట్టులో జోస్ బట్లర్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెతెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, బెన్ డకెట్, జామీ ఓవర్టన్, జామీ స్మిత్, లియామ్ లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, జో రూట్, సాకిబ్ మహమూద్, ఫిల్ సాల్ట్, మార్క్ విల్ట్, న్యూజిలాండ్ జట్టులో మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ (వికెట్ కీపర్), కేన్ విలియమ్సన్, రచిన్ రవీంద్ర, విల్ యంగ్, మార్క్ చాప్‌మన్, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, నాథన్ స్మిత్, లాకీ ఫెర్గూసన్, బెన్ సియర్స్, విలియం ఒరోక్ మాట్ హెన్రీ, మైఖేల్ బ్రేస్‌వెల్, ఆఫ్ఘనిస్థాన్ జట్టులో హష్మతుల్లా షాహిదీ (కెప్టెన్), ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్, సెదిఖుల్లా అటల్, రహమత్ షా, ఇక్రమ్ అలీఖిల్, గుల్బాదిన్ నాయబ్, అజ్మతుల్లా ఒమర్జాహి, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, ఏఎం గజన్‌ఫార్, నొరల్‌హక్‌మెద్, ఫరూఖీ, ఫరీద్ మాలిక్, నవీద్ జద్రాన్, బంగ్లాదేశ్ జట్టులో నజ్ముల్ హుస్సేన్ శాంటో (కెప్టెన్), ముష్ఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), తౌహిద్ హృదయ్, సౌమ్య సర్కార్, తాంజిద్ హసన్, మహ్మదుల్లా, జాకర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, రిషద్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రహ్మాన్, అహ్మద్, పరిజుర్ రహ్మాన్ టాంజిమ్ హసన్, నహీద్ రాణా, ఆస్ట్రేలియా వన్డే జట్టులో పాట్ కమ్మిన్స్ (సి), అలెక్స్ కారీ, నాథన్ ఎల్లిస్, ఆరోన్ హార్డీ, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుషాగ్నే, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, మాట్ షార్ట్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోనిస్ జంపా ఉన్నారు.

## వాణిజ్యం

# ఆర్‌బిఐకి రాని రూ.2వేల నోట్లు రూ.6,700కోట్లు

**ముంబై, జనవరి 13:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి ఏడాదిన్నర దాటింది. అయితే 1.88శాతం కరెన్సీ నోట్లు ఇంకా వెనక్కి రాలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనవరి 1, 2025న అధికారికంగా ప్రకటించింది. ఆర్‌బిఐ డేటా ప్రకారం, తిరిగి రాని కరెన్సీ నోట్లు రూ.6,691 కోట్లు ఉందని తెలిపింది. 2023లో రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకున్నారు. తదనంతరం, భారతదేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో రూ.2000 నోట్లను డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను బ్యాంకులతో పాటు ప్రభుత్వ ఆమోదం పొందిన స్థలాల్లో డిపాజిట్ చేశారు. ఈ పథకం చెలామణిలో ఉన్నప్పుడు మొత్తం రూ.2000 నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇది డిసెంబర్ 31, 2024 నాటికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ అధికారిక గణాంకాలు తెలిపాయి. అంటే చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.12 శాతం తిరిగి వచ్చినట్లు ఆర్బీఐ ప్రకటించింది. దానికి సంబంధించి రూ.2 వేల నోట్లలో 1.88 శాతం తిరిగి రాలేదు. ఆర్‌బీఐ అధికా రిక గణాంకాల ప్రకారం దీని విలువ రూ.6,691కోట్లు. ప్రింటింగ్ నిలిపివేత గతంలో 2018-19లో రూ.2 వేల నోట్ల ముద్రణ నిలిచి పోయింది. అంటే రూ.1000, రూ.500 నోట్ల రద్దు తర్వాత ప్రజలకు డబ్బులు అందడంలో ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలోనే రూ.2 వేల నోట్లను ప్రవేశపెట్టారు. ఈ లక్ష్యం నెరవేరిన తర్వాత రూ.2వేల నోట్ల ముద్రణ నిలిపి వేసింది.



# బడ్జెట్‌పై బులియన్ మార్కెట్ ఆశలు..

**ముంబై, జనవరి 13:** ఫిబ్రవరి 1న యూనియన్ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశంఉంది. అయితే ఈ బడ్జెట్‌పైనే దేశంలో బులియన్ మార్కెట్ రంగం ఆశ లు పెట్టకుంది. ముఖ్యంగా బంగారంపై జీఎస్టీ విషయంలో కేంద్ర నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యాస్పెక్ట్ గ్లోబల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్, ఇండియా బులి యన్, జ్యువెలర్స్ అసోసి యేషన్ (ఐబీజేఏ) వైస్ ప్రెసిడెంట్ అక్ష కాంబోజ్ కేంద్రం తీసుకునే చర్యలపై తన అంచనాలను ఇటీవల సోషల్ మీడియాలో వెల్లడించారు. భారతఆర్థికవ్యవస్థ, సాంస్కృతిక వారసత్వంలో బంగారు రంగం కీలక పాత్ర పోషిస్తుందని కాంబోజ్ చెప్పారు. దిగుమతి సుంకాలను తగ్గించడం వంటి పోటీతత్వాన్ని పెంచే విధానాలను తమ ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి చర్యలుఅక్రమ దిగుమతులను అరికట్టవచ్చని వివరించారు. అలాగే గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌లకు మద్దతు ఇచ్చే చర్యలపై బులి యన్ మార్కె ట్ కూడా ఆసక్తిగా ఉందని వెల్లడించారు. ఈ కార్య క్రమాలు నిష్క్రియ బంగారం నిల్వల విలువను అన్ లాక్ చేయడంతో పాటు అధికారిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.



ఎలక్ట్రానిక్ గోల్డ్ రసీదుల (ఈజీఆర్ఎస్)లో ట్రేడింగ్‌లో ఉన్న అడ్డంకులను పరిష్కరించేందుకు తక్షణ ప్రభుత్వ జోక్యం అవసరమని కాంబోజ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా జీఎస్టీ సమ్మతిని క్రమబద్ధీకరించడంతో హాల్‌మార్కింగ్ నిబంధనలను స్పష్టం చేయాలని కోరుతు న్నారు. కేంద్రం బంగారంపై తీసుకునే మార్పు లు ఈ రంగం సామర్థ్యాన్ని విశ్వసనీయతను బలోపేతం చేస్తాయని కాంబోజ్ చెప్పారు. గ్రామీణ పొదుపు,

ఉపాధికి అంటే ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) గణనీయమైన సహకారాన్ని అందించే బంగారు రంగం, స్థిరత్వాన్ని నిర్ధారించే ఆర్థిక విధానాలను కోరుకుంటుందని వివరించారు. గిఫ్ట్ సిటీలో నగల ఎగుమతి కేంద్రాలు, టైర్ 2 నగరాల్లో చిన్న జ్యువెలరీ పార్కులను ఏర్పాటు చేయాలని పరిశ్రమ వాటాదారులు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలతో బంగారం ఎగుమతులు భారీగా పెంచుతాయని కాంబోజ్ చెప్పారు.

# ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలపై చర్యలు!

**ముంబై, జనవరి 13:** ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజాలు జొమాటో, స్విగ్గీలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఎఐ) సన్నద్ధమవుతోంది. ఈ కంపెనీ లు అనుసరిస్తున్న పద్ధతుల ద్వారా మార్కెట్ తటస్థత`కు భంగం వాటిల్లుతున్నట్లు తెలిపింది. దాంతో దేశ వ్యాప్తంగా వేలాది రెస్టారెంట్ల మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఎన్ఆర్ఎఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఫుడ్ ఐటమ్స్ డెలివరీ చేయడానికి జొమాటో, స్విగ్గీలు, బ్లింకిట్ బిస్ట్రో, స్విగ్గీ స్నాక్ వంటి ప్రత్యేక యాప్ లను ప్రారం భించాయి. దీని వల్ల మార్కెట్‌పై గుత్తాధిపత్యాన్ని చలాయిం చాలని భవిస్తున్నాయి. ఇది న్యాయబద్ధమైన పోటీకి వ్యతిరేకం అని విమర్శలున్నాయి. సంబంధిత వినియోగదారుల డేటాను రెస్టారెంట్లతో పంచుకోకుండా పోటీ ఉత్పత్తుల ను సృష్టించడానికి జొమాటో, స్విగ్గీ పకడ్బందీ విధా నాలు అనుసరిస్తున్నాయి. రెస్టారెంట్ డేటాను మాత్రం తమకుఅనుకూలంగా వినియోగిస్తున్నాయని ఎన్ఆర్ఎఐ పేర్కొంది. రెస్టారెంట్ పరిశ్రమ ప్రయోజనాలను పరి రక్షించడానికి అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన పరిష్కారాలను అనుసరించడానికి కట్టుబడి ఉన్నామని ఎన్ఆర్ఎఐ పేర్కొంది. జొమాటో, స్విగ్గీలు మార్కెట్‌పై గుత్తాధిపత్యం సాధించకుండా నిరోధించ డానికి సంబంధిత అధి కారులకు ఫిర్యాదు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటివి చేస్తున్నట్లు తెలిపింది. జొమాటో, స్విగ్గీ తమ వినియోగదారులకు భోజనంతో పాటు ఇతర ప్రత్యేక సేవలందించేందుకు కొన్ని యాప్‌లను ఇటీవల ప్రారంభించాయి. జొమాటో బ్లింకిట్ బిస్ట్రో పేరుతో కొత్త యాప్‌ను లాంచ్ చేసింది. భోజనం,స్నాక్స్, పానీయాలను 10 నిమిషాలు, అంతకంటే తక్కువ సమయంలో డెలివరీ చేస్తామని తెలిపింది.




# ఫేస్‌బుక్ నుంచి వైదొలగుతున్న యూజర్లు

**వాషింగ్టన్, జనవరి 13:** ప్రముఖ సోషల్ మీడియాకంపెనీ మెటా తాజా నిర్ణయం బూమ్ రాంగ్ లా మారింది. సోషల్ మీడియాలో పారదర్శకత ఉండాలనే స్ఫూర్తికి విరుద్ధంగా మారింది. దీంతో ఆ కంపెనీకి చెందిన సోషల్‌మీడియా ప్లాట్ ఫాంలు ఫేస్‌బుక్, ఇన్‌స్టా యూజర్లు తమ ఖాతాలను డిలీట్ చేస్తున్నారు. సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో సమాచార వ్యాప్తి వేగంగా జరుగుతోంది. అదేసమయంలో తప్పుడు, నిరా ధార వార్తలు కూడా వేగంగా జనంలోకి వెళుతున్నాయి. ఈ క్రమంలోనే పలు సామాజిక మాధ్యమాలు 'ఫ్యాక్ట్ చెకింగ్' ప్రమాణాలను పాటిస్తున్నా యి. తమ యూజర్లు పెట్టే పోస్టులకు సంబంధించి క్రాస్ చెకింగ్‌కు ఏర్పాట్లు చేశాయి. ఇందులో భాగంగా ఏదేని పోస్టుపై మిగతా యూజర్లు సందేహం వ్యక్తం చేస్తే సాంకేతి కత సాయంతో క్రాస్ చెకింగ్ చేసి నిజాలు వెల్లడించే అవకాశం కల్పిస్తున్నా యి. సోషల్ మీడియాలో పార దర్శకతకు ఫ్యాక్ట్ చెకింగ్ టూల్స్ సాయపడుతున్నాయి.




అయితే, మెటా కంపెనీ ఈ ఫ్యాక్ట్ చెకింగ్ వ్యవస్థను వినియోగించకూడదని తాజాగా నిర్ణ యం తీసుకుంది. తమ కంపెనీకి చెందిన ఫేస్‌బుక్, ఇన్ స్టా సహా పలు సామాజిక మాధ్యమాలలో పెట్టే పోస్టుల కు ఫ్యాక్ట్ చెకింగ్ మెజర్స్ పాటించబోమని ప్రకటించింది. ఈ నిర్ణయంపై సాంకేతిక నిపుణులతో పాటు ఫేస్ బుక్, ఇన్ స్టా యూజర్ల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమైంది.

మెటా నిర్ణయాన్ని నిరసిస్తూ యూజర్లు తమ ఫేస్ బుక్, ఇన్ స్టా ఖాతాలను డిలీట్ చేస్తున్నారు. ఆయా సామాజిక మాధ్య మాల నుంచి వైదొలుగుతున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.